సంపుటి: 30
సంచిక: 1

ఫోన్ నెం
64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 49 రూపాయలు.
జీవిత చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 325 రూపాయలు.

ఫిబ్రవరి, 1980

"Kattukolu Subba Reddy
Home Library, Pedaogirala

మేనేజింగ్ ఎడిటర్ :
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్ :
మిసెస్. మంజుల

సీనియర్ ఎడిటర్స్ :
వి. ఎస్. చెన్నూరి
వాసవదత్త
సుజనశ్రీ
ఏ. వీ. మోహనరావ్
విద్వాన్ శీలాదేవి

కట్టుకోలు సుబ్బారెడ్డి
పెద ఓగిరాల

"రచయితలతో ముఖాముఖి"

సికిందర్ గారూ!

మీ నవల 'పరువు ఖరీదు'లో జేమ్స్ హాడ్లీ ఛేజ్ రచించిన Have a change of scene పోలికలు కన్పించాయి. అయితే ఆ ఇంగ్లీషు నవల చదివిన తరువాత మీరీ నవల రాసారా? లేక, రెంటికి పోలికలు వుండడము కాకతాళీయంగా జరిగిందా?

—ఇందుసేన్, ఖమ్మం.

కాకతాళీయంగా అన్నీ జరుగవు. ఈ 'పరువు ఖరీదు' వ్యవహారం గురించి ఇదివరకు ఎడిటర్ గారికీ, మరికొందరికీ సమాధానాలు ఇచ్చాను. అసలు నేను రచయితను కావడమంటూ జరిగిందంటే అది పెర్రిమేసన్, ఆ తర్వాత ఛేజ్ నవలలు విపరీతంగా చదవడం వల్లనే. ప్రతి రచయిత మీద మరొక రచయిత ప్రభావం తప్పక వుండి తీరుతుంది-అంటే కాపీ చెయ్యడం కాదు. ఛేజ్ సైతం గ్రాహమ్‌గ్రీన్‌ను అనుసరించి ప్రసిద్ధుడయ్యాడు. అయితే, నా రచనల్లో ఛేజ్ ప్రభావం మీరు 'పరువు ఖరీదు' లోనే పసిగట్టడానికి కారణం, మీరు చెప్పిన నవలలోని కొన్ని సన్నివేశాల్ని మొదటి భాగంలో వాడుకోవడం. నా నవలకు ఆ సన్నివేశాల్ని ఇన్‌స్పిరేషన్‌గా తీసుకున్నాను. మొదటి భాగంలో కొన్ని సన్నివేశాలు మినహాయించి, ముగింపుతోసహా మిగిలిన రెండు భాగాలు నా స్వంతం. ఇకపైన ఇలాటి వివాదాస్పదమైన రచనలు నా నుండి రావు. శాస్త్రీయ పద్ధతుల్లో లాల్ అండ్ జాన్‌ల పరిశోధనలే వస్తాయి.

—సికిందర్.

యస్. గీతారాణి గారికి,

మీ రచనలంటే నాకు చాలా ఇష్టం. మీ రచనలు అపసలోనే గాక మరే పత్రికలోనైన ప్రచురించబడ్డాయా? మీ అడ్రసు తెల్పుతారా?

—కె. నాగభూషణం, బత్తలపల్లి.

మీకు నా రచనలు నచ్చినందుకు కృతజ్ఞతలు. కొన్ని సోషల్ పత్రికల్లో కూడా నా రచనలు ప్రచురింపబడ్డాయి. నా అడ్రసు— ఓరుగంటివారి స్ట్రీట్, విజయనగరం-2.

—యస్. గీతారాణి.

ఈ నెలలో...

కథలు (మాసపత్రిక)

4. హంతకుడి అంతు—ఏ.పి. మోహన్రావ్.
20. ఆత్మశక్తి—వసుంధర.
39. కామం-క్రోధం—భమిడిపాటి భాస్కర రామారావు.
56. దిష్టిచుక్క—కె. బి. ఎస్. కుమార్.
92. దిక్కులేని దేవుడు—వాణిశ్రీ.
106. ప్లేగు క్రిములు—ఎమ్.వి.వి. సత్యనారాయణ.
132. వాడిని చంపుతున్నాం—ఎస్. కృష్ణవేణి.
147. ముగ్గురు భార్యలు—అంధవరపు మల్లిబాబు.
159. పాపారావు స్కీము కథ—వసుంధర.
178. సీక్రెట్ గ్యాంగ్ (సీరియల్)—'సికిందర్'

నవలలు (సప్లిమెంట్)

3. బలవంతుడైన నేరస్థుడు—వసుంధర.
46. లాల్ అండ్ జాన్ గోడదూకిన హంతకి—'సికిందర్'
104. చంద్రహారం—వాణిశ్రీ.
141. నలుగురు గూండాలు—టెంపోరావ్.
182. పొగమంచు (సీరియల్)—ముద్దా సురేష్.

ఇవిగాక—క్రైమ్‌లో తమాషాలు, రచయితలతో ముఖాముఖి, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, మీ తీర్పు ఏమిటి, అపరాధ పరిశోధన పోటీ, పాఠకుల పరిశోధన పోటీ, జోక్స్, కార్టూన్లు, మరెన్నో ఆకర్షణలు!!!

శాంతకు డెంత తప్పు

ఎ.వి. మోహన్రావ్

మధ్యాహ్నం మూడుగంటలయింది.

చదువుతున్న నవలలో గుర్తుకోసం పేజీచివర చిన్న మడతపెట్టి పుస్తకం మూసింది శాంత. ఒళ్ళు విరుచుకొని లేచి వంటింట్లోకి వెళ్ళింది. గాస్‌స్టవ్ ముట్టించి, కాఫీకి నీళ్ళుపడేసి, బాత్‌రూంకెళ్ళి ముఖం కడుక్కొని వచ్చింది.

అప్పటికే నీళ్ళు కుతకుతమంటూ వుడుకుపట్టి శబ్దం చేస్తున్నాయి. పొడివేసి దించిపెడదామని, కాఫీపొడుం డబ్బా తీసింది. అందులో అడుగు కనుపించింది.

వెళ్ళి తెచ్చుకోవాలంటే షాపు చాలాదూరం వుంది. ఈలోపున స్టేట్ గవర్నమెంటులో పనిచేస్తున్న శ్రీవారు ఇంటికొచ్చేస్తారు. రాగానే కాఫీ ఇవ్వకపోతే నానా రాద్ధాంతం చేస్తాడని తెలుసు. ప్రొద్దున్న చూసుకోకపోవడం తనదే తప్పని అర్థమయింది. కాసేపు ఆలోచించి గబగబ ప్రక్కింటికి వెళ్ళింది.

"ఏం శాంతా! ఇలా వచ్చావ్?" అడిగింది తాయారమ్మ.

"కాస్త పనుండి...." అంటూ నసిగింది. ఆమెకు చేబదుళ్ళకోసం వెళ్ళడం ఇష్టముండకపోవడంతో అలవాటు కాలేదు.

"మొహమాట పడతావేం? చెప్పు!" అడిగింది తాయారమ్మ.

"ఒక గరిటె కాఫీపొడుం కావాలి? సాయంత్రం తెచ్చుకోగానే తిరిగి ఇచ్చేస్తాను" శాంతి చెప్పింది.

"దానికింత నానుస్తావేం? సంసారాల్లో యిలాంటివి చాలా మామూలు" అంది తాయారమ్మ. అలాగే లోనికెళ్ళి స్టెయిన్ లెస్ స్టీల్ డబ్బా తీసుకొచ్చి, దానిమూత తీసి అందులోనుండి కాఫీపొడుం ఒక గరిటెలో తీసి కాగితంలో వేసి పొట్లం కట్టిచ్చింది.

ఆమె పనిచేస్తున్నంతసేపూ శాంత స్టెయిన్ లెస్ డబ్బానే చూస్తూవుంది. చాలా అందంగానూ, నిగనిగ మెరుస్తూ వుంది. తన యింట్లో వుండే గ్లాస్కో డబ్బా దీనిముందు దిగదిడుపుక్కూడా పనికి రాదనిపించింది.

"ఎంతక్కొన్నారు?" అడిగింది శాంత.

"ఏంది? కాఫీపొడా?"

"కాదు! ఆ డబ్బా!"

"డబ్బులిచ్చి డబ్బాలుకొనే అలవాటు లేదు. ఇంట్లో పనికిరాని గుడ్డపీలికలు వేసి తీసుకుంటాను. మూడేళ్ళనాడు మొదలెట్టాను. ఇప్పుడు ఇంట్లో అన్నీ స్టీల్ వే అయినాయి. ఇవయితే తరతరాలు పనిచేస్తాయి. తుప్పు పట్టవు" అంది తాయారమ్మ డబ్బామూత పెట్టుకొంటూ.

"అవునండీ! నేనుకూడా సేకరించాలి. మీకు తెలిసిన వాళ్ళెవరన్నా వస్తుంటే నాకు చెప్పండి. మా యింట్లోనూ వున్నాయి పాతబట్టలు" అంది శాంత.

"దానికేం భాగ్యం. ఆదివారం అదివారం వస్తుంటుందా మనిషి! ఈమారు నీకు చెపుతాను" అంది తాయారమ్మ.

శాంత కాఫీపొడి తీసుకొని, ఇంటికి తిరిగి వచ్చేసింది. కాఫీడికాక్షను తయారుచేసి, బీరువాలోనివి, ట్రంకుల్లోనివి, అక్కడక్కడా మూటలు కట్టిపెట్టివున్నవీ, మొత్తం బట్టలు హాలుమధ్య పడేసింది.

ఒక్కొక్కటే చెక్ చేసి చూడసాగింది. పనికిరానివి. ఒక ప్రక్కకు గుట్టగా వెయ్యసాగింది. శ్రీవారి పాంట్లు, షర్టులు, పంచెలు, తనవి రవికలు, లంగాలు, బాడీలు, చీరలు మొత్తం ముప్పయిరెండు దాకా పోగయినాయి. అన్నీ విడిగా మూటకట్టింది. మిగిలినవన్నీ మడతలుపెట్టి బీరువాలో సర్దింది. అంతా ముగిసేసరికి గంటపట్టింది.

బాత్ రూంలో చేతులు కడుక్కుంటూ వుండగా తలుపు తట్టిన శబ్దం కావటంతో గబగబ వచ్చి తలుపు తెరిచింది.

కోటేశ్వరరావు నవ్వుతూ లోనికొచ్చి "ఏమిటి శాంతా? హడావుడిగా వున్నావు?" అడిగాడు చేతిలోవున్న పార్సెల్ తీసుకెళ్ళి, స్టీల్ బీరువాపైన పెడుతూ.

గ్లాసులో మంచినీళ్ళు తెచ్చియిచ్చి, "చెప్తాను" అంటూ వెళ్ళి, మళ్ళీ కాఫీ పట్టుకొచ్చి, అందిస్తూ చెప్పింది, తను చేసిన ఘనకార్యం.

"కొంపదీసి నా వంటిమీద బట్టలు కూడా వేసేస్తావేమో? నన్నోసారి చూడనీ" అన్నాడు కాఫీత్రాగడం పూర్తిచేసి.

"అలాగే! భోంచేశాక చూద్దురుగాని" అంది శాంత.

ఆ రాత్రి బట్టలమూట ముందేసుకుని కూర్చున్నారు యిద్దరూ. ప్రతిబట్ట గురించి, ఎంత గట్టిదో, ఎన్నాళ్ళు వాడవచ్చో, ఎంత చిన్నరిపేర్లున్నాయో, లెఖలుగట్టి, లాభనష్టాలు బేరీజువేసి, ఆ మూటలోంచి దాదాపు పదహారు బట్టలు, పనికొచ్చే లిస్టులోకి చేర్చాడు కోటేశ్వరరావు. శాంతకు లోలోపల నిరుత్సాహం, నీరసం, నిస్పృహ కలుగుతున్నాయి. తాయారమ్మలా ఐదేళ్ళు తంటాలు పడకుండా, ఒక్కదెబ్బతో ఇంట్లోకి కావలసిన సామగ్రి సమకూర్చుకోవాలనుకుంది. అందుకే వీలయినన్ని ఎక్కువ బట్టలు పోగుచేసింది. శ్రీవారు తీరా వాటిని సెన్సార్ చెయ్యడంతో మరో సంవత్సరమన్నా ఆగక తప్పదనిపించింది. సాధారణంగా తనమాటకు ఎదురు చెప్పనివ్వడు శాంతను, కోటేశ్వరరావు.

రాత్రికిద్దరూ హాయిగా నిద్రపోయారు.

2

మరుసటి దినం ఆదివారం. ఎక్కడో పనుందని కోటేశ్వరరావు ప్రొద్దున్నే వెళ్ళిపోయాడు. రాత్రిబాగా ప్రొద్దుపోయింతర్వాత వస్తానని చెప్పాడు. శాంతకు మనసులో సంతోషంగా వుంది. ఆ స్టెయిన్‌లెస్‌స్టీల్ మనిషి వచ్చేసరికి ఆయన కొంపలో వుండే ఒక రకాన బేరం కుదరనివ్వ

దేమోనిని ఆమెకు అనుమానం.

మధ్యాహ్నం మూడవుతుండగా, తాయారమ్మ ఒక మనిషిని వెంటబెట్టుకొచ్చింది. ఆ మనిషి నెత్తిన పెద్దబుట్ట, అందులో రకరకాల స్టీలుసామగ్రి, వాటిపైన చిన్న బట్టలమూట వున్నాయి. ఆమె చంకలో కట్టిన ఉయ్యాల్లో పసిబిడ్డ పడుకొని హాయిగా నిద్రపోతున్నట్లుంది.

"నే చెప్పానే! ఈమే!" అంటూ తాయారమ్మ పరిచయం చేసింది.

"తొందరగా బట్టలు తెండమ్మా! జరీవున్న చీరలుంటే మంచి గిన్నెలొస్తాయి. అలాంటివుంటే తెండి. అయ్యగారి టెర్లిన్ పాంట్లున్నా చాలు!" అంది ఆ మనిషి.

"ఉన్నవి తెస్తాను చూడు" అంటూ మూటతెచ్చి ముందుపెట్టింది శాంత.

"నే వెళ్తాను" అంటూ లేచింది తాయారమ్మ.

"నాకీ బేరం తెలీదు. తెలిసినవాళ్ళు మీరుంటే బాగుంటుంది" అర్థించింది శాంత.

"నాకూ వుండాలనే వుంది. కానీ పెద్దమ్మాయిని చూచేందుకు వస్తున్నారు. కొస్త పని చెయ్యాలిగా. ఈ మనిషి నమ్మకమైనదే!" అంటూ దానివైపు తిరిగి "న్యాయంగా ఇచ్చివెళ్ళు. నాకూ ఆవిడకు ఏం భేదంలేదు!" అంటూ తాయారమ్మ వెళ్ళిపోయింది.

ఆ మనిషి ఒక్కొక్క బట్టే తీసిచూపి, ప్రక్కన పెట్టుకోసాగింది. అన్నింటినీ తనిఖీచేశాక, తట్టలోవున్న వస్తువులన్నీ వెతికి, పసిపిల్లలకు పాయాసం పట్టించే చిన్నగిన్నె తీసిపెట్టింది.

"ఈ బట్టలన్నింటికీ నువ్విచ్చేది ఇదేనా?" అడిగింది శాంత ఉడికిపోతూ.



"అన్నీ కాటన్‌వి. చినిగి, చీకిపీలికలుగా వున్నాయి. పొత్తిగుడ్డలుగా తప్ప మరెందుకూ పనికిరావు. మాకు దానిమీద వచ్చేదాన్నిబట్టిగదా మీకు మేము యిచ్చేది" అందా మనిషి.

"అదేం కుదరదు. నీతో బేరం కుదరదు" అంది శాంత బట్టలబొత్తి తనవైపుకు లాక్కుంటూ.

"అలాగనకండి? మీకేం కావాలో అడగండి?" అందా మనిషి.

శాంత బుట్టను పరిశీలనగా చూసి, "ఈ నాలుగు డబ్బాలు కావాలి!" అంది ఆశగా.

"ఆ బట్టలిచ్చి యాభై రూపాయలియ్యండి ఇస్తాను" అందా మనిషి.

"వద్దు!" అంది శాంత.

"పోనీ ఇంకొన్ని కాస్త గట్టిగావున్న బట్టలివ్వండి" అంది మళ్ళీ.

రాత్రి కట్టిన మూటలోంచి రెండుగుడ్డలు తెద్దామని ఎదురుగావున్న బీరువా తెరవబోయింది. పైనున్న పేపరు పార్శిల్ 'ధన్'మని క్రిందపడింది. ఆ పడటంలో పైనున్న కాగితం, కూసుగావున్న బీరువా తలుపు అంచుకు తగిలి, చిరిగిపోయి అందులోంచి పాంటు షర్టు, క్రిందపడ్డాయి.

తెల్లటి షర్టునిండా రక్తం మరకలు కనుపించాయి. పాంటుకూడా దాదాపు అదే పరిస్థితిలో వుంది. భయంతో శాంత కంపించిపోయింది.

ఆ బట్టల పరిస్థితి స్టీలుడబ్బాల మనిషి గూడా చూసింది.

"ఏందమ్మా అంత రక్తం! ఎవర్నన్న చంపేశారా?" అడిగింది.

"ఏమో? ఇవి ఇక్కడికెలా వచ్చాయో తెలీటంలేదు!" అంది శాంత.

"అమ్మా! మీరు చూస్తుంటే చాలా మంచివారులా వున్నారు. ఎవరో మిమ్మల్ని ఇబ్బందిపెట్టాలిని చూస్తున్నట్లున్నారు. అవి నా కిచ్చెయ్యండి" అందా మనిషి.

శాంత క్షణం ఆలోచించి అతే మంచిదనిపించి, వాటిని యిచ్చేసింది. ఆ మనిషి వాట్ని, మిగిలిన బట్టల్ని మూట కట్టుకొని తట్టపై పెట్టుకొంది.

"నాకు యిస్తానన్న డబ్బాలు...." అంటూ అడిగింది శాంత.

"మీ కింతపెద్ద బెడద తప్పించినందుకు మీరు ఇచ్చిన బహుమానంగా ఈ పాతగుడ్డలు తీసుకెళ్తున్నాను" అంటూ వెళ్ళిపోయింది. కళ్ళ ముందే నిజం కలలా మారి, కరిగి నీరవడం చూసుకునేసరికి, కన్నీళ్ళు నిండాయి శాంతకు.

అంతలోనే ఆ రక్తసిక్తమైన బట్టలగురించి భయం పట్టుకొంది.

3

కోటేశ్వరరావు తిరిగి వచ్చేసరికి రాత్రి బాగా ప్రొద్దు పోయింది.

శాంత భయంతో బిక్కు-బిక్కు-మంటూ కళ్లల్లో వొత్తులు వేసుకుని కూర్చుంది. భర్తరాక లేటవుతున్నకొద్దీ ఆమెలో శతకోటి అనుమానాలు—సవాలక్ష సందేహాలు కలగ సాగాయి. ఈ పాటికి ఆయన్ను పోలీసులు అరెస్టు చేసి వుంటారనో, ఆచూకీల నిమిత్తం పోలీసులు ఏ క్షణంలోనైనా తనింటిపై దాడిచేస్తారనో అనిపించసాగింది. తీరా భర్తమొఖం చూసి విస్తుపోయింది.

"శాంతా! ఏమిటలా నీరసంగా వున్నావ్?" అడిగాడు బట్టలు మార్చుకుంటూ కోటేశ్వరరావు.

"ఏంలేదు! వొంట్లో కాస్త నలతగా వుంది" అంది శాంత.

"డాక్టరుకు చూపించుకోలేదూ...."

"లేదండీ. భోజనం వడ్డిస్తాను."

"వద్దు. నా భోజనం అయిపోయింది" అంటూ మంచమెక్కాడు.

శాంతకు భర్తను ఆ బట్టల విషయం అడుగుదామని వుంది. తీరా అడిగాక, తను వాట్ని చూసినందుకూ, ఆలోచన లేకుండా, యిచ్చేసినందుకు, కోపంతో పైనపడి కొడతాడేమోనని, భయంవేసింది. అందుకే దాని విషయం ఎత్తకుండా పడుకుంది. ఇద్దరూ నిద్రలో కొరిగిపోయారు.

అర్ధరాత్రి దాటాక పెద్దగా గావుకేక వినిపించింది. కోటేశ్వరరావు లేచి కూర్చున్నాడు. ప్రక్కనే శాంత

పడుకొనుంది. ఆమె గుప్పెళ్ళు బిగుసుకుపోయినాయి. కాళ్లు అటూ ఇటూ కొట్టుకుంటున్నాయి.

"శాంతా! శాంతా!" పిలిచాడు.

శాంత లేచి కూచుంది.

"ఎందుకలా కేకపెట్టావ్?"

"ఏమోనండి! ఏదో పాడుకల వచ్చినట్లుంది?" అంది శాంత.

"ఏమిటా కల?"

"ఏంలేదండీ! మీరెవర్నో హత్య చేసినట్లు, పోలీసులు మిమ్మల్ని పట్టుకెళ్ళి లాఠీలతో కొడుతున్నట్లు, మీరు ఏడుస్తున్నట్లు కలవచ్చింది" అంది శాంత.

"నేనా! హత్యచేయడమా? ఇదేం కల?"

"ఏమోనండీ! భయం పుట్టింది" అంది శాంత.

"భయపడకు. నేను హంతకుణ్ణి కాను. కాలేను. ఒకవేళ ఎవర్నన్నా హత్యచేసినా నన్ను పట్టుకునే వీలు, అవకాశం పోలీసులకు కల్పించేటంతటి వాజమ్మను కాను. నా గురించి నువ్వేమీ కంగారుపడనవసరంలేదు. ఆలోచనల్తో ఆరోగ్యం పాడుచేసుకోవద్దు" అన్నాడు కోటేశ్వరరావు లైటార్పి పడుకుంటూ.

శాంతకు భర్తమాటలు విచిత్రంగా వినిపించాయి. ఒకవంక హత్య చెయ్యలేదంటూనే మరోవంక హత్య చేసినా, తననెవ్వరూ పట్టుకోలేరని సవాలు చేశాడు. అంటే ఈయన కట్టుదిట్టమైన ప్లాను వేసుకుని, మరీ ఎవర్నో హరీమనిపించినట్లున్నాడనుకొంది శాంత. అలాంటి భయంకరమైన మనస్తత్వంగల మనిషితో తానింక కాపురం ఎలా చెయ్యడమాని కంపించిపోసాగింది.

తెల్లవారి లేచాక ఆ బట్టల పార్శిలు కనుపించకుంటే

ఇల్లంతా వెతుకుతాడు కోటేశ్వరరావు. ఆ తర్వాత తన్ను అడిగితే ఏమని చెప్పాలాని ఆలోచించసాగింది. చూడలేదంటే వింటాడా? వినడనిపించింది. ఇంట్లో వున్నది తామిద్దరే. కాబట్టి తనకు తెలీకుండా యెలా మాయమయిందని అడుగుతాడు. అందువల్ల ఏమని చెప్పాలాని ఆలోచించసాగింది.

నిజం చెప్తామనిపించింది. తన రహస్యం మరొకరికి తెలిపిందని తెలుసుకున్నాక, కల్లుతాగి, నిప్పులు తొక్కిన కోతిలా గంతులేస్తాడేమోనన్న అనుమానం కలిగింది. అసలే తిక్కమనిషి. అతనికి ఎలా చెప్పి తన్ను తాను రక్షించుకోవాలో అర్థంగాక అయోమయమైన ఆలోచనలు చేస్తూ దుప్పటి ముసుగుతన్ని పడుకుంది శాంత.

4

తెల్లవారాక కార్యక్రమం మామూలుగానే జరగసాగింది. కోటేశ్వరరావు హుషారుగానే వుండడం, శాంతకు కొంత శాంతి కలిగించింది. ఆయన అన్నం తిని, బట్టలు వేసు

కొని, ఆఫీసుకు వెళ్ళిపోయాడు. అప్పటిదాగా భయం భయంగానే వున్నదల్లా, ఆ తర్వాత ధైర్యం చిక్క బట్టుకుంది.

ఇంటిపనులన్నీ యధావిధిగా ముగించి, పన్నెండు కాగానే భోజనంచేసి పడుకుంది. రెండుగంటల ప్రాంతంలో యెవరో తలుపు తట్టినట్లయి లేచి వెళ్ళి తీసింది.

ఎదురుగా స్టెయిన్‌లెస్ సామానులిచ్చే మనిషి నిలబడి వుంది. నెత్తిన తట్టగానీ, చంకలో బిడ్డగానీ కనిపించలేదు.

"ఏమిటిలా వచ్చావ్?" అడిగింది శాంత.

"మీతో పనుండి" అంది.

"నాతోనా. ఏం పని?"

"నిన్న మీరిచ్చిన బట్టలు ఇంటికి తీసకెళ్ళాను. ఎవరింట్లోనో గుడ్డలు దొంగతనం పోయాయని, వాట్ని వెతుక్కుంటూ పోలీసులు మా యింటిపైన దాడిచేశారు. మీరిచ్చిన రక్తపు గుడ్డలు వాళ్ళ కళ్ళబడ్డాయి. నా మొగుడ్ని వాన్ ఎక్కించుకొనిపోయారు. మాకు ఏమీ తెలీదని చెప్పాం. ఆయన్ని తన్నారు. నన్ను కొట్టారు. మీ పేరు, యింటి అడ్రసు చెప్దామనుకున్నాను. కానీ అనవసరంగా మిమ్మల్ని కూడా ఇరికించినట్లవుతుందని, మానుకున్నాను. నా మొగుడ్ని యింకా లాకప్‌లోనే వుంచారు" అందా మనిషి.

అది చెప్పింది వినగానే ముచ్చెమటలుపోశాయి శాంతకు.

"మా యింట్లోనుండి తీసుకెళ్ళినట్లు చెప్పావా?" అడిగింది శాంత భయంగా.

"లేదమ్మా! నా మొగుడ్ని ఏమీ చెయ్యలేరు. ఆయన ధైర్యంగా వున్నాడు. కానీ ఇందులోంచి బైట పడాలంటే కాస్త ఖర్చవుతుంది. దానికోసం వచ్చాను," అందామె.

"ఏమాత్రం?"

"రెండు వందలు."

"అబ్బో అంత డబ్బే! నా దగ్గర యెక్కణ్నుంచి వస్తుంది?" అంది శాంత.

"పోనీలెండి? ఆ బట్టలు మీరిచ్చారని చెప్పేస్తాను. ఆ తర్వాత గొడవేదో మీరూ, మీ వారూ పడచ్చు." అంటూ ఆ మనిషి వెనక్కి ఆగింది

"వద్దు! వద్దు!" అంటూ ఆ మనిషి చెయ్యి పట్టుకొని ఆపింది శాంత.

"మరెలాగమ్మా!"

"నా దగ్గర డబ్బు లేదన్నాను. కానీ ...."

"చెప్పండి. సందేహించకండి."

"స్టీలు బిందెలున్నాయి రెండు? ఇస్తాను. వాటిన్ని ఎక్కడన్నా అమ్ముకో. నీకదేమంత కష్టంగాదు," అంది శాంత.

"బంగారం లేదా?" అడిగిందా మనిషి.

"ఈ దుద్దులు తప్ప మరేం లేవు. అవి యిస్తే మా ఆయన అనుమానిస్తాడు," అంది శాంత.

"సరే ఇవ్వండి!" అందా మనిషి.

శాంత లోనికి వెళ్ళి, రెండు స్టీలు బిందెలు తెచ్చి ఇచ్చింది. ఆ మనిషి అది తీసుకొని వెళ్ళిపోయింది.

క్రొత్తనీళ్ళొచ్చి పాతనీళ్ళను కొట్టుకుపోయినట్టయింది తనపని అనుకొంటూ కన్నీళ్ళు తుడుచుకుంది శాంత.

భర్తమీద కోపం వచ్చింది. కానీ భారత స్త్రీగా తన భర్తను రక్షించుకోవలసిన అవసరం, ధర్మం, తనకున్న దన్న విషయం గుర్తొచ్చి. పాడు బిందెలు పోతే పోయా యని అనుకుంది.

అంతలో తాయారమ్మ లోనికొచ్చింది 'శాంతా'అంటూ.

"ఏమిటండీ?" అడిగింది శాంత.

"అందరూ దానిదగ్గర స్టీలు గిన్నెలు కొంటూంటే, నువ్వు అమ్ముతున్నావేమిటి? మీ యింట్లోనుంచి అది బిందెలు తీలుకొనిపోతుంటే, నువ్వింట్లో వున్నావో, లేదో నని అనుమానంవేసి వచ్చాను!" అంది తాయారమ్మ.

"నేనే ఇచ్చాను. ఆ రెండూ తీసుకుని పెద్ద వాటర్ డ్రమ్ తెచ్చిపెట్టమన్నాను." అంది శాంత.

"అలాగా? అయినా బిందెలు వుంచుకొని అదికూడా తీసుకోలేకపోయావా?" అంది తాయారమ్మ.

"అవుననుకోండి. అసలే ఇల్లు చిన్నది. సామాను యెక్కువయితే మేమిద్దరం బైట వుండాల్సి వస్తుంది." అంది శాంత.

తాయారమ్మ వెళ్ళిపోయింది.

మరో అరగంట తర్వాత ఇంటిముందు మోటార్ సైకిల్ ఆగిన శబ్దం కావడంతో కిటికిగుండా చూసింది. పోలీస్ ఇన్‌స్పెక్టర్ కనుపించాడు. అతని యూనిఫాం చూడగానే గజగజ వణికిపోయింది.

అతను స్టాండువేసి తిన్నగా, తన ఇంటివద్దకి వచ్చాడు. చేతిలోవున్న కర్రతో రెండుసార్లు తలుపుపైన దబదబ కొట్టాడు. శాంత భయంతో తలుపు తీసింది.

"కోటేశ్వరరావు యిల్లు యిదేనా?" అడిగాడతను.

అవునన్నట్లు తలూపింది శాంత.

"ఉన్నారా?"

లేరన్నట్లు తల అడ్డంగా ఆడించింది.

"ఇప్పుడొస్తారా?"

తెలీదన్నట్లు పెదవి విరిచింది.

"మీకు మాటలు రావా?"

"వచ్చు." అంది శాంత మెల్లగా.

"మీవారు రాగానే టూటౌన్ ఇన్‌స్పెక్టర్ వచ్చి వెళ్ళాడని చెప్పండి. ఇంటికి రాగానే రమ్మన్నానని కూడా చెప్పండి. చాలా అర్జంటు. ఆయన రాకపోతే మళ్ళీ నేనే రావలసివస్తుంది" అన్నాడతను.

"చెప్తానండీ" అంది శాంత.

ఇన్‌స్పెక్టర్ వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు.

శాంతకు యేం చెయ్యాలో తోచలేదు. వ్యవహారం పోలీసుల చేతుల్లో పడిందన్న విషయం అర్థమైంది. ఆ మనిషి మొగుడ్ని నాలుగు తన్నగానే వాడు తన యింటి అడ్రసు చెప్పివుంటాడు. దీన్ని పట్టుకుని ఇన్‌స్పెక్టర్ వచ్చాడు. శ్రీవార్ని పంపించక తప్పదు. తీరా వెళ్ళాడంటే నాలుగు తన్ని నిజం కక్కిస్తారు. అప్పుడాయనకు యావజ్జీవ కారాగారశిక్షో, లేక ఉరిశిక్షో పడుతుంది. నూరేళ్ళ తన జీవితం, కాయ, పండూ లేకుండానే ఎండిపోవడం తలపు కొచ్చి తల్లడిల్లి పోయింది శాంత.

4

ఆరవుతుండగా వచ్చాడు కోటేశ్వరరావు. రాగానే యేడుస్తూ చెప్పింది అతనికోసం ఇన్‌స్పెక్టర్ వచ్చిపోవడం, తను రక్తసిక్తమైన బట్టలు, స్టీలు గిన్నెలదానికివ్వడం, అది తన్ను ఈ రోజు వచ్చి బెదిరించి బిందెలు తీసుకెళ్ళడం మొదలైన వివరాలన్నీ.

అన్నీ విన్నాడు కోటేశ్వరరావు.

"అసలా పార్సెలుతో నీకేం పనివచ్చింది?" అడిగాడు కోపంగా.

మాట్లాడకుండా మౌనంగా నిల్చుంది శాంత.

"మగవాడు లక్షపనులు చేస్తాడు సంసారంకోసం. ఆడవాళ్ళు తలపెడ్తే ఇలాటి అనర్థాలే జరుగుతాయి. హత్య చెయ్యగలిగిన వాణ్ని, అందులోంచి యెలా తప్పించు కోవాలో నాకు తెలియదనుకున్నావా?. పెద్ద ఆరిందాలా నన్ను రక్షించబోయి, నువ్వే పోలీసులకు పట్టిస్తున్నావ్. లక్ష్మణరేఖ దాటిన సీత గతి యేమయింది. నా మాట వినని నీ గతికూడా అంతే అవుతుంది." అంటూ చెప్పులు తొడు క్కొని వెళ్ళిపోయాడు వెలుపలకు.

"ఏమండీ! యేమండీ!" అంటూ పిలుస్తూన్నా విని పించుకోలేదు కోటేశ్వరరావు.

శాంత తల గోడకేసి బాదుకొంది. భర్త అన్న మాట ల్లోని నిజం తెలిసొచ్చింది తనకు. కానీ చేయి కాలిన తర్వాత, ఆకులు పట్టుకున్నట్లయింది తన పని. బుద్ధిగా ఆయన చెప్పినట్లు, ఏరిపెట్టిన బట్టలవరకు ఇచ్చివుంటే, ఈ సమస్యలన్నీ యేర్పడివుండేవి కాదుగదా అనుకుంది. తన కష్టాలు తనే కొనుక్కున్నందుకు లోలోపలే తిట్టు కొంది శాంత.

అలా యేడ్చి యేడ్చి సొమ్మసిల్లి పడిపోయింది మత్తె క్కిన నిద్రలో.

"శాంతా! శాంతా!" అంటూ ఎవరో పిలవడంతో తలెత్తి చూసింది. ఎదురుగా శ్రీవారు కనుపించారు.

"మీరా?" అంది ఆశగా.

"అవును. నేనే! ఏమిటలా అయిపోయావ్?" అడిగాడు.

శాంత లేచి కూచుంది. కోటేశ్వరరావు ప్రక్కనేవున్న పోలీస్ ఇన్‌స్పెక్టర్ని చూడగానే భయపడిపోయింది. వాళ్ళ ప్రక్కగా రెండు స్టీలు బిందెలు కనుపించాయి.

"అవెక్కడివండీ!" అడిగింది శాంత.

"మనవే!"

"తెచ్చారా?"

"ఆఁ!"

"మిమ్మల్ని పోలీసులు వదిలేశారా?"

"అసలు పట్టుకుంటేగదా చెల్లమ్మా!" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"అదేంటి ఇందాకవచ్చి మావార్ని స్టేషన్‌కి పంపమన్నారుగా?" అడిగింది శాంత.

"అవును. నేనూ మీవారు చిన్ననాటి స్నేహితులం. నాకీమధ్యనే ఈ వూరు బదిలీ అయింది. అప్పట్నించి మీ ఇంటికి రావాలని అనుకుంటూనే రాలేకపోయాను. అందువల్ల నన్ను మీకు తెలీదు." అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"మరి రక్తపు బట్టలు," అడిగింది శాంత.

"అవి నిజంగా రక్తపు మరకలే. కానీ మనిషి రక్తం కాదు. గొర్రె రక్తం. మేమొక నాటకం వేస్తున్నాం. అందులో నేను హత్య కాబడతాను. సీను రియల్‌గా వుండాలని, పాతబట్టలొక జత తీసుకెళ్ళి, కసాయివాడి దగ్గర రక్తపు మరకలు పూయించుకొచ్చి పైన పెట్టాను. నువ్వు లేనిపోని రభస చేశావు. ఇంకొన్నాళ్ళు గమ్మునుంటే ఇల్లంతా దోచుకునేదా స్టీలు సామాన్లు అమ్మే మనిషి." అన్నాడు కోటేశ్వరరావు.

"మన బిందెలు ఇచ్చిందా?" అడిగింది శాంత.

"ఊరకే ఇస్తుందా? రెండు తన్ని లాక్కొచ్చాను. అయినా ఇలాంటివాళ్ళను ఇళ్ళలోకి రానివ్వకండి. చాలా చోట్ల దొంగతనాలు, హత్యలు వాళ్ళద్వారానే జరిగినట్లు మా దగ్గర సాక్ష్యాలున్నాయి." అన్నాడు ఇన్‌స్పెక్టర్.

శాంత మనసు తేలికపడింది. □

అష్టలక్ష్మి

వసుంధర

నిర్మలకు గౌరీపతి చిన్నతనంనుంచీ తెలుసు. ఇద్దరూ ఒకే వీధిలో ఉండేవారు. ఒకే స్కూల్లో చదివేవారు. గౌరీపతి నిర్మలకంటె నాలుగు సంవత్సరాలూ, నాలుగు క్లాసులూ పెద్ద.

చిన్నప్పట్నించీ నిర్మల చలాకీ అయిన పిల్ల. ఎదుటి వాళ్ళను యేడిపించడంలో అందెవేసిన చేయి. మగపిల్లలు కూడా నిర్మలంటే భయపడుతూండేవారు. ఆమెకు వీళ్ళూ వాళ్లూ అన్న భయం లేదు. ఎంత గొప్పవారైనా ఎదిరించి మాట్లాడగలిగేది.

గౌరీపతిది పూర్తిగా నిర్మలకు వ్యతిరేకమైన మన స్తత్వం. తన చదువేదో తన గొడవేదో తప్పితే చుట్టుపక్కల ప్రపంచమంటే అతనికి భయం. అతను స్ఫురద్రూపి. మనిషికూడా బలంగానే ఉంటాడు. కానీ అతని మనసు బలహీనమైన కారణంగా అతను చాలామందికి అలుసై పోయాడు.

స్కూల్లో టీచర్సుకి గౌరీపతి అంటే వేళాకోళం. ఆడ పిల్లల సంగతి వేరే చెప్పక్కర్లేదు కదా!

గౌరీపతి స్నేహితులంటూ ఎవ్వరూలేరు-ఒక్క నిర్మల తప్ప! ఆ స్నేహమైనా అంతంతమాత్రంగా వుండవల సిందే కానీ ఒక చిన్న సంఘటనతో అది అనుకోకుండా బలపడింది.

ఒకరోజు నిర్మల ఒక్కర్తీ స్కూల్నించి ఇంటికి వస్తోంది. అప్పుడు ఆమె ఫస్టుఫారం చదువుతోంది. ఆమె ముందు అయిదుగురు ఫిఫ్తుఫారం కుర్రాళ్లు నడుస్తున్నారు. వాళ్లలో గౌరీపతి ఉన్నాడు.

నలుగురు కుర్రాళ్లూ మాట్లాడుతూంటే గౌరీపతి ఒక్కడూ మౌనంగా ఉన్నాడు. ఆ నలుగురూ గౌరీపతి మీద విసురుతున్న విసుర్లు ఇన్నీ అన్నీ కావు. గౌరీపతి అన్నీ మౌనంగా భరిస్తున్నాడు.

"వీడి చేతినేమిట్రా అలా తెల్లగా ఉండిపోయింది - అన్నట్లుదయం వాళ్లమ్మకు పిండిరుబ్బి చెయ్యి సరిగ్గా

కడుక్కొనుండడు-అది యెండిపోయింది-" అన్నాడొకడు.

"తల్లికి పిండి రుబ్బిపెట్టడంలో తప్పులేదు కానీ చెయ్యి సరిగ్గా కడుక్కోవడం నేర్చుకోవాలిరా గౌరీపతీ-రేపట్నించి అలా చేయి. రేపు స్కూల్కి వచ్చేటప్పుడు మాకేదైనా టిఫిన్ తెచ్చిపెట్టు-లేకపోతే మీ అమ్మకు పిండి రుబ్బుతున్నావని అందరికీ చెప్తాను-" అన్నాడింకొకడు.

"బాబోయ్-వీడు టిఫిన్ తెస్తే అది తినేదెవరు? ఏ చేగోడీలో, జంతికలో తెస్తాడు!" అన్నాడింకొకడు. అందరూ ఘొల్లుమనిపోయారు.

"నేను నిజంగా మా అమ్మకు పిండి రుబ్బలేదురా. పిండి రుబ్బడం నాకు చేతగాదు-" అన్నాడు గౌరీపతి దీనంగా. కంఠంలో యేడుపు ధ్వనిస్తోంది.

ఇంతలో అలా దారిన పోతున్న ముష్టాడ్ని చూపి.... "ఒరేయ్ మీ మామయ్యరోయ్-నిన్ను పలకరించకుండా వెళ్ళిపోతున్నాడేంటి?" అన్నాడింకొకడు.

అందరూ పకపకా నవ్వేశారు. గౌరీపతి కళ్ళనీళ్ళు చేత్తో తుడుచుకున్నాడు.

సాధారణంగా నిర్మలకిలాంటివి సరదాగానే ఉంటాయి. కానీ గౌరీపతి ఒక్కడూ అయిపోవడమూ, అతనికి ఏడుపు వస్తుండడమూ, అతను తన వీధిలోనివాడు కావడమూ ఆమెకు అతనిపట్ల సానుభూతిని కలిగించాయి.

నిర్మల చకచకా నాలుగడుగులు వేసి వాళ్ళను దాటి వెనక్కు తిరిగిచూసి-"అరె గౌరీపతీ నువ్వా-ఈవేళ నువ్వు రావనుకున్నాను-మధ్యాహ్నం మీ కలెక్టర్ మామయ్యొచ్చాడుగా-అయినా నువ్వు వీళ్ళతో వస్తున్నావేమిటి? ఇలాటి అలగావాళ్ళలో తిరిగితే మీ మామయ్యేమనుకుంటాడా?" అంది.

ఆమె మాటలు గౌరీపతికి సరిగ్గా అర్థం కాలేదు. ఈలోగా అతన్నేడిపిస్తున్నవాళ్లలో ఒకడు- "ఏయ్ పాపా మాటలు తిన్నగా రానీ—" అన్నాడు.

నిర్మల చటుక్కున ఒక్కసారి తలెత్తి అతన్ని చూసి- "మీ చేతుల్లో పుస్తకాలున్నాయి కదూ — స్టూడెంట్సే అయి ఉంటారు. క్షమించండి-ముఖాలు చూసి అలగా వాళ్ళనుకున్నాను—"అని .... "రా, గౌరీపతీ—మీ కలెక్టరు మామయ్య నీ కోసం ఎదురుచూస్తూంటాడు...." అంది.

కలెక్టర్ మామయ్యనగానే ఆ కుర్రాళ్ళు భయపడ్డారు. వాళ్ళ చుట్టాల్లో యెవరికీ అంత హోదా గల మామయ్యే ల్లేరు. నిర్మల తమ ముఖాలు చూసి అలగావాళ్ళనుకోవడం మరికాస్త ఇబ్బంది పెట్టింది. అమాయకంగా కనిపించే నిర్మల అందులోనూ ఆడపిల్ల తమతో వేళాకోళమాడు తుందని వాళ్ళూహించలేదు. అందువల్ల వాళ్ళప్పటికి శాంతంగా వూరుకున్నారు. గౌరీపతి, నిర్మల కలిసి పక్క సందులోకి వెళ్ళిపోయారు.

అప్పుడు గౌరీపతి నిర్మలనేదో అడగబోయాడు. నిర్మల అతన్ని వారించి—"కాస్త చలాకిగా ఉండడం నేర్చుకో గౌరీపతీ—కలెక్టరు మామయ్యలాంటి అబద్ధాలు నీ హోదాను పెంచుతాయి. అలగా జనంలాంటి ముక్కలు వాళ్ళ బ్రతుకేమిటో వాళ్ళకు చెబుతాయి—" అంది పెద్ద ఆరిందాలా.

గౌరీపతి బాగా ఆశ్చర్యపడ్డాడు కానీ యేమీ మాట్లాడ లేదు.

మర్నాడు నిర్మల స్కూల్నించి వస్తూంటే ఆ నలుగురు కుర్రాళ్ళు ఆమెను దారి కాశారు. అప్పుడామెతోపాటు

గౌరీపతి కూడా ఉన్నాడు.

"ఏమే-నీ కంటికి ఇలాగాజనంలా కనబడుతున్నామా!" అంటూ ఆమెను బండబూతులు తిట్టి రోడ్డు పక్కకు లాగారు. నిర్మల అసహాయురాలై కేకలు వేసింది. గౌరీపతి చోద్యం చూస్తున్నాడు.

"నన్నేమైనా చేశారో గౌరీపతి మీ తాట వలిచేస్తాడు" అంది నిర్మల.

"నీ ముఖానికి వాడుతప్ప ఇంకెవరూ హీరోలా కనిపించరు కాబోలు" అంటూ ఒకడు ఆమె వీపుమీద గట్టిగా గుద్దాడు. నిర్మల పెద్దకేక పెట్టి "గౌరీపతీ వీళ్ళు నన్ను చంపేస్తున్నారు" అంది.

గౌరీపతి కదలకుండా చోద్యం చూస్తున్నాడు.

అప్పటికి ఆ నలుగురు కుర్రాళ్ళకీ నిర్మల ఆడపిల్ల అన్న విషయం గుర్తుకు వచ్చింది. పదకొండేళ్ళ ఆ పాపతో సుమారు పదహారేళ్ళ వయసుగల ఆ బాలురు తమ మిడి మిడిజ్ఞానాన్ని ప్రదర్శించే అసభ్య శృంగారచేష్టలు చేయడానికి తలపడ్డారు. అప్పటికీ గౌరీపతి చోద్యం చూస్తున్నాడు.

నిర్మలకు భయంవేసింది. ఆమె చటుక్కున ఒకచేత్తో ఒకణ్ణి గిల్లి మరోచేత్తో ఒకణ్ని తోసేసి, మరీ దగ్గరగావున్న ఒకణ్ని గట్టిగా కరిచేసి ఒకే పరుగు లంకించుకుంది. ఆ సమయంలో ఆమె కాళ్ళలోని వేగం ఎక్కణ్నించి వచ్చిందో తెలియదు కానీ ఆమె మెరుపులా మాయం కాగలిగింది.

అప్పటికీ గౌరీపతి చోద్యం చూస్తున్నాడు.

వాళ్ళు నలుగురూ గౌరీపతి దగ్గరకు వచ్చి "నీ మీద మాకేం కోపంలేదు. నువ్వు మంచివాడివే. ఈ రోజు



కెలాగో అది తప్పించుకుపోయింది. ఏదో ఒక రోజున దానికి గట్టిగా బుద్ధిచెప్పి తీర్తాము" అన్నారు.

"బుద్ధి అంటే" అన్నాడు గౌరీపతి.

"గుడ్డలిప్పేస్తాం" అన్నాడొకడు.

"ఇప్పేసి....?" అన్నాడు గౌరీపతి.

"రోడ్డుమీద అటూ ఇటూ పరుగులెట్టిస్తాం" అన్నాడో కుర్రాడు.

వెంటనే వాడిచెంప చెళ్ళుమంది. వాడు రియాక్టయ్యే లోగా గౌరీపతి విజృంభించాడు. కొద్దినిముషాల్లో అతను వాళ్ల నలుగుర్నీ చావగొట్టి తరిమేశాడు. తర్వాత కళ్లు నులుముకుని తిన్నగా నిర్మల ఇంటికి వెళ్ళాడు.

"నన్ను క్షమించు నిర్మలా!" అన్నాడు నిర్మలతో.

నిర్మల అతనివంక అసహ్యంగా చూపింది.

"నేనేం చేయను? ఏ పని చెయ్యాలన్నా నాకు భయం. చదువుతప్ప రెండోధ్యాస లేదు నాకు. వాళ్లు నలుగురున్నారు. వాళ్ళను నువ్వు అనవసరంగా రెచ్చగొట్టావు. అనుభవిస్తున్నావు అని వూరుకున్నాను. నేను కలగజేసుకోకపోతే నీ ఒక్కడికే దెబ్బలు తగుల్తాయి. కలగజేసుకుంటే మనిద్దరికీ దెబ్బలు తగుల్తాయి. అందుకే ఊరుకున్నాను."

నిర్మల యింకాస్త పెరిగిన అసహ్యంతో అతని వంక చూసింది.

"నువ్వు వెళ్ళిపోయాక నీ గురించి చాలా అసహ్యంగా మాట్లాడారు వాళ్లు. అప్పుడు నాకు చాలా ఆవేశం కలిగింది. నేనొక్కణ్నీ వాళ్ళు నలుగురూ అని మరిచిపోయాను. ఎక్కణ్నించి వచ్చిందో నాకు బలం. నలుగుర్నీ చావదన్నేశాను" అన్నాడు గౌరీపతి.

నిర్మల కళ్ళు మెరిశాయి. నమ్మలేనట్లు ఆశ్చర్యంగా అతనివంక చూసి "నువ్వు వాళ్లు నలుగుర్నీ కొట్టావా? నిజమే చెబుతున్నావా?" అంది.

"నిజం — ఒట్టు — సత్యప్రమాణకం!" అన్నాడు గౌరీపతి

"నా కిప్పుడు చాలా సంతోషంగా వుంది" అంది నిర్మల. గౌరీపతి—ఎంతో పిరికివాడనుకున్న గౌరీపతి— నలుగురు కుర్రాళ్ళను తానొక్కడే కొట్టాడు. అదీ తనమీద అభిమానంతో! గర్వంతో నిర్మల ముఖం వెలిగిపోయింది.

"కానీ నాకు భయంగా వుంది" అన్నాడు గౌరీపతి "వాళ్ళు నా మీద పగబట్టి నన్ను మళ్ళీ కొడతారేమోనని భయంగా వుంది."

నిర్మల జాలిగా అతనివంక చూసి "నలుగుర్నీ కొట్టగల

శక్తి వున్న నీ కింకా భయమెందుకు?" అంది.

"అప్పుడెలా కొట్టానో తెలియదు. కానీ మళ్ళీ కొట్ట గలననిపించడంలేదు" అన్నాడు గౌరీపతి.

అయితే మర్నాడు నిర్మల చేయవలసిన పని చేసింది. ఆ ఫిర్యాదుప్రకారం కుర్రాళ్ళని కలుసుకుని తన విషయంలోగానీ గౌరీపతి విషయంలోగానీ వాళ్ళు జోక్యం చేసుకుంటే జరిగిన విషయం హెడ్మాస్టరుకు ఫిర్యాదు చేస్తానంది. కుర్రాళ్ళు భయపడి ఆమె చెప్పినట్లు విన్నారు.

ఆ తర్వాత గౌరీపతి, నిర్మలల స్నేహం బాగా బల పడింది.

2

ఇప్పుడు నిర్మలకు పద్దెనిమిదేళ్లు. ఇంటర్మీడియేట్ ప్యాసై యింట్లోనే వుంది. తలిదండ్రులామెకు పెళ్ళి సంబంధాలు చూస్తున్నారు.

స్వతహాగా అందగత్తె అయిన నిర్మలకు వయసు మరిన్ని అందాలు సంతరించి పెట్టింది. ఆమె తండ్రి మరీ ఎక్కువ కట్నం ఇవ్వలేడు కానీ లేకపోతే చాలా మంచి సంబంధాలే నిర్మలకు రావలసింది.

గౌరీపతి ఆ ఊళ్ళోనే ఓ గుమాస్తా వుద్యోగం సంపా దించాడు. అతనికి నిర్మలను చేసుకోవాలనుంది. తల్లికి ఆ విషయం చూచాయగా చెప్పాడు. అంతమాత్రమే అతను చేయగలిగిన ధైర్యం.

గౌరీపతి చెల్లెలికి కూడా పెళ్ళిసంబంధాలు చూస్తున్నారు. ఆ పెళ్ళిఖర్చులకు సరిపడ పదిహేనువేలూ కట్నం ఇస్తే ఏ పిల్లనైనా చేసుకోవచ్చునని గౌరీపతి తండ్రి అన్నాడు. నిర్మలతండ్రి పదిహేనువేలు కట్నం ఇవ్వలేనన్నాడు. ఆ సంబంధం అలా చెడిపోయింది.

గౌరీపతికి నిర్మలను చేసుకోవాలనుంది. అందుకని అతను తనకున్న పరిచయాన్ని పురస్కరించుకుని ఒకసారి నిర్మలను కలుసుకుని మాట్లాడాడు.

"నేను చలాకీపిల్లని. నువ్వు ముద్దకుప్పవి. మనకు సంబంధం కుదరదు" అంది నిర్మల తెగేసి. గౌరీపతిలాంటి వాడుకూడా తనలాంటి పిల్లను చేసుకుందుకు పదిహేను వేలు కట్నం అడగడం ఆమెకు చాలా బాధను కలిగించడం వల్ల అంత ఖచ్చితంగా చెప్పగలిగింది.

అతనింకా ఏదో మాట్లాడబోగా "నా లాంటి పిల్ల నేను చేసుకుంటానంటే అదే పెద్దవరం నీకు. దానికి మళ్ళీ కట్నం కూడా కావాలా? నీతో పెళ్ళి నా కిష్టంలేదు" అంది నిర్మల.

గౌరీపతి మౌనంగా అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

నిర్మలకు అతనిపై చాలా కోపం వచ్చింది. ఈ ఊళ్ళో వున్న అందగత్తె లందర్నీ లెక్కవేస్తే మొదటి పదిమంది లోనూ తనూ వుండితీరాలి. దానికితగ్గ తెలివితేటలు. లేత వయసు. ఇటువంటి అర్హతలున్న తనను గౌరీపతిలాంటి అప్రాచ్యుడు కూడా కట్నం అడిగాడు.

తన విలువ ఋజువుచేసుకోవాలని నిర్మలకు అనిపించింది. గౌరీపతికంటే అన్నివిధాలా ఎన్నికైన సంబంధం తను కట్నంలేకుండా చేసుకోవాలి. అందుకు తన అందచందాలు, తెలివితేటలు వినియోగించాలి ఇలా అనుకున్న ఆమెకు అతికొద్ది రోజుల్లోనే సుధాకర్ గురించి తెలిసింది.

సుధాకర్ ఆమెకు బంధువుల అబ్బాయి. ఊళ్ళో పుస్తకాల వ్యాపారం. స్వంత కారు మెయింటైన్ చేసేటంత డబ్బుంది. గౌరీపతిలాగే బియ్యే ననిపించాడు. ఎటొచ్చీ మనిషి చాలా స్టైయిలుగా వుంటాడు. ప్రస్తుతం అతను

పుస్తకాల షాపులోనే కూర్చుంటున్నాడు.

పుస్తకాల పంకతో చాలాసార్లు నిర్మల పుస్తకాల షాపుకి వెళ్ళింది. అక్కడ సుధాకర్ని చూసి కావాలని కాస్త ఎక్కువ పిగుపడి అతని దృష్టిలో పడింది. అప్రయత్నంగా పైట జారవేసి కొద్దిగా జాప్యంచేసి సవరించుకుని అతన్ని మరికాస్త ఆకర్షించింది. ఇవన్నీ కలిపి అతనికి ఆమె ఎవరో తెలుసుకోవాలన్న ఆసక్తిని కలగజేశాయి. ఆమె తనకు దూరపుబంధువులమ్మాయే అని తెలిసేసరికి అతనికీ ఉత్సాహం కలిగింది.

తనుపయోగించిన ట్రిక్కు కాస్త చీప్ రకంవి అని నిర్మలకు తెలుసు. అతనికి తనపైన చులకనభావం కలగ వచ్చునని కూడా ఆమెకు అనిపించింది. అయితే ప్రత్యేకంగా అతన్నాకర్షింపజేయడానికి అంతకంటే వేరే ఉపాయ మామెకు తోచలేదు.

సుధాకర్ నిర్మలతో బంధుత్వం గురించి కదిపాడు. తనకు పుస్తకాలపిచ్చి అని నిర్మల చెప్పింది. రోజూ షాపుకి వచ్చి పుస్తకాలు జాగ్రత్తగా చదివి పెట్టేసి వెళ్ళిపోవచ్చునన్నాడు సుధాకర్. వీలున్నప్పుడల్లా వస్తానంది నిర్మల. కానీ తరచుగానే వెడుతూండేదామె. ఒక రోజతను "మీ రిక్కడకు రావడమేగానీ మీ ఇంటికి రమ్మనడంలేదు" అన్నాడు.

"మీతో నాకు ముఖపరిచయమే కానీ స్నేహంలేదు. ముఖపరిచయాలున్న వాళ్ళను ఇళ్ళకు ఆహ్వానించడం ఆడపిల్లకు మర్యాదకాదు" అంది నిర్మల.

"మనకు దూరపు బంధుత్వముంది" అన్నాడు సుధాకర్.

"బంధువులింటికి ఆహ్వాన ముంచితే కానీ రారా"

అంది నిర్మల.

"సరే ఈ రోజే వస్తున్నాను. నా కార్లో మనిద్దరం మీ ఇంటికి వెళదాం" అన్నాడు సుధాకర్.

సరేనంది నిర్మల.

కార్లో సుధాకర్ అనుకున్నట్లుగా ఫ్రంట్ సీట్లో కాక బ్యాక్ సీట్లో కూర్చుంది నిర్మల. అతను బాగా నిరుత్సాహ పడ్డాడు. అయితే కారు తిన్నగా బీచికి తీసుకువెళ్ళి ఆపాడు.

"ఇక్కడ ఆపారేమిటి?" అంది నిర్మల.

"ఈ సమయంలో బీచి దగ్గర గడపడం నాకు అలవాటు" అన్నాడు సుధాకర్.

"సరే అలాగే చేయండి. నేనిక్కడ్నించి బస్సుమీద వెళ్ళిపోతాను" అంది నిర్మల.

"కాసేపు బీచీ దగ్గర నాతో కబుర్లు చెప్పకూడదా?" అన్నాడు సుధాకర్.

"ఎవరైనా చూస్తే బావుండదు" అంది నిర్మల.

"ఎందుకని?"

"మనం నిర్మలమైన హృదయంతో మామూలు కబుర్లు చెప్పుకోవచ్చు. కానీ తెలిసిన వాళ్ళెవరైనా చూసి విపరీతార్థాలు కల్పించుకోవచ్చును. అది నా కిష్టముండదు" అంది నిర్మల.

"నాతో ఏకాంతంగా మాట్లాడడం మీ కిష్టముండదా? అందుకోసం చిన్నచిన్న త్యాగాలు చేయలేరా?" అన్నాడు సుధాకర్.

"పెళ్ళికి ముందు పరపురుషులతో ఏకాంతంగా తిరగడం మా సంప్రదాయం కాదు. మీరు లిఫ్టు ఇస్తున్నారు గదా అని కారెక్కాను" అంది నిర్మల.

మనసులో ఆమెకు చాలా సంతోషంగా వుంది.



సుధాకర్ కి తనపట్ల ఆకర్షణ పెరుగుతోంది. అదే సమయంలో ఇదివరలో తనపట్ల అతనికి చులకనభావాలేమైనా కలిగివుంటే అవన్నీ పోయుంటాయి. ఉండుండి అతడి ముఖకవళికల్ని గమనిస్తోందామె.

"ఆల్ రైట్!" అని అతను మళ్ళీ కారెక్కాడు. కారు ఈ పర్యాయం తిన్నగా నిర్మల ఇంటికే వెళ్ళింది.

ఆ విధంగా నిర్మల కుటుంబంతో పరిచయమైంది సుధాకర్ కి. తర్వాతనుంచి అతను తరచుగా ఆ ఇంటికి వస్తూ పోతూ వుండేవాడు. నిర్మల అతనికి అందీ అందనట్లు ఊరిస్తూ తనపట్లగల ఆకర్షణను తెలివిగా పెంచుకుంటూ వస్తోంది.

"మనిద్దరమూ నిర్భయంగా కలిసి ఏకాంతంగా తిరగడానికి ఏం చేయాలి?" అన్నాడొక రోజున సుధాకర్.

"నీకే తెలుసు" అంది నిర్మల.

"తెలుసునులే. వివాహమయ్యేవరకూ ఆగాలా లేక వివాహం కాబోతున్నటు చెప్పేస్తే చాలా?"

నిర్మల కళ్ళు మెరిశాయి "కాబోయే దంపతులుగా బయట తిరగడానికి నా కభ్యంతరంలేదు. ఎటొచ్చీ బీచికీ, సినిమాలకూ మాత్రమే వస్తాను" అంది.

"అయితే నేనంటే నీకు ఇష్టమేనన్నమాట ...చాలా థాంక్స్. మా వాళ్ళతో మాట్లాడి పెళ్ళిచూపులు ఏర్పాటు చేయిస్తాను" అన్నాడు సుధాకర్.

నిర్మలకు కలిగిన ఆనందమింతా అంతా కాదు "ఆర్థికంగా మీ కున్న హోదా మాకులేదు. కట్నం ఎక్కువడిగితే మా వాళ్ళు తూగలేరు" అంది.

"నిన్నుమించిన కట్నం వేరే ఏముంది? పైసాకూడా అక్కర్లేదు మాకు" అన్నాడు సుధాకర్.

"కలా? నిజమా ఇది" అనుకుంది నిర్మల.

3

"సారీ-నిర్మలా-పెళ్ళిచూపులు తాత్కాలికంగా వాయిదా పడ్డాయి" అన్నాడు సుధాకర్.

నిర్మల దెబ్బతిన్నట్లు ముఖంపెట్టి "ఏం?" అంది.

"నీకు తెలియదా?" అన్నాడు సుధాకర్.

"నా కెందుకు తెలియాలి?" అంది నిర్మల.

"పెళ్ళిచూపులు వాయిదా పడ్డానికి కారణం నువ్వే?" అన్నాడు సుధాకర్.

"నేనా?" అంది ఆశ్చర్యంగా నిర్మల. ఆమె అలాగే సుధాకర్‌వంకే చూస్తూ వుండిపోయింది.

ఆమె కళ్ళల్లోని ఆశ్చర్యం చూసి చకితుడయ్యాడు సుధాకర్. అతను స్వరం బాగా తగ్గించి "నిర్మలా-నిజంగా నేనంటే నీ కిష్టమేనా? లేక నా మీద నీకేమైనా అనుమానాలున్నాయా?" అన్నాడు.

"నీ మీద నాకు అనుమానాలా, ఎందుకు?" అంది నిర్మల మరింత ఆశ్చర్యంగా.

సుధాకర్ కాసేపు ఆలోచించి—"నీకు తెలియకపోతే సరే—నువ్వు నన్ను ప్రేమిస్తున్నావో లేదో చెప్పు—" అన్నాడు.

"నిన్ను ప్రేమిస్తున్నానో లేదో చెప్పలేనుకానీ పెళ్ళి చేసుకుందుకు ఇష్టపడుతున్నాను—" అంది నిర్మల.

సుధాకర్ ముఖం విప్పారింది "అయితే నాకో చిన్న ఉపకారం చేసిపెట్టాలి. నీకో కవరిస్తాను. అది నీ దగ్గర్నుంచి ఒక వ్యక్తి తీసుకుంటాడు. అతనెవరో నాకు చెప్పాలి" అన్నాడు!

నిర్మలకు వ్యవహారం అర్థంకాలేదు "నువ్వు నాకు కవరిస్తే అది మరో వ్యక్తి నా దగ్గర్నుంచి తీసుకుంటాడా! అతనెవరో నేను మీకు చెప్పాలా? ఏమిటిదంతా?" అంది.

సుధాకర్ శ్రద్ధగా ఆమెనే పరీక్షిస్తున్నాడు. ఆమె అలా అనగానే అదోలా తలాడించి "ప్రస్తుతానికి నేనూ ఏమీ చెప్పలేను. ఆ మనిషెవరో నువ్వు చెప్పేక వివరాలన్నీ నేను నీకు తప్పక చెబుతాను" అన్నాడు.

సుధాకర్ తన బ్రీఫ్‌కేసు తీసి లావుగా వున్న పొడుగాటి కవర్ నిర్మల కందించి వెళ్ళిపోయాడు. నిర్మల ఆ కవర్ నందుకుని ఆలోచిస్తూ వుండిపోయింది.

యేమిటిందులోని మర్మం? ఆ కవర్ సుధాకర్ తన కెందుకిచ్చాడు? తననుంచి ఎవరో ఆ కవర్‌ని తీసుకుంటారని ఎలా తెలుసు? సుధాకర్ ఆ కవర్ తనకిచ్చినట్లు మరో వ్యక్తికి సుధాకర్ చెప్పందే ఎలా తెలుస్తుంది? తనకు తెలియని వ్యక్తికి సుధాకర్ ఆ విషయం యెలా చెప్పగల్గు

తాడు? ఇదంతా ఏమిటి? కొంపదీసి ఇందులో నేరమేమీ లేదుగదా? సుధాకర్ ధనవంతుల బిడ్డ-ఏమైనా స్మగ్లింగ్ లాంటి వ్యవహారాల్లో తన్నిరికించడం లేదుగదా?

నిర్మల ఆలోచనలు పరిపరివిధాల పోయాయి.

4

మధ్యాహ్నం రెండుగంటల ప్రాంతంలో గౌరీపతి నిర్మల ఇంటికి వచ్చాడు. అతను తలుపు తట్టినపుడు నిర్మలే వెళ్ళి తలుపు తీసింది.

"అమ్మయ్య - నువ్వింట్లోనే వున్నావుగదా!" అని నిట్టూర్చాడు గౌరీపతి.

"ఏం?" అంది నిర్మల.

"నీతో చిన్న పనుండి వచ్చాను...." అన్నాడు గౌరీపతి.

"యేమిటది?"

"ఒక రహస్యం. నువ్వు యెవ్వరికీ చెప్పనని మాటివ్వాలి" అన్నాడు గౌరీపతి.

నిర్మల ఆలోచనలు పరిపరివిధాల పోయాయి "మాట ఇవ్వను" అందామె.

"జీవితంలో ఇదొక్కటే నిన్ను కోరుకుంటున్నాను. ఇంకేమీ కోరను...." అన్నాడు గౌరీపతి. అతని గొంతు దీనంగా ధ్వనిస్తోంది. కళ్ళు దీనంగా చూస్తున్నాయి.

"ఈ రోజు వుదయం సుధాకర్ నీకో కవరిచ్చి వుంటాడు. అది నాక్కావాలి" అన్నాడు గౌరీపతి.

నిర్మల నిశ్చేష్టురాలైంది. సుధాకర్ ఇచ్చిన కవరు గురించి గౌరీపతి అడుగుతాడన్నది ఆమె కలలో కూడా ఊహించలేని విషయం. కాసేపటివరకూ ఆమెకు నోట మాట రాలేదు.

"యేమిటలాగై పోయావ్?" అన్నాడు గౌరీపతి.

"అసలు విషయమేమిటో చెప్పు. నాకీ రోజు మతి పోయేలాగుంది" అంది నిర్మల.

"ఆ కవరిస్తే అన్నీ చెబుతాను" అన్నాడు గౌరీపతి.

నిర్మల కవరు తెచ్చి గౌరీపతి కందించింది. అతనామె యెదుటనే దాన్ని తెరిచాడు. ఆత్రతగా అందులో చేయి పెట్టాడు. అయితే దాన్నిండా కత్తిరించిన కాగితాల తుక్కు-ఒక వుత్తరం తప్ప యేమీలేదు. ఆ వుత్తరం చదువుకుని గౌరీపతి నిరుత్సాహంగా కూలబడిపోయాడు.

"యేమయింది?" అంది నిర్మల ఆశ్చరంగా.

గౌరీపతి నీరసంగా "నువ్వు నా చేయి దాటిపోతున్నావని నాకు బాధగా వుంది. కట్నంమీద నాకు మోజులేదు. కానీ నాన్న పట్టుపట్టాడు. నీకోసం యెలాగో అలా పదిహేను వేలు సంపాదించాలనుకున్నాను. అందు గురించి దొంగతనమైనా సరే చేయాలనుకున్నాను. అలాంటి పరిస్థితుల్లో సుధాకర్ గురించిన రహస్యమొకటి నాకు తెలిసింది. అతను పుస్తకాల అట్టల్లో తెలివిగా గంజాయిని స్మగల్ చేస్తున్నాడు.

ఈ సంగతి అతనివల్ల మోసపోయిన ఒక యువతి ద్వారా నాకు తెలిసింది. అతన్నేమీ చేయలేక ఆత్మహత్య చేసుకోబోతున్న ఆమెను నేను రక్షించాను. సుధాకర్ స్మగ్లింగ్ గురించి ఆమె నాకు కొన్ని రహస్యాలు చెప్పింది. మామూలు పరిస్థితుల్లో అయితే నేను ఇలాంటి పనులు చేయలేదు. సుధాకర్‌ని బ్లాక్‌మెయిల్‌చేసి నాక్కావలసిన డబ్బు సంపాదించాలనుకున్నాను. ఓ వుత్తరం రాసి డబ్బు కవర్లోపెట్టి నీ కిమ్మన్నాను. లేకపోతే రహస్యం వెంటనే బయటపెట్టేస్తానని బెదిరించాను. ఈ రోజు

తప్పక డబ్బిస్తాడనుకున్నాను. కానీ ఈ ఉత్తరం రాశాడు సుధాకర్" అన్నాడు.

నిర్మల ఆ ఉత్తరం అందుకుని చదివింది.

"రాస్కెల్!

నువ్వెవరో తెలుసుకోలేననుకున్నావా? నేను పోలీసులకు లంచంపెట్టి నన్ను రక్షించుకోగలను. నన్ను అన్యాయంగా బ్లాక్ మెయిల్ చేయబోయినందుకు నిన్ను జైలుపాలు చేస్తాను. నీలాంటి చవటలకు వేలకువేలు ఉత్తినే ధార పోస్తే నేను వ్యాపారం యెలా చేయగలననుకున్నావ్. కావాలంటే ఈ ఉత్తరం కూడా పోలీసులకు చూపించుకో. ఈ లోగా బ్లాక్ మెయిలర్‌గా నీ విషయం ఊరంతా తెలిసి పోతుంది.

—సుధాకర్."

"నన్ను ఆ సుధాకర్ బ్లాక్ మెయిలర్‌గా పదిమందిలో నిలబెడతాడు. నా పరువు పోతుంది. నా చెల్లెలికి పెళ్ళి కాదు. ఈ పరిస్థితుల్లో నాకు ఆత్మహత్యే గతి" అన్నాడు గౌరీపతి దీనంగా.

ఒకనాడు నలుగుర్ని చావదన్ని కూడా ఆత్మశక్తిని సంపాదించుకోలేక పోయాడు గౌరీపతి. ఈనాడు బలమైన సాక్ష్యాధారాలుండీ ఒక దుర్మార్గుడికి బెదిరిపోతున్నాడు గౌరీపతి.

"మిస్టర్ గౌరీపతీ! నీకు వచ్చిన భయమేమీలేదు. నీకే ప్రమాదమూ రాకుండా నేను చూసుకుంటాను. నువ్వు తెలివి తక్కువ పనులేమీ చేయకు. హాపీగా ఇంటికెళ్ళు" అంది నిర్మల.

గౌరీపతి వెళ్ళిపోయాడు. తర్వాత నిర్మల సుధాకర్ పుస్తకాల షాపుకి వెళ్ళి "చాలా కాలంగా నాతో యేకాం

తాన్ని కోరావు నువ్వు. కానీ నేనంగీకరించలేదు. ఇప్పుడు నేను నీతో యేకాంతాన్ని కోరుతున్నాను. ఒప్పుకుంటావా?" అనడిగిందతన్ని.

సుధాకర్ వుత్సాహంగా "యేమిటీ కథ?" అన్నాడు

ఇద్దరూ కారెక్కారు.

"నిర్మలా ఆ కవరుకోసం యెవరొచ్చారు?" అన్నాడు సుధాకర్.

"చెప్పను...." అంది నిర్మల.

"ఏం?"

"నాకు పదిహేనువేలు కావాలి. ఇస్తే చెబుతాను."

సుధాకర్ ఆశ్చర్యంగా "కాబోయే భార్యవి - నువ్వు నన్ను బ్లాక్ మెయిల్ చేస్తావా?" అన్నాడు.

"నేను నీకు కాబోయే భార్యను కాదు. నీలాంటి స్మగ్లర్‌నీ, నమ్మక ద్రోహినీ నేను పెళ్ళిచేసుకోను...."

"ఓహ్—ఆ దుర్మార్గుడు నీకంతా చెప్పేశాడన్నమాట. ఇంతకీ ఎవడు వాడు?" అన్నాడు సుధాకర్.

"వాడంటే అంత భయమున్న వాడివి వుత్తరంలో అంత ధైర్యంగా యెందుకు తిట్టావ్?"

"కొందరు బెదురుగొడ్లుంటారు. అందుకని అలా ప్రయత్నించాను. అయినా ఇందులో నీ హ్యాండు కూడా వుందని అనుమానం" అన్నాడు సుధాకర్.

"వుంది. నేను బెదురుగొడ్డుని కాదు. రేపుదయానికల్లా పదిహేనువేలూ ఇవ్వకపోతే నీ కథా, నీ ప్రియురాలి కథ రచ్చకెక్కుతాయి. నాతో ఆట చాలా ప్రమాదం. ఈ విషయం చెప్పడానికే నీ ఏకాంతాన్ని కోరాను."

సుధాకర్ ముఖం మాడిపోయింది. సీరియస్‌గావున్న ఆమె ముఖంవంక చూస్తూ ఆమెతో ప్రేమపూర్వకంగా

మాట్లాడాలని విఫల యత్నాలు చేశాడతను.

సుధాకర్ దగ్గర్నుంచి నిర్మల మళ్ళీ గౌరీపతి దగ్గరకు వెళ్ళింది. గౌరీపతి ఆమెను ఆశ్చర్యంగా చూశాడు.

"పెళ్ళి చూపులకు ముహూర్తం పెట్టించు" అంది నిర్మల అతనితో.

"నువ్వు నన్ను పెళ్ళిచేసుకుంటావా!" అన్నాడు గౌరీపతి నమ్మలేనట్లు.

"ఆహా కట్నం కూడా ఇచ్చి" అంది నిర్మల.

గౌరీపతి అయోమయంగా ఆమెవంక చూశాడు.

"గౌరీపతీ! నువ్వు నన్ను నిజంగా ప్రేమిస్తున్నావు. నేను నీ ప్రేమ నర్థంచేసుకోలేక పోయాను. నీలో అన్ని మంచి లక్షణాలూ వున్నాయి. ఒక్క మనోబలమే తక్కువ. ఆ ఆత్మశక్తి నేను నీకు సమకూరిస్తే మన జంట ప్రపంచానికి ఆదర్శప్రాయం కాగలదు. ఇంతకాలం నా ఆలోచనలు తప్పుదారిలో నడిచాయి. నువ్వు నన్ను ఓ దుర్మార్గుడి బారినుండి కాపాడావు. లేకపోతే నాకై నేను వాడి వలలో పడిపోయేదాన్ని...." అంది నిర్మల.

నిజమైన ప్రేమ తనకు తెలియకుండానే సత్ఫలితాలిస్తుందంటారు. గౌరీపతి విషయంలో అదే జరిగినట్లుంది.

సుధాకర్ ఇచ్చిన డబ్బు గౌరీపతికి కట్నంగా ముట్టింది. గౌరీపతికీ, నిర్మలకూ పెళ్ళి జరిగింది. ఆ తర్వాత బ్లాక్ మెయిలర్ ఎవరో సుధాకర్‌కి తెలిసిపోయింది. అయినా అతను గౌరీపతికి భయపడుతున్నాడు తప్పితే యేమీ చేయలేక పోతున్నాడు. గౌరీపతి ఇప్పుడు నిర్మల భర్త!

నిర్మల తనకేమీ కానప్పుడే అతను ఆమె కోసం నలుగుర్ని తన్ని, బ్లాక్‌మెయిలింగ్ చేసే స్థితిలో వున్నాడు. ఇప్పుడామె అతని అర్థాంగి! □

కామం-క్రోధం

భమిడిపాటి భాస్కరరామారావు

ఉదయం ఆరు గంటల సమయం.

రంగారావు నైట్ డ్యూటీనుండి అప్పుడే యింటికి వచ్చాడు. "సావిత్రీ" అనిపిలుస్తూ వీధి గుమ్మం తలుపు మీద చేయివేశాడు. తలుపు తెరుచుకుంది. 'ఓహో! సావిత్రి

అప్పుడే లేచి పనులు ప్రారంభించినట్లుందే?' అనుకుంటూ లోపలకు వెళ్ళి షూస్ విడిచి, బట్టలు మార్చుకుందుకు పడక గదిలోకి వెళ్ళాడు.

గదిలో ప్రవేశించినవాడు ప్రవేశించినట్లే "సావిత్రీ! సావిత్రీ...." అంటూ వెర్రికేకలువేస్తూ వీధిలో పడ్డాడు.

కేకలు విని ఇరుగుపొరుగులైన వెంకట్రావు, సత్యనారాయణ, రామారావు గబ గబా బయటకు వచ్చారు. రోడ్డుమీద వెర్రికేకలు వేస్తున్న రంగారావుని చూచి దగ్గరకు వచ్చారు.

"రంగా! రంగా! యేమిటి! ఎందుకు అలా కేకలేస్తున్నావు?" అంటూ రంగారావును పట్టుకున్నారు.

వారు పట్టుకుని కుదిపిన రెండు మూడు నిమిషాలకు తెలివిలోకి వచ్చిన రంగా ఘొల్లున యేడుస్తూ ఇంటివైపు చేయి చూపుతూ, "అక్కడ నా సావిత్రి....అక్కడ నా సావిత్రి...." అంటూ యేడుపు అడ్డంరాగా మాట పూర్తి చేయలేకపోయాడు.

"ఏం? సావిత్రికేమైనా దెబ్బ దగిలిందా? లేక కూర తరుగుతూంటే వేలుకోసుకుందా?" అన్నాడు వెంకట్రావు కొంచెం హాస్యంగా.

సావిత్రిమీద రంగారావుకు వెర్రిప్రేమ. వారికి వివాహమై ఆరు మాసాలైంది. క్షణం తీరిక చిక్కితే ఇద్దరూ చిలకా గోరింకల్లా సినిమాలకు షికార్లకూ పోతారు. ఒకసారి రిక్షా బోల్తాకొట్టి సావిత్రికి కొద్దిగా కాలు బెణికింది. ఆ కాస్త విషయానికే రంగారావు చాలా హంగామా చేశాడు. ఆ కారణంగానే వెంకట్రావు వేళాకోళంగా మాట్లాడాడు.

రంగారావుకు దుఃఖం పొర్లి పొర్లి వస్తోంది. యేడుస్తూనే "అదేంకాదు వెంకట్రావ్! సావిత్రి....సావిత్రి ..."

అంటూ నోటమాట రాక యింటివైపు వేలు చూపిస్తూ స్థాణువులా నిలబడిపోయాడు.

వెంకట్రావును రంగారావుదగ్గర ఉండమని సత్యనారాయణ, రామారావు ఇంట్లోకి వెళ్ళారు. పడకగది గుమ్మం సమీపించారు. లోపలి దృశ్యం కళ్ళబడి ఇద్దరి గుండెలు ఝల్లుమన్నాయి. ధైర్యశాలులే అయినా తట్టుకోలేక పోయారు. ఒణుకుతున్న కాళ్ళతో చెమటలు దిగజారుతున్న శరీరాలతో మెల్లగా బయటకు వచ్చారు.

వెంకట్రావుకు సంగతి చెప్పి వెంటనే క్రైంబ్రాంచికి ఫోన్ చేశారు.

మెసేజ్ అందుకున్న క్రైం ఇన్‌స్పెక్టర్ గోపాల్ తన పరివారంతో వచ్చాడు.

ఇన్‌స్పెక్టర్ గోపాల్ రంగారావింట్లో ప్రవేశించాడు. అక్కడి దృశ్యం చాలా భీభత్సంగా ఉంది.

గుండెలగుండా గాయంతో మంచంమీద పడివుంది సావిత్రి శవం. మంచం, నేల రక్తసిక్తమై వున్నాయి గోపాల్ జాగ్రత్తగా మంచాన్ని సమీపించాడు. గుండెల మీది గాయాన్నిబట్టి బాకువంటి ఆయుధంతో హత్య జరిగి ఉండవచ్చనుకున్నాడు.

వేలిముద్రల నిపుణుడు మంచం, గాడ్రెజ్ బీరువా, తదితర వస్తువులన్నిటిమీదా పౌడర్ జల్లి ఫోటోలు తీయసాగాడు.

పోలీస్ ఫోటోగ్రాఫర్లు శవాన్ని వివిధ భంగిమల్లో ఫోటో తీస్తున్నారు.

గది నలుమూలలా నిశితంగా పరిశీలించాడు ఇన్‌స్పెక్టర్ గోపాల్. అనుమానించదగినది, పనికివచ్చేదీ అతడి దృష్టిలో పడలేదు. తల పంకించి బయటకు వచ్చాడు.

మిగిలిన తంతు సహచరులకు పురమాయించాడు.

ముందు గదిలో కూర్చున్నాడు ఇన్‌స్పెక్టర్ గోపాల్. 'సావిత్రి, రంగారావు మంచి పరువంలో వున్న జంట. పైగా సావిత్రి చాలా అందంగా వుంది. ఏవైనా వృథా అనుమానాలతో రంగారావే సావిత్రిని హత్యచేసి, ఏమీ తెలియనివాడిలా హంగామా చేస్తున్నాడా' అని అనుమానించాడు.

రంగారావును పిలిపించాడు.

"మీరేం చేస్తుంటారు?" అని అడుగాడు రంగారావును.

"ఇక్కడి మెషీన్‌టూల్స్ ఫ్యాక్టరీలో ఫోర్‌మన్‌గా పని చేస్తున్నాను."

"నిన్న సాయంకాలం లగాయతు మీరేం చేశారో చెప్పండి."

"నిన్నటినుండి నాకు నైట్ డ్యూటీ. అంటే రాత్రి 9 గంటల లగాయతు తెల్లవారి 5 గంటల వరకు. సాయంత్రం 6-30 గంటలకే భోజనం చేశాను. తలుపులు జాగ్రత్తగా మూసుకోమని సావిత్రికి చెప్పి 7-30 గం॥కే బయలుదేరాను. తిరిగి ఈ ఉదయం 6 గం॥కు ఇంటికి చేరుకున్నాను. తలుపులమీద చేయివేయగానే తెరుచుకున్నాయి. సాధారణంగా ఆ వేళకే సావిత్రి లేచి ఇంటి పనుల్లో నిమగ్నమవుతుంది. అందుచేత నారాక కోసం తలుపు తెరచి వుండడం మామూలే.

ముందు గదిలో షూస్ విడిచి తిన్నగా వంటగదిలోకి వెళ్ళాను. అక్కడ సావిత్రి లేదు. సరికదా కాఫీ ప్రయత్నం కూడా కనబడలేదు. కొంచెం వింతగానే తోచింది. 'సావిత్రీ!'అని పిలుస్తూ పడకగదిలోకి వెళ్ళాను.

ఆ భయంకర దృశ్యం కళ్ళబడింది. ఏం జరిగిందో నాకేమీ తెలియలేదు. నాకు స్పృహ వచ్చేసరికి వెంకట్రావు సత్య నారాయణ, రామారావు నన్ను పట్టుకుని ఉన్నారు. ఇంతే ఇన్‌స్పెక్టర్! నాకు తెలిసినది ఇంతే!" అని ముగించాడు రంగారావు.

వాంగ్మూలంమీద రంగారావు సంతకం తీసుకుని అతడి మిత్రులను ప్రశ్నించి, బయలుదేరాడు గోపాల్. తంతు ముగించి శవాన్ని అంబులెన్స్‌లో పోస్టుమార్టమ్‌కు తర లించారు అసిస్టెంట్లు.

2

పిడిబాకువంటి ఆయుధం తిన్నగా గుండెను దూసుకు పోవడంవల్ల మరణం సంభవించిందని డాక్టరు పోస్టు మార్టమ్ రిపోర్టులో తేలింది. రాత్రి సుమారు 7 నుండి 9 గంటల మధ్య మరణించి ఉండవచ్చునని నిర్ధారణ చేశాడు డాక్టర్.

హత్యకు కారణమైన ఆయుధం దొరకలేదు. మరొక మారు హత్యాస్థలాన్ని పరిశీలించడంవల్ల ప్రయోజనం ఉంటుందేమోనని తలచాడు ఇన్‌స్పెక్టర్ గోపాల్.

రంగారావు ఉండే వీధికి వచ్చాడు. రంగారావు యింటి ప్రక్కదే వెంకట్రావు యిల్లు. వెంకట్రావు భార్య గుమ్మం లోనే ఉంది. చటుక్కున బులెట్ ఆపి వెంకట్రావు యింటికి వెళ్ళాడు గోపాల్. వెంకట్రావు భార్య కొంచెం భయపడినా కూర్చోమని ఆహ్వానించింది గోపాల్‌ను.

"అమ్మా! మీ పేరేమిటి?"

"నా పేరు అరుంధతి."

"సావిత్రి హత్య సందర్భంగా మీరేమైనా వివరాలు యివ్వగలరేమోనని వచ్చాను."

"నేనా! నేనేం చెప్పగలను?" అంది అరుంధతి కంగారుగా.

"ఆహఁ! మరేం లేదు. మీరు సావిత్రి ఇరుగుపొరుగులు కదా! సావిత్రిగురించి ఏమైనా చెప్పగలరేమోనని."

"అంటే?"

"ఏమీలేదు సావిత్రి రంగారావు అన్యోన్యంగా వుంటారా?"

"చిలుకాగోరింకల్లా వుంటారు. కనీసం చిలిపి కజ్జాలు ఆడుకోగా కూడా వినలేదు."

"ఆ యింట్లో వారిద్దరేనా ఉండేది?"

"ప్రస్తుతం వాళ్ళిద్దరే వుంటున్నారు."

"అంతకుముందు ఇంకా ఎవరేనా ఉండేవారా?"

"రంగారావు పినతండ్రి పరంధామయ్య, సావిత్రి మేనమామ కొడుకు కృష్ణ ఉండేవారు. కృష్ణ నెలక్రితమే వచ్చి 15 రోజుల క్రితమే యిక్కడినుండి హాస్టల్‌కు వెళ్ళిపోయాడు."

"పోనీ నిన్న రాత్రి యెవరేనా రంగారావింటికి రావడంగాని, వెళ్ళడంగానీ మీరేమైనా గమనించారా?"

"మీరడిగితే జ్ఞాపకం వచ్చింది. నిన్న రాత్రి పది, పదిన్నర మధ్య ననుకుంటాను కృష్ణ గాభరాగా రంగారావింట్లోంచి రావడం చూశాను."

కృష్ణ ఉండే హాస్టల్ అడ్రసు తెలుసుకుని అక్కడికి వెళ్ళాడు గోపాల్.

కృష్ణను వెంటపెట్టుకుని స్టేషన్‌కు చేరుకున్నారు.

"నిన్న రాత్రి నువ్వు హాస్టల్‌లో లేవు. యెక్కడికి వెళ్ళావ్?" గోపాల్ ప్రశ్నించాడు.

"జగదాంబాలో 'ది డే ఆఫ్ ది జాకాల్' సినిమాకు

వెళ్ళాను."

"తరువాత?"

"డాబా గార్డెన్స్‌లో ఫ్రండ్స్ రూమ్‌కు వెళ్ళాను."

"ఎన్ని గంటలకు?"

"తొమ్మిది గంటలకు."

"అక్కడిన్నుంచి?"

"అంతే! నా హాస్టల్‌కు పోయి పడుకున్నాను."

"కాదు! పిఠాపురం కాలనీకి వెళ్లావంటాను. రంగారావింటికి వెళ్లావంటాను. సావిత్రిని హత్య చేశావంటాను." అన్నాడు గద్దింపుగా ఇన్‌స్పెక్టర్ గోపాల్.

"లేదు! లేదు! నేను సావిత్రి వదినా వాళ్ళింటికి వెళ్ళలేదు. నాకేం తెలియదు!"

"నువ్వు రంగారావింటికి వెళ్ళినట్లు ప్రత్యక్ష్య సాక్ష్యం వుంది. రాత్రిపదీపదిన్నర మధ్య గాభరాగా రంగారావింట్లోంచి బయటకు వచ్చావ్!" హుంకరించాడు ఇన్‌స్పెక్టర్.

కృష్ణ యేమీ మాట్లాడలేక పోయాడు. ముఖం వెలవెలబోయింది. భయంతో ఒళ్ళంతా చెమటలు పట్టాయి. కృష్ణను కస్టడీలోకి తీసుకున్నాడు గోపాల్.

3

ఉదయం 8-30 అయేసరికి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాడు డిటెక్టివ్ శిరీష్.

"ఊరకలారు మహానుభావులు. తెల్లవారే వచ్చావు. ఏమిటి విశేషం?" అన్నాడు గోపాల్ నవ్వుతూ.

"సావిత్రి హత్య ఫైలు చూపించడానికి నీకేమైనా అభ్యంతరమా?"

"నీకు చూపించడానికి అభ్యంతర మేమిటయ్యా మహానుభావా! కూర్చోపెట్టి పరమాన్నం తినిపిస్తానంటే వద్దనే

వెర్రిబాగులవాడు వుంటాడా!” అంటూ ఫైలు అందించాడు గోపాల్.

ఫైల్ దీక్షగా చదివాడు డిటెక్టివ్ శిరీష్. పోస్టుమార్టమ్ రిపోర్టు చూచాడు. వేలి ముద్రల రిపోర్టు కూడా చూచాడు.

“హత్యాయుధం దొరికిందా?” శిరీష్.

“లేదు.” గోపాల్.

“కృష్ణను ఏ ఆధారంతో అరెస్టు చేశావ్?”

“హత్య జరిగిన సమయంలో అతడికి తగిన ఎలిబీ లేదు.”

“ఒకవేళ హత్య అతడే చేసివుంటే తగిన యెలిబీ సృష్టించుకుని వుండేవాడేమో ఆలోచించావా?”

“అందుకు అవకాశం లేకపోలేదు. కాని ఆ ఒక్క కారణంతోనే అతణ్ణి కస్టడీలోకి తీసుకోకుండడానికీ వీలు లేదు కదా!”

“అదీ నిజమే అనుకో! కృష్ణతో ఒకసారి మాట్లాడ వచ్చా!”

“ఓ! అందుకభ్యంతరమేమిటి” అని కృష్ణను పిలిపించాడు గోపాల్.

“మొన్నరాత్రి నువ్వు రంగారావు ఇంటికి వెళ్ళలేదని అబద్ధమాడావు. ఆరోజు రాత్రి పది పదిన్నర మధ్యనువ్వు వాళ్ళింట్లోనుంచి వస్తున్నట్లు చూచిన వాళ్ళ సాక్ష్యం వుంది, ఇన్‌స్పెక్టర్ దగ్గర. అందుచేత జరిగిన నిజం చెప్పడం నీకే మంచిది. నిజం చెప్పడంవల్ల నేను నీకు సహాయం చెయ్యగలుగుతాను. మీ నాన్నగారు నన్ను నియమించారు. కనుక నీకు తెలిసినది దాచకుండా చెప్పు. నువ్వు నిర్దోషివైతే నీకు వచ్చిన భయం యేమీ లేదు.” అన్నాడు డిటెక్టివ్ శిరీష్.



కృష్ణ ఒక్కసారి తటపటాయించి "అవును. మీరు చెప్పింది నిజమే! మొన్న రాత్రి పది గంటలవేళ సావిత్రి వదినా వాళ్లింటికి వెళ్లాను. తలుపు తట్టబోయేసరికి తెరుచు కుంది. ముందు గదిలో నిలబడి వదినా! వదినా! అని కేకే శాను. వదిన పలకలేదు. పడుకునేముందు తలుపు వేసు కోవడం మరచిపోయిందేమోనని పడకగది తెర తొల గించి తొంగి చూశాను.

గదిలో దీపం వెలుగుతోంది. లోపల మంచంమీద భయంకరంగా రక్తపు మడుగులో తేలుతూ వుంది వదిన శరీరం. భయంతో కాళ్ళూ చేతులూ ఆడలేదు. అలాంటి స్థితిలో నన్నెవరేనా చూస్తే! 'అమ్మో' ఉరితాడు నామెడకు తగలడం ఖాయం! ఒక్క ఉదుటున బయటపడి పారి పోయాను."

"రాత్రి 10 గంటలకు యెందుకు వెళ్లావు?"

"హాస్టల్‌లో తిండి యెటూ వుండదు. వదినకి నా ఆకలి తెలుసు."

"నువ్వు చూచినదానిని పోలీసులకు ఎందుకు తెలియ జెయ్యలేదు?"

"భయపడ్డాను."

"నువ్వు చెప్పదలచుకున్నది ఇంకేమైనా వుందా?"

"నేను నిర్దోషిని."

"సరే! అదే నిజం అయితే నిన్ను తప్పక విడుదల చేయిస్తాను." అని కృష్ణతో చెప్పి, గోపాల్‌వద్ద సెలవు తీసుకుని బయటకు వచ్చాడు డిటెక్టివ్ శిరీష్.

4

రంగారావు యింటి తలుపు తట్టాడు డిటెక్టివ్ శిరీష్.

రంగారావు తలుపు తెరిచాడు. అతడి వెనుక గదిలో ఒక స్త్రీ ఉంది. ఆమెను తన అక్కగా పరిచయం చేశాడు రంగారావు.

"నా పేరు శిరీష్. డిటెక్టివ్‌ను. మీ ఆవిడ హత్య సందర్భంగా కృష్ణను అరెస్టు చేశారన్న సంగతి మీకు తెలిసే వుంటుంది? అతడి తరపున పని చేస్తున్నాను" అన్నాడు.

రంగారావు పక్కకు తప్పుకుని "రండి! రండి!" అని లోపలికాహ్వానించాడు.

కూర్చుంటూ "కృష్ణ గురించి మీ అభిప్రాయం ఏమిటి? అతను మీ భార్యను హత్యచేయడానికి తగిన ఆస్కారం యేమైనా వుందా?" శిరీష్.

"నాకు తెలిసినంతవరకు కృష్ణ చాలా బుద్ధిమంతుడు. చెడుపనులు కావుకదా చెడు స్నేహాలుకూడా అతడికి లేవు.

కృష్ణ, సావిత్రిని హత్య చేశాడంటే నేను నమ్మను" అన్నాడు రంగారావు.

"వారిద్దరూ మేనత్త మేనమామ పిల్లలు కదా! సావిత్రిని పెళ్ళాడాలనే వుద్దేశ్యం కృష్ణకు వుండవచ్చు. కాని ఆమె మీకు భార్య అయింది. తనకు కాకుండా పోయిందనే దుగ్ధ ఏమైనా వుండవచ్చు కదా, అని అడిగాను."

"అదేం లేదు. కృష్ణ సావిత్రికంటె రెండేండ్లు చిన్న."

"అలాగా! మీ యింట్లో మీతోబాటు మీ పినతండ్రి గారు కూడా వుండేవారట కదా? వారిప్పు డెక్కడుంటున్నారు?"

"తునిలో మా అక్కగారింటి దగ్గర."

"మీ పిన తండ్రిగారి పేరేమిటి? ఆయన కెవరూ లేరా? ఏం చేస్తూంటారు?"

"ఆయన కెవరూ లేరు. పొగాకు వ్యాపారంచేసేవారు. లక్షలు గడించారు. కాని గడించిందంతా దుర్వ్యసనాల కింద హరించుకుపోయింది. చివరకు వుండే యిల్లు కూడా అప్పులవాళ్ళు వేసుకుపోయారు. ఆ బెంగతోనే మా పిన్ని కన్ను మూసింది."

"మీ అక్కగారితో బాటు మీ చిన్నాన్నగారు రాలేదా?"

"అదే ఆశ్చర్యంగా వుంది. నాలుగు రోజుల క్రితమే విశాఖపట్టణం వెడతానని బయలుదేరాడని మా అక్క చెప్పింది. కాని యిక్కడకు రాలేదు. మరో విషయం కూడా వుంది. ఆయన చేతికి డబ్బు చిక్కితే అయిపోయే వరకూ కనిపించడు."

"ఏం? ఇప్పుడాయన చేతికి డబ్బేమైనా చిక్కిందా?"

"చిన్నాన్న బయలుదేరి వచ్చాక చూచుకుంటే పెట్టెలో దాచిన అయిదువేలు కనిపించలేదని చెప్పింది మా అక్క."

"మీ బీరువాకూడా తెరచి వున్నట్లు పోలీస్ రికార్డులో వుంది. మీది కూడా డబ్బేమైనా పోయిందా?"

"ఆ రోజు మా యింట్లో డబ్బేమీ లేదు."

"మీ చిన్నాన్నగారి ఫోటో ఏదైనా వుందా?"

"ఏం ఆయనను అనుమానిస్తున్నారా?"

"హత్య కేసులో అందరూ అనుమానితులే! చివరకు మీరు కూడా!"

రంగారావు లేచి వెళ్ళి ఒక ఫోటో తెచ్చి యిచ్చాడు. శిరీష్ ఫోటో బాగా చూశాడు. పంచె, లాల్చి, కండువా, బొద్దు మీసాలు, ముఖాన నిలువు నామం.

"ఆయన పేరేమిటి? వయసెంత వుంటుంది?" శిరీష్.

"పరంధామయ్య. నలభై ఎనిమిది వుంటుంది" రంగా రావు.

"సరే! ఈ ఫోటో నేను తీసుకువెడుతున్నాను. త్వర లోనే కేసు తేల్చేస్తాం" అని మద్దెలపాలెం జంక్షన్ వైపు బయలుదేరాడు శిరీష్.

జంక్షన్‌లో రెండు నిమిషాలు నిలబడ్డాడు డిటెక్టివ్ శిరీష్.

"సార్! ఆటో" అంటూ వచ్చాడొక వ్యక్తి.

"నువ్వు సాధారణంగా ఈ జంక్షన్‌లోనే వుంటు టూంటావా?" శిరీష్ అడిగాడు.

"అవును సార్!" ఆటో డ్రైవర్ చెప్పాడు.

"మొన్న రాత్రి, అంటే 13వ తేదీ రాత్రి నువ్విక్కడే వున్నావా?" శిరీష్.

ఆటోవాలా అదోకలా చూశాడు. శిరీష్ జేబులోనుండి

పదిరూపాయల నోటుతీసి "నాకు కావలసిన సమాచారం దాచకుండా చెబితే ఇది నీదే" అన్నాడు.

ఆటోవాలా కళ్లు మెరిశాయ్. వెంటనే "ఉన్నాను సార్" అన్నాడు.

శిరీష్ జేబులోనుండి ఫోటోతీసి "ఈ ఫోటోలోని వ్యక్తి రాత్రి తొమ్మిది, తొమ్మిదిన్నర మధ్య ఇక్కడ ఏదైనా ఆటో ఎక్కాడేమో చెప్పగలవా?"

"13వ తేదీ రాత్రి ఇక్కడ నాది, మా ఫ్రండ్ అప్పారావు ఆటోలు మాత్రమే ఉన్నాయి. సార్! మీ రడిగిన టైమ్‌కు ఎవరో ఒకాయన అప్పారావు ఆటో యెక్కాడు. వుండండి అప్పారావు కాలనీలోకి బేరం తీసుకునివెళ్లాడు? ఇప్పుడే వచ్చేస్తాడు" అన్నాడు.

అతడలా అంటూండగానే అప్పారావు ఆటో వచ్చింది. అప్పారావును శిరీష్‌కు పరిచయం చేశాడు. శిరీష్ అప్పారావుకు ఫోటో చూపించి

"13వ తేదీ రాత్రి ఇతడు నీ ఆటో ఎక్కాడా?" అని అడిగాడు.

అప్పారావు ఫోటో బాగా చూచి "ఎక్కాడు సార్! సంగం థియేటర్‌కు కాస్త ఈవలగా దిగాడు." అన్నాడు.

"సరిగ్గా ఈయనే అని చెప్పగలవా?" శిరీష్.

"అదేమిటి సార్! ఆయన చాలా హడావిడిగా వచ్చాడు. నా ఆటో సరిగ్గా జంక్షన్‌లోని లైట్ దగ్గరవుంది. బేరం ఆడకుండానే ఎక్కాడు. తిరిగి థియేటర్‌కు కాస్త ఇవతల దిగాడు. అక్కడ కూడా లైట్ వుంది. పది రూపాయిల నోటిచ్చాడు. చిల్లరలేదన్నాను. 'సరే! వుంచుకో!' అని వెళ్ళిపోయాడు. నాకు బాగా గుర్తు. ఆయనే ఈయన" అన్నాడు.

డిటెక్టివ్ శిరీష్ రెండు పదినోట్లు తీసి యిద్దరికీ యిచ్చి, వెనక్కి తిరిగి ఇంటికి చేరుకున్నాడు.

5

"సారథీ! ఈ ఫోటోలోని వ్యక్తి పేరు పరంధామయ్య. వయస్సు 48 వుంటుంది. మొన్న 9వ తేది నాటికే తుని నుండి విశాఖ వచ్చాడని తెలిసింది. మూడువంతులు రైల్వేస్టేషన్ ప్రాంతాలలోని లాడ్జీలలో దేనిలోనైనా దిగి వుండవచ్చు. కూపీ తీసుకురావాలి" అని చెప్పి పంపాడు డిటెక్టివ్ శిరీష్.

సారథి సంగమ్ టాకీస్ ప్రాంతాలకు చేరుకున్నాడు. మొదటగా అతడి దృష్టి 'సుజనా కేఫ్—వెజిటేరియన్ బోర్డింగ్ అండ్ లాడ్జింగ్" అన్న బోర్డుమీద పడింది.

కేష్ కౌంటర్‌లోని వ్యక్తికి తన జేబులోని ఫోటో చూపించి "తొమ్మిదవ తారీకు ప్రాంతాల ఈ వ్యక్తి మీ లాడ్జిలో దిగాడా?" అని అడిగాడు.

అతడు జవాబు చెప్పడానికి ఇష్టపడలేదు. సారధి తన ఐడెంటిటీ కార్డు చూపాడు. వెంటనే అతడు సగౌరంగా లేచి లాడ్జి రిజిష్టరు సారధి ముందుకు తోసి "తొమ్మిదవ తేదీ రాత్రి 8 గం॥ ఇదే మనిషి ఇక్కడ రూమ్ తీసుకున్నాడు. 13వ నెంబర్ రూం" అని చెప్పాడు.

సారధి చెకచెకా రిజిష్టరు తిరగేశాడు. ఎక్కడ నుండి అన్నచోట రాజమండ్రి అని, ఎందుకు అన్న కాలంలో వ్యాపారం అని వ్రాసి, సంతకం పెట్టవలసిన చోట మొదట 'పి' అనే అక్షరం వ్రాసి కొట్టివేసి 'జానకిరామయ్య' అని వ్రాసినట్లు గమనించాడు.

"ఫోన్ ఉపయోగించుకుంటాను" సారధి అడిగేడు.

ఫోన్ సారధి ముందుకు తోశాడు లాడ్జి యజమాని.

సారధి ఒక నంబర్ డయల్‌చేసి "బాస్! నేనే మాట్లాడుతున్నాను. 'సుజనా కేఫ్' రూమ్ నంబర్ 13 లో దిగాడు" అన్నాడు.

డిటెక్టివ్ శిరీష్ యిచ్చిన సూచనలను విని ఫోన్ పెట్టేశాడు సారధి.

లాడ్జి యజమానికి చెప్పి, 13 వ నంబర్ గదికి చేరుకున్నాడు సారధి. తలుపు తాళం వేసివుంది. మారు తాళంతో లోపల ప్రవేశించాడు. గదిమధ్య మంచం, పైన సీలింగ్‌ఫ్యాన్, గోడవార టేబిల్. టేబిల్‌మీద వుందొక బ్రీఫ్‌కేస్.

బ్రీఫ్‌కేస్ మూత తెరిచాడు సారధి. కొన్ని రూపాయల

నోట్లు ఐదులు లగాయతు వందలవరకు చాలా ఉన్నాయి. వాటిని తప్పించి వెతికాడు. పెట్టె అడుగున రక్తపు మరకల లాల్చీ, శుభ్రంగా తుడిచిన తళతళలాడే బాకు....

ఏదో అలికిడయింది వెనుక. సారధి వెనుదిరిగి చూచే లోగానే దబ్బున మీదపడ్డాడొక దృఢకాయుడు. సారధి మెడ రెండు చేతులా యిరికించుకుని గట్టిగా నొక్కుతున్నాడు. ఊపిరి తిరగడంలేదు సారధికి. విలవిలలాడి పోతున్నాడు. గ్రుడ్లు, నాలుక బయటకు వెళ్ళుకొస్తు న్నాయి....

"చేతులెత్తు! క్షణం ఆలస్యమైందా ఆరు గుళ్ళు నీ ఒళ్లు తూట్లు చేస్తాయి." గర్జించిందొక సింహం వెనుక నుండి.

ఉలిక్కిపడి చేతులెత్తాడు సారధిని పట్టిన వ్యక్తి.

"వెనుక్కుతిరుగు పరంధామయ్యా! హోటల్ రిజిస్టర్లో జానకిరామయ్య అని పేరు మార్చుకున్నంత మాత్రాన తప్పించుకోగలననుకోకు" అన్నాడు పిస్తోలు వ్యక్తి.

కొంచెం తేరుకున్న సారధి "థాంక్యూ బాస్! సమయానికి వచ్చారు!" అన్నాడు.

"గోపాల్! సావిత్రి హత్యానేరానికి పరంధామయ్య ఉరఫ్ జానకిరామయ్యను అరెస్టు చెయ్!"

ఇన్‌స్పెక్టర్ గోపాల్ పరివారంతో లోపలికడుగు పెట్టాడు.

పరంధామయ్య చేతికి బేడీలు పడ్డాయి.

"సావిత్రి నీకు కూతురు వంటిది. ఆమెను హత్య చేయవలసిన అవసరం నీకెందుకు కలిగింది!" అడిగాడు డిటెక్టివ్ శిరీష్.

పరంధామయ్య తలొంచుకుని నిలబడి ఉన్నాడు.

"సావిత్రిని పెళ్ళిపీటలమీద చూడగానే నాలో దుష్ట వాంఛ రేకెత్తింది. ఆమె నాకు కోడలవుతుందనిగాని, రంగారావుకి అన్యాయం చేసినట్టవుతుందనిగాని నాకు తోచ లేదు. శోభనంనాటి రాత్రే ఆమెను ఒంటిగా ఉన్న సమయంలో చిక్కించుకోబోయాను. ఆమె ఏడ్చింది. మొత్తుకుంది. చివరకు గోలచేయబోయింది. అప్పటికి నా ప్రయత్నం విరమించుకున్నాను." ఆగాడు పరంధామయ్య.

"రంగారావింట్లో కొంతకాలం వున్నావు కదా?"

"అవును అప్పుడూ ప్రయత్నించాను. సావిత్రి కత్తి పీట తీసుకుని బెదిరించింది. ఆరోజే రంగారావు దగ్గర సెలవు తీసుకుని తుని వెళ్ళిపోయాను....

తుని నుండి మరల వచ్చాను. నాలో కోరిక చావలేదు రంగారావును నైట్‌డ్యూటీకి వెళ్ళనిచ్చి ఇంటి తలుపు తట్టాను. తలుపులు తెరుచుకున్నాయి. సావిత్రి తెల్లబోయి తలుపు వేసెయ్యబోయింది. నేను బలవంతంగా లోపల దూరి ఆమెను పొదివి పట్టుకున్నాను. మంచంమీద కూలతోసి మీద పడ్డాను. ఆమె అరిచి గోల చేయబోయింది.

నాలో కామం స్థానంలో క్రోధం చోటు చేసుకుంది నాకు దక్కని అందం మరొకరికి దక్కకూడదనిపించింది. సిద్ధంగా జేబులో ఉంచుకున్న కత్తితో సావిత్రిని ఒకే ఒక్క పోటు....కసిదీరా....కోరికను చంపుకుని ఇంత కాలం వున్నందుకు మాత్సర్యంతో....పొడిచాను."

పరంధామయ్య ఒణుకుతున్నాడు. ఒళ్ళంతా చెమటలు! స్పృహ తప్పి కుప్పలా కూలిపోయాడు. □

దిష్టిచుక్క

కె.బి.యస్. కుమార్



"డిటెక్టివ్ జలంధర్‌గారున్నారా....?" అన్నాడతను.

వయస్సు నలభై వుండొచ్చు. ఎత్తుగా భారీగా వున్నాడు. వెనక్కి దువ్వుకున్న జుట్టు. కోలముఖం. బాధపడి, ఉబ్బి, ముడుచుకుపోయిన కళ్ళు. సిల్కు లాల్చీ, పైజామా ధరించాడు.

"ఉన్నారు రండి...." కన్సల్టింగ్ రూములో అతన్ని కూర్చోబెట్టి బోయ్ గోపిని పిల్చి డిటెక్టివ్‌గారికోసం ఎవరో వచ్చారని చెప్పమని చెప్పి పంపాడు అసిస్టెంట్ శ్రీనివాస్.

అయిదు నిమషాల తర్వాత గదిలోకి ప్రవేశించాడు జలంధర్.

"నమస్కారం" అన్నాడతను.

"మిమ్మల్నెక్కడో చూసినట్టుంది....ఆఁ .... గుర్తొచ్చింది. ప్రియబాంధవీ టెక్స్‌టెయిల్స్ దుకాణం ప్రొప్రయిటరు మాధవస్వామి కదూ మీరు...." ప్రతి నమస్కారం చేస్తూ అన్నాడు జలంధర్.

"అవున్సార్....నా ఇంట్లో రాత్రి ఓ ఘోరం జరిగింది. మీ సాయంకోరి వచ్చాను...." అభ్యర్థనాపూర్వకంగా అన్నాడతను.

"చెప్పండి...." రెడ్‌విల్స్ మాధవస్వామికి ఆఫర్ చేసి తనూ వెల్గించుకున్నాడు డిటెక్టివ్ జలంధర్.

భారంగా పొగ పీల్చి ప్రారంభించాడు మాధవస్వామి.

"నా ఏకైక కుమార్తె జయప్రియ వివాహం నిన్నరాత్రి జరగవలసింది."

"మరి జరుగలేదా?"

"అది నా దురదృష్టం. నిన్న సరిగ్గా ముహూర్తం సమయానికి అరగంట ముందుగా నా కూతురు మరణించింది."

"వాట్!?" అదిరిపడ్డాడు జలంధర్.

"అవును, శవం ఇంకా యింట్లోనే వుంది. తెల్లని జయప్రియ శరీరం నీలం రంగులోకి మారింది. పెళ్ళికళ యేమాత్రం మాసిపోలేదు. ఆయుధం యేదీ వుపయోగించబడలేదు. చూసేవాళ్ళకి ఆత్మహత్యలా కన్పిస్తోంది.

శరీరంమీద ఎలాటి గాయమూలేదు. కాని బాడీ రంగు మార టంతో అనుమానం కలిగి మీ వద్దకు పరిగెత్తుకొచ్చాను. ఈ విషయం పోలీసులవరకూ వెళ్ళి పబ్లిసిటీ జరిగి పత్రి కలవరకూ పోవటం నాకిష్టం లేదు. అందుకే మిమ్మల్ని కలి శాను....'' కన్నీళ్ళు తుడుచుకున్నాడు మాధవస్వామి.

"పదండి. శవాన్ని చూద్దాం....'' లేచాడు జలంధర్.

2

ఇరవై రెండుంటుంది జయప్రియ వయసు. ఎర్రటి పట్టు చీర. అదేరంగు జాకెట్టు. నుదుట బాసికం కట్టబడివుంది. కల్యాణ తిలకం సూర్యబింబంలా మెరిసిపోతోంది. పొడు గాటి జడ గుండెలపై పడివుంది.

గుండ్రని ముఖం. చిన్న ఎర్రని పెదవులు. ఎడమ బుగ్గన దిష్టి చుక్క.

ప్రాణంలేని జయప్రియ శవంలా లేదు. భర్త సహ చర్యంలో మున్ముందు తను అనుభవించబోయే నూతన జీవితాన్ని తల్చుకుంటూ మైకంగా కళ్ళు మూసుకొని కలలు కంటోన్నదానిలా వుంది!!

శవాన్ని చూసేసరి జలంధర్ కళ్ళు ద్రవించాయ్. ఓ కన్నెపిల్ల జీవితంలో నిప్పులు పోసిన హంతకుడు మనిషా పశువా?

"శవాన్ని ఎవ్వరూ తాకలేదు కదూ?'' ప్రశ్నించాడు.

"లేదు....తాకనివ్వలేదు'' వెక్కుతూ అన్నాడు మాధవ స్వామి.

శవానికి సమీపంగా కూర్చొని నిశిత దృష్టితో పరిశీ లించాడు జలంధర్. కాసేపయ్యాక అతని ముఖంలో బాధతో కూడిన మెరుపొకటి మెరిసింది. లేచాడు. మాధవ స్వామికేసి తిరిగాడు.

"మీకు గాని మీ అమ్మాయికి గాని శత్రువు లెవరేనా వున్నారా?"

"నాకు లేరు. నాకు తెల్సినంతవరకూ మా అమ్మాయికీ లేరు."

"మీకు తెల్సినంతలో మీ అమ్మాయికి బోయ్ ఫ్రెండ్స్ ఎవరేనా వున్నారా?"

"జలంధర్‌గారూ! జయప్రియ డిగ్రీ హోల్డర్. బోయ్ ఫ్రెండ్స్ వుండొచ్చు. పైగా దాంది సోషల్ నేచర్. అవసరమైతే ఆ మగాడు కొత్తవాడైనా తనే పరిచయం చేసుకోటానికి వెనకంజ వెయ్యదు అలాంటప్పుడు."

"పోనీ అమ్మాయి ఎవర్నైనా ప్రేమిస్తోన్నట్టు గాని, అమ్మాయినే ఎవరేనా ప్రేమిస్తోన్నట్టుగాని, ఆమెకి ప్రేమ లేఖలు వగైరాలు రావటంకాని జరిగిందా?"

"అమ్మాయి ఎవర్నైనా ప్రేమిస్తోన్న పక్షంలో ఈ వివాహాన్ని మొదటే తిరస్కరించి వుండేది. మిగత వివరాలు నాకు తెలీవు."

"మొత్తంమీద జయప్రియని ఎవరో చంపేశారు. అయ్ మీన్ మరొకరిచేత చేయించారు. అంటే మీకో, మీ అమ్మాయికో శత్రువులుండాలి. ఆమె బుగ్గపై దిష్టిచుక్క వుంది చూశారా! అనుమానం రాకుండా సరిగ్గా దిష్టి చుక్కపైనే గాయంచేసి హత్యచేశారు. బహుశా పొటాషియం సైనేడ్‌లో ముంచిన ఏ సూదినో ప్రయోగించి వుండాలి."

"మా అమ్మాయిపై అంత ద్వేషం ఎవరికుంటుంది జలంధర్‌గారూ!?" విస్తుపోయి అన్నాడు మాధవస్వామి.

"పరిశోధించాల్సిన అంశం అదే. బైదిబై ...., మీ అమ్మాయి కోసం అయ్‌మీన్ స్నేహపూర్వకంగా మాట్లాడ్డంకోసం ఎవరేనా వస్తోండేవారా?"

"రజనీకాంత్ అనే కుర్రాడు వస్తోండేవాడు."

"అతనికీ, మీ అమ్మాయికీ ఎలాంటి స్నేహం."

"ఎం.కామ్.లో క్లాసు మేటుట."

"అతని చిరునామా మీకు తెల్సా?"

"దోమల్ గూడా మార్కెట్ ప్రక్కన అని అప్పుడప్పుడూ మా అమ్మాయి చెబుతోండేది."

"అతన్ని గురించి ప్రత్యేకంగా అప్పుడప్పుడూ మీ తండ్రీ కూతుళ్ళ మధ్య సంభాషణలు దొర్లుతోండేవా?"

అడ్డంగా తలాడించాడు మాధవస్వామి.

"మీ ఇంట్లోని సభ్యులెవరో ఒక్కసారి చెప్పండి."

"నేను, నా బావమరిది, ఓ డ్రైవరు, ఓ వంటమనిషి, ఇద్దరు పని మనుషులు, ఓ తోటమాలి."

"అమ్మాయి గది యిదేనా?"

నిలువుగా తలాడించాడు మాధవస్వామి.

గదంతా కలయజూశాడు జలంధర్.

అధునాతనంగా వుందా గది. కిటికీలకి సిల్కు తెరలు వ్రేలాడుతోన్నాయి. ఓ ప్రక్క అలమారు. దానిప్రక్కనే పుస్తకాలుంచుకునే ర్యాక్. ఓ కిటికీకి దగ్గరగా స్ప్రింగ్ కాట్, దానికి ఎడంవేపున ఓ టీపాయ్. నాలుగు కుర్చీలు ఓ టేబులు మరో ప్రక్క డ్రెస్సింగ్ మిర్రర్.

చేతులకి గ్లవ్స్ తొడుక్కున్నాడు డిటెక్టివ్ జలంధర్. డ్రెస్సింగ్ మిర్రర్‌కేసి నడిచాడు. ఏవో వేలిముద్రలున్నాయ్. జేబులోంచి ఓ చిన్న ప్లాస్టిక్ టిన్ తీశాడు. అందులోని పౌడర్‌ని అద్దంపై చల్లాడు. పై జేబులోంచి సిగార్ లైటర్ తీశాడు. అద్దానికెదురుగా వుంచి ఒక్కసారి వెలిగించి ఆర్పేశాడు.

మంచంపైనున్న శవంకేసి నడిచాడు. తలగడ క్రింద

పరుపు క్రిందా తడిమాడు. నిరాశగా పెదవి విరిచి అల మారువేపు అడుగులేశాడు.

తలుపులు తెరిచాడు. హాతురాలి తాలూకు రకరకాల దుస్తులు వరసగా పేర్చబడివున్నాయి. ఒక్కొక్కటే బయటికి తీసి మడతలు విప్పాడు. ఓ చీరలోంచి ఓ కార్డు సైజు కాయితాన్ని బయటికి తీశాడు. అందులోని అక్ష రాల్ని చదివాడు.

"ఎవరినీ ప్రేమించకు!"

ప్రశ్నార్థకంగా మాధవస్వామికేసి చూశాడు.

అయోమయంగా ముఖంపెట్టాడు మాధవస్వామి.

ఒక్కసారి తలపంకించి ర్యాక్ కేసి నడిచాడు జలంధర్.

ర్యాక్ నిండా పుస్తకాలున్నాయి. జయప్రియ క్లాసు పుస్తకాలు కొన్ని, రకరకాల వార-మాసపత్రికలూ, కొన్ని డిటెక్టివ్ నవలలు, కొన్ని ఇంగ్లీషు మేగజైన్స్ వున్నాయి.

ఓపిగ్గా ఒక్కో పుస్తకాన్నే తీసి పేజీలు తిరగెయ్య సాగాడు జలంధర్. ఓ పుస్తకంలోంచి మరో కార్డుసైజు కాయితం బయటపడింది. దానిపై కూడ యిందాకటి కాగితం ముక్కలోని అక్షరాలే వున్నాయి.

జలంధర్ నొసలు ముడివడింది. వేగంగా ఆలోచించ సాగాడు. అతని ఆలోచనలని అదుపులో వుంచుకునే ప్రయత్నంలో అతని ముఖకవళికలు చకచకా మారు తోన్నాయి.

అప్రయత్నంగా తిరిగి శవంకేసి నడిచాడు. శవాన్ని ఎక్స్‌రే కళ్ళతో పరిశీలించాడు. అతని కళ్ళు మెరిశాయ్. మాధవస్వామిని దగ్గరగా రమ్మని సైగచేశాడు.

యాంత్రికంగా నడిచాడు మాధవస్వామి.

"మీ వంటమనిషిని పిలవండి." జేబులోంచి రెడ్

విల్స్ పాకెట్ తీస్తూ అన్నాడు జలంధర్.

"సుబ్బమ్మా!" గట్టిగా పిలిచాడు మాధవస్వామి. అర నిమిషానికి ఓ నడివయస్కురాలు నెమ్మదిగా వచ్చింది.

"శవం ధరించిన జాకెట్‌లో ఓ కాగితం మడతపెట్ట బడివుంది. బయటికి తియ్...." అన్నాడు జలంధర్.

శవం పైకి వంగి పయ్యెదని కొద్దిగా తొలగించి జాకెట్ లోంచి ఓ కాగితం ముక్కని బయటికి తీసింది సుబ్బమ్మ. పొంగివస్తోన్న దుఃఖాన్ని ఆపుకుంటూ ఆ కాగితాన్ని జలంధర్ చేతిలో పెట్టింది.

మడతలు విప్పాడు జలంధర్.

అది కూడా కార్డు సైజు కాగితమే! అందులో వున్నదీ అదే వాక్యమే!!

"ఎవరినీ ప్రేమించకు!!!"

ఆ మూడు కాగితాల్నీ ప్రక్కప్రక్కగా వుంచి పరిశీలించాడు జలంధర్. మూడు వాక్యాలూ ఒక్కరు వ్రాసినవే!

"మాధవస్వామిగారూ!" గాఢంగా సిగరెట్ దమ్ము లాగుతూ అన్నాడు జలంధర్. "ఈ హత్యలో ఏదో మిస్టరీ వున్నట్టు తోస్తోంది. అమ్మాయిది సోషల్ నేచర్ అన్నారు. మీకు తెల్సినంతవరకూ ఆమె ఎవర్నీ ప్రేమించ లేదన్నారు. కాని దొరికిన 'క్లూ'ని బట్టి యిదేదో ప్రేమ కేసేనని అనుమానం వస్తోంది. అమ్మాయిని పెళ్ళికూతురుగా ముస్తాబు చేసిన ఆడవాళ్ళ జాబితా ఇవ్వండి."

మాధవస్వామి గబగబా కొన్ని పేర్లు, అడ్రసులు ఓ కాగితంపై వ్రాసి ఇచ్చాడు.

3

తలుపు తట్టాడు శ్రీనివాస్. కాసేపయ్యాక తెర్చుకుంది.

"ఎవరు కావాలి?" అడిగింది తలుపుతెరిచిన పాతికేళ్ళ



ప్రౌఢ.

"శకుంతల."

"మీ రెవరు?"

"ప్రఖ్యాత డిటెక్టివ్ జలంధర్‌గారి అసిస్టెంటుని. పేరు చెప్పమంటారా? శ్రీనివాస్. యింతకీ శకుంతల ఎవరు?"

"నేనే" నెమ్మదిగా అందామె.

"లోపలికి రావచ్చా!?"

మాట్లాడలేదు శకుంతల. మౌనంగా లోనికి నడిచింది. అనుసరించాడు శ్రీనివాస్. ఆమె చూపిన కుర్చీలో కూర్చున్నాడు.

"నే నెందుకొచ్చానో మీకు తెలుసనుకుంటాను...." పొడిగా అన్నాడు శ్రీనివాస్, ఆమెని సూటిగా చూస్తూ.

శకుంతల తెల్లగా అందంగా వుంది. గుండ్రటి ముఖం. విశాలమైన నుదురు. ఫ్యానుగాలికి నుదుట అందంగా కదులుతోన్న ముంగురులు. చేప పిల్లల్లాంటి కనులు. పొడుగాటి ముక్కు. చిన్న పెదవులు. నున్నటి బుగ్గలు.

మెడలో నల్ల పూసల గొలుసు ఆమెను వివాహితగా చాటుతోంది. నీలం రంగు జాకెట్. అదే రంగు చీర. రెండు చేతులకీ రెండేసి బంగారు గాజులు.

శ్రీనివాస్ ప్రశ్నకి ఆమె బదులివ్వలేదు. గోడకున్న దేవుడి ఫోటోలకేసి చూస్తూండిపోయింది.

"చూడండి మిసెస్ శకుంతలా! హత్య జరిగిన కుటుంబ ముఖ్య సభ్యులు మీ కుటుంబానికి సన్నిహితులు. అలాంటప్పుడు మా ప్రశ్నలకి మీరిచ్చే సమాధానాల్లో మా పరిశోధనకి పనికివచ్చే ఆధారాలు లభించవచ్చు. అందువల్ల హంతకుల్ని త్వరగా బంధించే అవకాశం మాకు కలుగుతుంది. ఏమంటారు?" జేబులోంచి బ్రిస్టల్ ప్యాకెట్ తీశాడు శ్రీనివాస్.

"ఏమని చెప్పమంటారు శ్రీనివాస్‌గారూ!?" వుదాసీనంగా అంది శకుంతల.

"జయప్రియ పెళ్ళి ముహూర్తం యింకో గంటన్నరకుందనగా జయప్రియని అలంకరించటానికి మీరు, మరి నలుగురు ఆడవాళ్ళు జయప్రియ గదిలోకి వెళ్లారు. నిజమేనా?"

"అవును."

"అంటే జయప్రియని అలంకరించినవాళ్ళు మీతో కల్సి మొత్తం అయిదుమందన్న మాట."

"అవును."

"ఆ అయిదుమందిలో పర్యవేక్షణా బాధ్యత మీదే కదూ!"

"మీరేం తీసుకుంటారు?"

"నా ప్రశ్నకి మీ సమాధానం సరైంది కాదు."

"యింటికొచ్చిన అతిధికి కనీస మర్యాదకూడ చెయ్యక

పోవటం సభ్యతకాదు. చెప్పండి.... కాఫీ—టీ...."

"నో... థాంక్స్...."

"అలా వీల్లేదు. ఏదో ఓటి తీసుకోవాల్సిందే. ప్లీజ్. ఒక్క నిమిషం" గబగబా కిచెన్‌లోకి నడిచిందామె. సరిగ్గా నిమిషం తర్వాత మళ్ళీ వచ్చింది. ఆమె చేతిలో ఆపిల్ పండు, కత్తి వున్నాయి.

"ఏమిటి? ఇందాక అడిగారు?" కత్తితో ఆపిల్ తొక్క వలుస్తూ అందామె.

"మీ అయిదుమందిలో."

"సూపర్‌విజన్ బాధ్యత ఎవరు వహించారని కదూ!?"

"అవును."

"నేనే."

"మిగత నలుగురి పేర్లు చెప్పగలరా?"

"రమాదేవి, శ్యామల, సుగుణ, శ్రీమతి."

తలాడించాడు శ్రీనివాస్. "ఆ నలుగుర్లో జయప్రియకి దిష్టి చుక్క పెట్టిందెవరు?"

"సుగుణ."

"అప్పుడు మీరక్కడే వున్నారా?"

"అక్కడే వున్నాను."

"దిష్టి చుక్కపై గాయం వుంది. ఆ గాయం సూది మొన ప్రయోగించటంద్వారా ఏర్పడింది. అదే ఆమె ప్రాణాలు బలిగొంది. ఆ గాయం ఏర్పరచటంలో ఎవరి పాత్ర వుందని మీ అనుమానం??"

"నా కెవరిపైనా అనుమానంలేదు."

"అంటే మీ వుద్దేశ్యం....?!"

"సంభాషణ పొడిగించటంవల్ల ప్రయోజనం శూన్యం.

శ్రీనివాస్‌గారూ! ఆ హత్య నేనే చేశాను...." తలొంచుకొని అందామె.

అదిరిపడ్డాడు శ్రీనివాస్. అతని వ్రేళ్ళమధ్య కాలుతోన్న సిగరెట్ జారి క్రిందపడిపోయింది.

"మీరు....మీరు...." గుటక మ్రింగాడు శ్రీనివాస్.

"అవును. నేనే చేశాను."

చెమ్మగిల్లిన కళ్లు తుడుచుకొని ప్రారంభించిందామె.

4

"నా భర్త గోవిందరావు-అయ్ మీన్ డాక్టర్ గోవిందరావ్ ఎం.బి.బి.యస్. నా విషయంలో మాత్రం ఓ జడ పదార్థం. ఎప్పుడూ తన స్నేహితులు, పార్టీలు, జలసాలు, ప్రాక్టీసు తప్ప ఆయనకి భార్య అవసరంలేదు. ఆయనకి భార్య తప్ప ప్రతి ఆడదీ అందంగా కన్పిస్తుంది.

"నా వయసు పాతిక. అయిదేళ్ళ క్రితం నాకు వివాహం జరిగింది.

"నాకు పదహారేళ్ళ వయసునుండీ లోకమంటే, ఆనందంటే శారీరక వాంఛలంటే అర్థం తెల్సింది. నేను తింటోన్న ఉప్పు, కారం నా కోర్కెల నారుకు నీరుపోస్తూ వచ్చాయి. కాని అతి కష్టంపై అదుపులో వుంచుకుంటూ వచ్చాను. ఆడపిల్ల అరిటాకని కూడ నాకు తెల్సు.

"నాలుగేళ్లు నాలుగు యుగాలుగా గడిచాయి.

"వివాహమైంది. నా భర్త 'కళ్లేలు' బిగించిన నా కోరికల గుర్రాలని రేసుగుర్రాల్లా పరిగెత్తిస్తారని తలపోశాను. అయితే కళ్ళేలు సడలించారు. రేసుగుర్రాల్లా పరిగెత్తించారు కూడ.

"కాని ఒక్క రాత్రి! ఒకే ఒక్క రాత్రి! పెళ్ళి జరిగిన రాత్రి మాత్రమే!

"ఆ తర్వాత ప్రతిరోజూ అర్ధరాత్రి దాటాక త్రాగిన మైకంలో తూలుతూ యిల్లుచేరిన నా భర్త బుగ్గలపై లిప్ స్టిక్ ముద్రలు, బట్టలకంటుకున్న రకరకాల పరిమళాలు అక్కడక్కడా తలవెంట్రుకల్లో యిరుక్కున్న వాడిపోయిన మల్లెపూలు నా గుండెల్ని అటంబాంబుల్లా ప్రేల్చేశాయి. కోపం, కోరిక, జుగుప్స, అవమానం. అసహ్యం కోడె నాగుల్లా బుసలుకొట్టాయి.

"నా కోరికల్ని అదుపులో పెట్టుకోలేక పోయాను. ఆ సమయంలో మాధవస్వామిగారి పరిచయం లభించింది నాకు, వారి బట్టల షాపులో.

"ఆయనకి భార్యలేదు. నాకు భర్తవుండీ ప్రయోజనం లేదు. దాదాపు నలభై సంవత్సరాలున్నా అంత వయిసుగల వ్యక్తిగా కన్పించరాయన. ఆయన శారీరక దారుఢ్యం అలాంటిది.

"నెమ్మదిగా ఆయన్ని లొంగదీసుకున్నాను. ఆయనకి లొంగిపోయాను.

"ఈ విషయం ఆయనకి, నాకు తప్ప మరెవరికీ తెలీదు. తెలీకుండా యిద్దరమూ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటూ వచ్చాం.

"ఓ రోజు రాత్రి మాధవస్వామిగారు, నేను హోటల్ మోహినిలో వుండగా తళుక్కున ఓ మెరుపు మెరిసింది, అది ఫ్లాష్ కెమెరా తాలూకుదని ఆ తర్వాత అర్థమైంది.

"నాలుగు రోజుల తర్వాత రిజిస్టర్డ్ పోస్టులో ఓ కవ రొచ్చింది. అందులో నాలుగు క్యాబినెట్ సైజు ఫోటో లున్నాయి. వాటిల్లో మేమిద్దరం రకరకాల భంగిమల్లో నగ్నంగా.

"యివికాక ఓ వుత్తరం కూడ వుంది. అందులో

ఫోటోకి వెయ్యి చొప్పున సూట్‌కేసులో సర్దుకొని పబ్లిక్ గార్డన్స్‌లో తను సూచించిన బెంచిపై వుంచి వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోవాలి. యిదీ బ్లాక్ మెయిలర్ సూచన.

"ఆడదాన్ని. అందులోనూ స్వంతంగా సంపాదించలేని దాన్ని. అంత డబ్బు ఎలా సమకూర్చగలను? నా భర్త నడిగితే యివ్వొచ్చు. కాని కారణం అడిగితే ఏమని చెప్ప గలను?

"మాధవస్వామిగార్ని అడక్క తప్పలేదు. ఆయన యివ్వకా తప్పలేదు.

"అలా నాలుగువేలతో మొదలైన ఆ బ్లాక్‌మెయిలింగ్ నలభై వేలదాకా పెరిగింది. మొత్తం లక్ష దాటింది.

"నెల క్రితంనుండి బ్లాక్‌మెయిలర్ వుత్తరాలు రావటం లేదు. కారణం తెలీదు. కాని వారం క్రితం ఓ వుత్తరం వచ్చింది. అది చూసిన నా గుండె ఝల్లుమంది.

"జయప్రియ వివాహంలో మాధవస్వామిగారు నాకు ప్రాధాన్యత నిస్తారని వూహించాడులా వుంది, బ్లాక్ మెయిలర్ ఓ హెచ్చరిక చేశాడా వుత్తరంలో.

"జయప్రియ వివాహం జరగకూడదు. అంతేకాదు. ముహూర్తంలోగా జయప్రియ హత్యచెయ్యబడాలి. ఆ హత్య నేనే చెయ్యాలి అందుకు నేనే మార్గాలవలంబిస్తానో బ్లాక్‌మెయిలర్‌కి అనవసరం. అలా జరక్కపోతే ఆ ఫోటోలు నా భర్త కందజెయ్యబడతాయి. నా భార్త వదిలి పెట్టినా ఆ బ్లాక్‌మెయిలర్ చేతిలో నేను చావక తప్పదు.

"నాకేం చెయ్యటానికి పాలుపోలేదు. ముందు నుయ్యి వెనక గొయ్యిలా అయింది నా పరిస్థితి. మాధవస్వామి నాకు ప్రియుడు. నా పరువు ప్రతిసారీ కాపాడుతూ వచ్చాడు. నా గురించి బ్లాక్‌మెయిలర్‌కి దాదాపు లక్ష రూపాయలదాకా

సమర్పించాడు. అలాంటి మాధవస్వామి కూతుర్ని నా కూతురులాంటి జయప్రియని నా చేతుల్తో హత్యచెయ్యడమా!?

"లేక తటస్థంగా వుండి బ్లాక్ మెయిలర్ ద్వారా రచ్చకీడ్వబడి నా పరువుని నట్టేట్లో ముంచి మాధవస్వామి మర్యాదని కూడ గంగపాలుచేసి నా భర్త చేతుల్లోనో నేనే హత్యచెయ్య బడటమా?"

"ఒక రోజంతా ఆలోచించిన మీదట తన్ను మాలిన ధర్మం లేదనే సూక్తి స్ఫురించింది. అవును. నే నెందుకు చావాలి భయంకరంగా!? నా ప్రాణం నాకు తీపికాదూ!?

"జయప్రియని హత్య చెయ్యాలనే నిశ్చయించుకున్నాను. నా భర్త డిస్పెన్సరీకి వెళ్ళాను. నర్సుని నలిపేస్తోన్న ఆయన్ని చూసి చిరునవ్వు నవ్వాను. ఫార్మసీలోకి అడుగుపెట్టాను. పొటాషిం సైనేడ్ దొంగిలించాను. గుండుసూదిని అందులో ముంచాను. మాధవస్వామిగారిచే

ఎంతో నమ్మకంగా నియమింపబడిన నేను సరిగ్గా ముహూర్తం అరగంట కుందనగా మిగత నలుగుర్నీ ఏదో మిషతో బయటికి పంపాను. మరోచోటైతే త్వరగా బయటపడు తుందన్న భయంతో అనుమానం కల్గకుండా దిష్టిచుక్కపై పిన్‌ని గుచ్చాను. పనున్నదానిలా బయటికి వెళ్ళిపోయాను.

"యిది శ్రీనివాస్‌గారూ జరిగిన కథ....యిది విని మీరు నన్ను అసహ్యించుకోవటం లేదూ!" చెమ్మగిల్లిన కళ్లు తుడుచుకుంది శకుంతల.

"లేదు" ఆపిల్ ముక్కలు తినటం, సిగరెట్ త్రాగటం ముగించి అన్నాడు శ్రీనివాస్. "ఈ, తప్పుమీది కాదు. మీ భర్తది. మీ భర్త మిమ్మల్ని నిర్లక్ష్యం చేసివుండకపోతే మీ దృష్టి, మీ మనసు మాధవస్వామి వేపుకి మొగ్గివుండేది కాదు."

"థాంక్స్"

"బై దిబై; బ్లాక్ మెయిలర్ వుత్తరాల్ని మీరు మాధవస్వామికి చూపేవారా?"

నిలువుగా తలూపింది శకుంతల. "అవి చూపకపోతే మాధవస్వామిని నమ్మకంగా దోచే వుద్దేశ్యంతో నేనే ఆలా నటిస్తోన్నానని ఆయనకి అనుమానం రాదూ?!"

"మీ కొచ్చిన వుత్తరాల్లాంటివే మాధవస్వామికీ వచ్చాయా?"

"తెలియదు."

"మీ రడగలేదా?"

"లేదు."

"చివరిసారిగా బ్లాక్ మెయిలర్ డబ్బు కోసం మీకు వ్రాసిన వుత్తరం చూసి మాధవస్వామి ఏమన్నాడు?"

"బ్లాక్ మెయిలర్ ఎలా వుంటాడో చెప్పమన్నారు."

"మీరేమన్నారు?"

"నేను చూడలేదన్నాను. నిజంగా నేను చూడలేదు. సూట్‌కేస్ బెంచిపై వుంచి వెనక్కి తిరిగి చూడకుండా వచ్చెయ్యాలి నేను. అలాంటప్పుడు వాడి ముఖంచూసే అవకాశం నాకెక్కడిది?"

"మీకు పైకం యిచ్చేటప్పుడు మాధవస్వామి విసుక్కునేవాడా?"

"లేదు."

"బ్లాక్‌మెయిలింగ్ మొదలైనప్పట్నుండీ మీ మధ్యగల అక్రమ సంబంధానికి తిలోదకాలిచ్చారా?"

"లేదు. మరో హోటల్ చూసుకున్నాం."

"ఈ విషయం మీ భర్తకి తెలిసి అతనే ఈ పని చెయ్యమన్నాడని అనుకోవచ్చా?"

"అనుకోవటానికి వీల్లేదు. ఎందుకంటే ఆయనకు పగ వుంటే నా మీద, మాధవస్వామిగారిపైనా వుండాలి. మా యిద్దర్లో ఒకర్ని కాని, యిద్దర్నీ కాని చంపేందు కవకాశం వుంది. అంతేకాని జయప్రియ హత్యచెయ్యబడాలని ఎందు కనుకుంటారు?"

"బ్లాక్‌మెయిలర్ మీ కంటబడడానికి యిష్టపడలేదు. అంటే అతడు మీకు తెలిసిన వాడై వుండాలి. మీకు మాధవస్వామితోగాక మరెవర్తోనేనా."

"లోకం నన్ను 'పతిత' అనొచ్చు శ్రీనివాస్‌గారూ! యెందుకంటే నేను భర్త వుండగా మరొకర్తో అక్రమ సంబంధం పెట్టుకున్నాను. కాని నేను వ్యభిచారిణిని కాను. వేశ్యని కాను. భర్త అందించని సుఖాన్ని మాధవస్వామి గారు నాకందిస్తున్నారు. అంతే. నాకు మరో పురుషుడి సాంగత్యం అవసరం లేదు. గోవిందరావు నాకు తాళి

గట్టిన భర్త అయితే మాధవరావుగారు సుఖాన్నందిస్తోన్న భర్త. అంతే-"

"ఇంకో విషయం...."

"అడగండి."

"జయప్రియ హత్య జరిగిన రాత్రి ఆమె గదిలో పోస్టు కార్డు సైజు తెల్ల కాగితాలు మూడు దొరికాయి. మూడింటి లోనూ 'ఎవరినీ ప్రేమించకు' అనే వాక్యం వుంది. ఈ విషయం గురించి మీరేం చెప్పగలరు?"

"సారీ....చెప్పటం మర్చాను. ఆ మూడు కాగితాలూ బ్లాక్ మెయిలర్ చివర వుత్తరంతోబాటు వచ్చాయి. పరిశోధిస్తే తప్ప సులువుగా లభించనిచోట్ల దాచెయ్యమని అతడి హెచ్చరిక."

మాట్లాడలేదు శ్రీనివాస్. ఆలోచనాతరంగాలు అతని మస్తిష్కాన్ని వేడెక్కించ నారంభించాయి—

'ఏమిటీ మిస్టరీ! 'ఎవరినీ ప్రేమించకు' అని వ్రాయబడిన స్లిప్స్‌ని పంపటంలో బ్లాక్ మెయిలర్ వుద్దేశ్యం ఏమై వుంటుంది? జయప్రియని అతడు ప్రేమించాడా? ఆమె మరొకర్ని పెళ్ళాడబోవటం అతనికి నచ్చలేదా? నచ్చక పోతే హత్య చేయ్యటం ఎందుకు? అందువల్ల నష్టం తప్పితే లాభమేమీలేదు కదా!

మాధవస్వామికి శకుంతలకి అక్రమ సంబంధం వుంది. అది రహస్యంగా వుంచబడింది. మరి....బ్లాక్ మెయిలర్‌కి యెలా తెల్సింది? శకుంతలవద్ద డబ్బు లేదని తెలిసీ అతడామెనే బ్లాక్ మెయిల్ చెయ్యటంలో అంతరార్థం ఏదైనా వుందా?

అయితే అతడు మాధవస్వామిని బాగా ఎరిగినవాడై వుండాలి. శకుంతలని డబ్బుకోసం పీడిస్తే ఆమె మాధవ

స్వామిని ఆశ్రయించక తప్పదు. యివ్వకపోతే మాధవ స్వామి పరువూ గంగపాలు కాక తప్పదు. అలాంటప్పుడు మాధవస్వామిని కాంటాక్ట్ చెయ్యటంకంటే శకుంతలని సాధించటం తేలికని భావించి వుంటాడు.

మాధవస్వామిని బాగా ఎరిగున్నవాళ్ళల్లో అనుమానితు లెవరు?

మాధవస్వామి బావమరిది!

అవును. అతనొక్కడికే అలాంటి అవకాశం వుంది. 'ఎవరినీ ప్రేమించకు' అనే కాగితాలుంచటం యెందుకు? కేవలం పోలీసుల్ని డిటెక్టివుల్ని తప్పుదారి పట్టించటం కోసమేనా? ఆ వాక్యం తమకి యెలాంటి క్లూ అందించదా.

....'కెవ్వు' మన్న కేకతో ఈ లోకంలోకొచ్చాడు శ్రీనివాస్. మెరుపులా శకుంతలకేసి తిరిగాడు.

ఆమె గుండెల్లో పిడివరకూ దిగబడిన ఆపిల్ కత్తి! క్రమక్రమంగా రంగులు మారుతూ కళావిహీనం అయిపోతోన్న ఆమె ముఖం!

కొయ్యబారిపోయాడు శ్రీనివాస్!

5

"అవును. శకుంతల బ్లాక్ మెయిలర్‌కి లొంగిపోయింది. జయప్రియని హత్య చేసింది. బలవంతంగా చేసిందైనా హత్య హత్యే గాబట్టి వురికంబమో యావజ్జీవ ఖైదో ఖాయ మనుకొని ఆపిల్ కత్తితో గుండెల్లో పొడుచుకొని ఆత్మ హత్య చేసుకుంది." అని అక్కడ జరిగిందంతా చెప్పాడు శ్రీనివాస్.

"ఇంతకీ బ్లాక్ మైలర్ ఎవరో తెలియదన్నమాట.." నిస్పృహగా అన్నాడు డిటెక్టివ్ జలంధర్.

"ప్రాణం పోతూండగా యేదో చెప్పాలని ప్రయత్నిం

చింది. సాధ్యంకాలేదు. 'ర....ర' అంటుండగానే ప్రాణం పోయింది. వెంటనే రజనీకాంత్ స్ఫురించాడు. మీరతన్ని కలిసుంటారని, వివరాలు కనుక్కొని వుంటారని వూహించి ఆఫీసుకొచ్చాను...."

"నో....రజనీకాంత్ నిర్దోషి అని నమ్ముతున్నాను. అతనికీ ఈ కేసుకీ సంబంధం లేదు—" జలంధర్ అన్నాడు.

"అయితే ఈ 'ర' అనే అక్షరం యెవర్ని సూచిస్తుంది?"

"మనిషి పేరునే యెందుకు సూచించాలి? ఏదేనా వస్తువు కావచ్చు. వూరు కావచ్చు. మరేదేనా కావచ్చు. ఎలా కనిపెట్టడం? దేనికి సంబంధించిందని ఆలోచించటం? వేగంగా ఆలోచించసాగాడు జలంధర్.

రెండు నిమషాల తర్వాత ఆతని ముఖంలో చిన్న మెరుపొకటి మెరిసింది. శ్రీనివాస్‌కేసి చూసి తనతో రమ్మని సైగచేసి లేచాడు.

డాడ్జికారు తారాజువ్వలా పరుగుతీసి 'గోవిందా డిస్పెన్సరీ' ముందు ఆగిపోయింది.

దిగారు డిటెక్టివులు. నేరుగా లోనికి నడిచారు.

పేషెంట్లెవరూ లేరు. బహుశ డాక్టరు లేడేమో ననుకున్నారు. అయినా కాంపౌండర్నిగాని, నర్సునిగాని కాంటాక్టు చెయ్యొచ్చనుకొని డాక్టరు గదిలోకి అడుగుపెట్టబోతూ చటుక్కున ఆగిపోయారు. యిద్దరి చెవులూ నిక్కబొడుచుకున్నాయి.

లోపల ఓ ఆడ కంఠం-ఓ మగ కంఠం. ఆ రెండు కంఠాలమధ్యా కాన్వర్సేషన్....!

"ష్... గట్టిగా మాట్లాడక! గోడలకి చెవులుంటాయి" మగ కంఠం.

"ఆఁ....వుంటే యేం? యిందులో మన తప్పేముంది గనక-మనకు ముప్పురావడానికి....?" తనని తాను సమర్థించుకుంటూ ఆడ కంఠం!

"అయితే యిప్పుడూ అందుకే వెళ్ళివుంటాడంటావా?"

"ఏమో! యెందుకెళ్ళడో! అంత గాభరాగా అంత హడావుడిగా వెళ్ళడే 'అందు'కైతే?"

"మరెందుకెళ్ళివుంటాడంటావ్?"

ఏమోనన్నట్టు సైగ చేసిందేమో, మాటలు విన్పించ లేదు-ఆడ కంఠానివి.

"ఈ మధ్య మనసు దేనిపై నిలవటం లేదు. పేషంట్లనీ సరిగా చూడటం లేదు. ప్రవర్తన మరీ చిత్రంగా లేదూ?"

"అవును పేషంట్లవద్ద విపరీతంగా డబ్బు గుంజుతోన్నాడు. నా జీతం కూడ ఈ నెల యింకా యివ్వనేలేదు."

"ఏముందీ! ధనాశ బాగా ప్రబలిపోయింది. మూడ్రూపాయల ఇంజెక్షన్‌కి పది రూపాయలు వసూలు చేస్తోన్నాడు. పేషంట్లు రమ్మంటే యెందుకొస్తారు?....స్కూటరు కూడ అమ్మేశాడు. ఆ డబ్బంతా ఏం చేశాడు?"

"ఇంకోదాన్నుంచుకున్నాడేమో!"

"నువ్వా చాల్లేదా?" నవ్వింది మగ కంఠం.

"ఎవడు చెప్పొచ్చాడు? కుక్కబుద్ధి కుక్కబుద్ధే!"

"కుక్క బుద్ధని తెలిసే వల్లో పడ్డావా?"

"వల్లో పడలేదు. వళ్లో వేసుకున్నాను."

"అందువల్ల నీకేమిటి లాభం?"

"పలుకుబడి."

"అంతే....?"

"ఓ పేరున్న డాక్టర్‌కి నర్స్‌కమ్ పర్సనల్ సెక్రెటరీ

అంటే ఎంత గౌరవం సంఘంలో?"

"అలాంటి పలుకుబడికోసం - ఆత్మవంచన చేసుకుంటావా?"

"ఇది నా దృష్టిలో సంఘనీతి."

"నీలాంటి ఆడది సంఘంలో వుండదేమో!"

"పోనీలే-అదికూడ ఓ ప్రత్యేకతేగా!"

....సంభాషణ మరోదారి మళ్ళిందని గ్రహించిన డిటెక్టివ్ జలంధర్ తలుపు తట్టాడు.

నర్స్ తలుపు తెర్చింది.

"డాక్టర్‌గారితో మాట్లాడాలి." ముక్తసరిగా అన్నాడు జలంధర్.

"లేరు. గంట తర్వాత రండి."

"డాక్టర్‌గారితోనే మాట్లాడాల్సిన మేటర్ కాదు. మీతో నేనా మాట్లాడొచ్చు."

"మీరెవరు?"

"డిటెక్టివ్ జలంధర్."

అదిరిపడింది నర్సు.

"ఇందాక కాంపౌండర్‌కి మీకు మధ్య జరిగిన సంభాషణ విన్నానని భయమా?" నవ్వాడు జలంధర్.

"...................."

"అనవసరంగా మీ పరువు తియ్యటం నాకిష్టం లేదు. నా కొన్ని ప్రశ్నలకి మీ సమాధానాలు కావాలి."

"లోపలికి రండి."

లోపలికి నడిచారు డిటెక్టివ్‌లిద్దరూ.

"మీ డాక్టర్‌గార్ని గురించి మీకు తెల్సిన వివరాల్ని చెప్పండి...." అన్నాడు జలంధర్ అక్కడున్న కుర్చీలో కూర్చొని రెడ్ విల్స్ వెలిగించుకొని, సిరంజిలోడ్ చేస్తోన్న



కాదు-చేస్తోన్నట్టు నటిస్తోన్న కాంపౌండర్ని కూడ వుద్దేశించి.

"రామూ! డిటెక్టివ్‌గారు పిలుస్తోన్నారు." అంది నర్సు.

కాలుగాలిన పిల్లిలా అక్కడికొచ్చాడు కాంపౌండర్.

"వివరాలంటే....?" నసిగింది నర్సు.

"అదే....ఇందాక మీ సంభాషణల్లో దొర్లిన మీ డాక్టరు గారి గాభరాని గురించి."

"అవును. ఈ మధ్య కొన్ని రోజులుగా ముభావంగా వుంటోన్నాడు. కారణం తెల్సుకోవాలని ప్రయత్నించాను. చెప్పలేదు. ఏ విషయమూ నా వద్ద దాచడు. అలాంటిది నాతోకూడ చెప్పలేదు. తెల్సుకోవాలని గోము నటించాను. విసుక్కున్నాడు. ప్రయత్నం మానుకున్నాను."

"కొన్ని రోజులుగా అంటే___? ఓ నెలనుంచా?"

"అవును."

జలంధర్ మస్తిష్కంలో ఓ మెరుపు మెరిసింది.

"మీ పేరు?"

"రజని."

"నా అన్నవాళ్ళెవరూ లేరా?"

"లేరు."

"ఇక్కడికెలా చేరారు?"

"ఉద్యోగాన్ని అర్థిస్తూ ఎన్నోచోట్ల తిరిగాను. ఎక్కడికి వెళ్ళినా అక్కడున్న ప్రతి మగాడూ నన్ను ఆకలిగా చూశాడు. ఇక్కడికొచ్చాను. డాక్టరు కూడా అలాంటి వాడేనని తెల్సింది. లోకమంటే అసహ్యం కలిగింది. ఇక్కడే స్థిరపడిపోయాను. అయితే సంఘాన్ని ఓ ఆటాడించాలనిపించింది.

"ఆకర్షణలతో నా అందాన్ని యినుమడింపజేసుకొని డాక్టర్ని కవ్వించడం మొదలు పెట్టాను. అంతే-కుక్కలా వెంటబడ్డాడు."

"ఆ తర్వాత కొన్ని రోజులకి తెల్సింది-రాము నన్ను ప్రేమిస్తోన్నాడని. అతనితో నిజం చెప్పక తప్పలేదు. నేను అనాఘ్రాత పుష్పాన్ని కాదని, నా కన్యాత్వాన్ని గోవిందరావు దోచుకున్నాడని రాముతో చెప్పాను. కాని రాము అమితంగా బాధపడలేదు. బాధగా ఒక్క నవ్వుమాత్రం నవ్వేసి మామూలుగా అయిపోయాడు. అంతే. ఆ తర్వాత మా యిద్దరి మధ్యా ఓ కాంపౌండర్‌కి, ఓ నర్సుకి వున్న సంబంధం మాత్రమే వుంది."

"గోవిందరావుకి వివాహమైంది. తెల్సా?"

"తెలుసు. ఆమె పేరు శకుంతల."

"తరచూ యిక్కడికి వచ్చేదా?"

నిలువుగా తలూపింది రజని.

"మీ ఇద్దరి సంబంధం ఆవిడకి తెల్సా?"

"తెలుసు."

"మిమ్మల్నేమీ అన్లేదా?"

"నన్నెందుకంటుంది? అంటే భర్తననాలి."

మరో ప్రశ్న అడగబోతూ, అలా టేబులుమీద చూసిన డిటెక్టివ్ జలంధర్ కళ్ళు టేబుల్‌మీదున్న ఓ పుస్తకంపై బడ్డాయి. వంగి దాన్నందుకున్నాయి, అతని చేతులు.

ఓ సాంఘిక నవల అది. అట్ట తిరగేశాడు.

ఎ.రజనీకుమారి, చల్లా వెంకట్రామయ్య గేట్, హైదరాబాదు అని వుంది దానిపై.

ఆ చిరునామాలో తను గమనించిన మూడక్షరాల్ని చూసి వులిక్కిపడ్డాడు జలంధర్. మెరుపులా రజనికేసి తిరిగాడు. అంతలోనే తమాయించుకున్నాడు. రాముకేసి చూశాడు.

"మిస్టర్ రామూ! ఓ సిగరెట్ పెట్టి కావాలి, తెప్పించగలరా?"

"డబ్బులివ్వండి సార్! నేనే పట్టుకొస్తాను...." వినయంగా అన్నాడు కాంపౌండరు.

మనసులోనే నవ్వుకొని పది రూపాయలనోటిచ్చి తన బ్రాండ్ చెప్పాడు. అతడలా వెళ్ళగానే గంభీరంగా మారిపోయి సూటిగా రజనికేసి చూశాడు.

"రజనీ! నేరం చెయ్యటంకన్నా తప్పుడు సాక్ష్యం చెప్పటం పెద్ద నేరం. ఈ విషయం తెలుసా."

"తెలుసు."

"బ్లాక్‌మెయిలర్‌కి బ్లాక్‌మెయిలింగులో సహకరించటం కూడ అంతే నేరం. దీనికి శిక్షేమిటో చెప్పమంటావా?"

ఎండుటాకులా వణికిపోయింది రజని.

"ఇప్పటికైనా నిజం చెప్పు. మాధవస్వామి కూతురు

హత్య విషయానికి వస్తోన్నాను. హత్య జరిగిన రాత్రి ఆ గదిలో మూడు కాగితాలు దొరికాయి. అందులో 'ఎవరినీ ప్రేమించకు' అనే వాక్యం వ్రాసింది నువ్వు కాదూ?"

"....నే....నే...." భయంగా బదులిచ్చింది రజని.

"ఎవరు వ్రాయమన్నారు?....గోవిందరావు కదూ!"

అవునన్నట్టుగా తలూపింది రజని.

"కారణం?"

"చెప్పలేదు."

"ఆల్ రైట్. అది తెల్సుకోవడం అంత కష్టమైన పనేమీ కాదు. నువ్వుమాత్రం ఈ నిజం ఎప్పటికైనా యెంత మందిలోనేనా వెల్లడించేలా వుండాలి. అండర్‌స్టాండ్?"

భయంగా తలూపింది రజని.

6

డాడ్జి కారు కారురోడ్డుమీద పరుగులు తీస్తోంది.

కాలిపోయిన సిగరెట్‌ని కారు కిటికీలోంచి విసుర్తూ అన్నాడు జలంధర్. "వాసూ! యిప్పుడు కేసు ఓ రూపాని కొస్తోంది. మాధవస్వామికీ శకుంతలకీ సంబంధం వుంది. ఆ సంగతి గోవిందరావు తెలుసుకున్నాడులా వుంది. అందుకే ఆమెని బ్లాక్ మెయిల్ చెయ్యనారంభించాడు...."

"అవును" శ్రీనివాస్ అన్నాడు. అందుకే శకుంతల సూట్‌కేసుని బెంచిపై వుంచి వెనక్కి తిరిగి చూడకుండా వచ్చెయ్యాలని ఆంక్ష విధించాడు బ్లాక్‌మెయిలర్. అయ్ మీన్ గోవిందరావు."

"మాధవస్వామికి అనుమానం వచ్చుంటుంది. అతడు గోవిందరావుని బెదిరించి వుంటాడు. యింకో విషయం వాసూ! శకుంతల చివరిసారిగా డబ్బుకోసం మాధవ

స్వామిని కల్సినప్పుడు బ్లాక్ మెయిలర్ ఎలా వుంటాడో చెప్పమన్నాడు. అంతే.

"ఆ తర్వాత శకుంతలకి వుత్తరాలు రాలేదు. అంటే మాధవస్వామి గోవిందరావుని బెదిరించివుండాలి. అప్పట్నుండీ గోవిందరావుకి డబ్బు కటకట అయివుండాలి. అందుకే అతడు ముభావంగా వుంటోన్నాడు. నర్సు చెప్పింది విన్నావుగా! అతనెప్పట్నుండి అలా వుంటోన్నాడు?—నెలనుండి "

"అది సరే" శ్రీనివాస్ అన్నాడు. "గోవిందరావు డాక్టరు వున్నది యిద్దరే. అఫ్‌కోర్స్ వుంపుడుగత్తె లుండొచ్చు - స్కూటరమ్మటం మూడ్రూపాయల సూదికి పదిరూపాయలు కలెక్ట్‌చెయ్యటం విడ్డూరంగా లేదూ!"

డిటెక్టివ్ జలంధర్ మాట్లాడలేదు. డాడ్జికారిప్పుడు గోవిందరావు యింటికి పదడుగుల దూరంలో వుంది.

ఇంటిముందు కారాపి ఇద్దరూ లోపలికి నడిచారు.

గోవిందరావు ఏడుస్తోన్నాడు. పోలీసు బలగం తన రొటీన్ వర్క్ మొదలెట్టింది, అప్పటికే.

గోవిందరావు నిజంగా ఏడుస్తోన్నాడా. లేక ఏడుస్తోన్నట్టు నటిస్తోన్నాడాని ఆలోచించలేదు డిటెక్టివ్ జలంధర్. అతన్ని ఓ ప్రక్కగా తీసుకుపోయాడు.

"మీ భార్య ఆత్మహత్య చేసుకుందని తెల్సు. మా శ్రీనివాస్ పోలీసు రిపోర్టివ్వటంతో వాళ్ళక్కడికొచ్చారని తెల్సు. పోలీసులు మీకు యిన్ఫర్‌మేషన్ యిచ్చివుంటారని తెల్సు. ప్రస్తుతం మీ మనసు బాగోలేదనీ తెల్సు. అయినా కొన్ని ప్రశ్నలడక్క తప్పదు. కొన్ని సందేహాలు తీర్చుకోక తప్పదు. దయచేసి చెప్పండి" అన్నాడు.

అడగమన్నట్టు చూశాడు గోవిందరావు తడికళ్లని కర్చీఫ్‌తో వత్తుకుంటూనే.

"మీకు మాధవస్వామి తెల్సా?"

"ఏ మాధవస్వామి?"

"ప్రియబాంధవీ టెక్స్‌టెయిల్స్ ప్రొప్రయిటరు."

"పరిచయం లేదు."

"అతని కూతురు హత్యచెయ్యబడింది. అందులో మీ హస్తం వుందని మాకు తెల్సింది."

"జలంధర్‌గారూ!"

"బుకాయించడానికి ప్రయత్నించకండి. మీ నర్స్ రజని మాతో అన్ని విషయాలూ చెప్పింది."

తలొంచుకున్నాడు గోవిందరావు.

"నిజం చెబితే మీకు శిక్ష, మాకు శ్రమ తగ్గుతుంది. ఆలోచించుకోండి" జేబులోంచి రెడ్ విల్స్ పాకెట్ తీశాడు జలంధర్.

"జలంధర్‌గారూ!" అభ్యర్థనా పూర్వకంగా అన్నాడు గోవిందరావు. "నేను శకుంతలని బ్లాక్‌మెయిల్ చేసింది నిజమే. కాని యిది నాకై పుట్టిన బుద్ధికాదు. మరొకరి ప్రేరణవల్ల యిలా బలవంతంగా" ఆపైన మాట్లాడలేక పోయాడతను.

నిర్ఘాంత పోయాడు జలంధర్. "మరొకరి ప్రేరణా?! యెవరా వ్యక్తి??"

"నాకు తెలియదు. 'కాకుల్ని కొట్టి గద్దలకి వేసినట్టు' అనే సామెత మీరు వినేవుంటారు. అక్షరాలా అంతే జరిగింది నా విషయంలో.

"నాకు అమ్మాయిల పిచ్చి యెక్కువ. 'రమణి' అనే అమ్మాయిని వల్లోవేసుకున్నాను. అది వాళ్ళన్నయ్యతో

చెప్పిందో లేక వాడికెలాగేనా తెల్సిందో మరి ఓ రోజు వెంకటేశ్వర లాడ్జిలో పడుకొని రమణి కోసం యెదురు చూస్తోన్న నాకు పదిమంది రౌడీలు యెదురొచ్చారు. కొట్టిన చోట కొట్టకుండా కొట్టారు. ఓ వుత్తరం నా మొహం మీద పడేసి వెళ్ళిపోయారు.

"ఆ వుత్తరంలో తన చెల్లెలి శీలానికి ఖరీదు కట్టాడా అన్నయ్య. రమణి శీలాన్ని దోచుకున్న నేరానికి నేను వాడు కోరినప్పుడు కోరినంత పైకాన్ని పువ్వుల్లో పెట్టుకొని తీసికెళ్ళి యివ్వాలి. లేకపోతే ఆ రాత్రి పదిమంది రౌడీలు నా గదిలో అడుగు పెడతారు.

"అలా ఎన్నోసార్లు యిచ్చాను. ఎన్నిసార్లని యివ్వగలను? అందుకే నేనూ ఏదేనా పథకాన్ని రూపొందించుకోవాలని ఆలోచించాను.

"మరు రోజు రాత్రి హోటల్ మోహినినుండి నాకు ఫోన్ కాల్ వచ్చింది. ఓ ఆంగ్లోయిండియన్ యువతి మూర్ఛిల్లిందని ఆమె భర్త ఫోన్ చేశాడు. మెడికల్ కిట్ తీసుకొని హుటాహుటిన వెళ్ళాను. ఆ అమ్మాయి నెల తప్పింది. అందువల్ల కళ్ళు తిరిగాయి. అంతే. ఈ వార్త చెప్పి ఆ యువకుణ్ని సంతోషపెట్టి తిరిగివస్తోండగా ఓ గదిలోకి నా భార్య, మాధవస్వామి వెడుతోండటం చూసి ఆశ్చర్యపోయాను.

"కీ హోల్‌లోంచి తొంగి చూశాను. వాళ్ళిద్దరూ శృంగార రసాన్వేషణలో ఓలలాడుతోన్నారు.

"నా పథకానికి రూపం ఏర్పడసాగింది. బ్లాక్ మెయిలర్ నయ్యాను. మాధవస్వామి బలం, బలగం గురించి నాకు తెలీదు. అందుకే నా భార్యనే బ్లాక్ మెయిల్ చెయ్యసాగాను. ఆమె మాధవస్వామి నడిగి యిప్పించు

కొని పరోక్షంగా నాకు సమర్పిస్తోందేది. నేను రమణి అన్నకి పువ్వులుకొని వాటిలో ఆ పైకంపెట్టి సమర్పించే వాణ్ని.

"ఓ రోజు మాధవస్వామి నన్ను కలిశాడు. డబ్బు కోసం నన్ను పీడిస్తే మక్కెలిరగదంతానని బెదిరించాడు. నా భార్య విషయం చెప్పాను. 'చేతనైతే పెళ్ళాన్నదుపులో పెట్టుకోవోయ్' అన్నాడు.

"నాకేదారీ తోచలేదు. మనశ్శాంతి కరువైంది. నా బ్లాక్ మెయిలర్ వత్తిడి బరువైంది. మాధవస్వామిపై కోపం, కసి ప్రజ్వరిల్లింది. తన వేలితో తన కన్నే పొడుచుకున్నట్టు చెయ్యాలనుకున్నాను.

"రజనితో వుత్తరం వ్రాయించాను. అందులో జయప్రియని హత్యచెయ్యాలని, ఆ పని శకుంతలే నిర్వహించాలని హెచ్చరించాను. జయప్రియని యెవరో ప్రేమించి భగ్నప్రేమికుడై ఆమె తనని మోసంచేసి మరొకణ్ని పెళ్లాడటం సహించలేక ఆమెని హత్యచేసి ప్రేమపట్ల విరక్తి కలిగినవాడిలా అందరికీ సందేశాన్నందిస్తోన్నట్టుగా 'యెవరినీ ప్రేమించకు' అనే వాక్యాన్ని రజనితోనే వ్రాయించి నా భార్యకి పంపాను."

"నేననుకున్నట్టుగా నా భార్య జయప్రియని హత్య చేసింది. కాని రమణి అన్న కోరిన ప్రకారం నేను పది వేలు యివ్వలేకపోయాను. అప్పటికే స్కూటరమ్మేశాను. పేషంట్లని డబ్బుకోసం జలగలా పీడించ నారంభిచాను. ప్రాక్టీసు తగ్గిపోయింది. రేపు మళ్ళీ బ్లాక్‌మెయిలర్‌కి పదిహేనువేలివ్వాలి. ఎలా? ఎలా యివ్వాలి? తలబ్రద్దలు కొట్టుకొంటోండగా ఫోనుకాల్ వచ్చింది, నా భార్య సూయిసైడ్ చేసుకున్నట్టు. ఎంతేనా భార్య భార్యే? పరిగెత్తుకొచ్చేశాను.

"ఇదీ జలంధర్‌గారూ నా కథ! నన్ను బ్లాక్ మెయిలర్ బారినుండి తప్పించండి. లేదా యావజ్జీవ కారాగార శిక్ష వేయించి కటకటాల్లో కూర్చోబెట్టండి" దభాలున జలంధర్ కాళ్ళపై పడిపోయాడు డాక్టర్ గోవిందరావ్.

7

సమయం రెండయి వుంటుంది.

అది హోటల్ ఇంద్రలోక్‌లో రెండవ ఫ్లోర్‌లోని 159వ నెంబరు గది. స్పెషల్ డబుల్ రూమ్.

ఫిబ్రవరి నెలైనా డిసెంబర్‌కి మల్లే చలివేస్తూ ఎముకల్ని కొరికేస్తోంది. నిండా బెడ్ షీటు కప్పుకొని ముడుచుకొని పడుకొని వున్నాడు గోవిందరావు. అతని శరీరం చలివల్లా భయంవల్లా విపరీతంగా వణుకుతోంది.

'తను ఎంతోమంది అడపిల్లల్ని వాంఛించాడు. ప్రేమించాడు. కామించాడు. వాళ్ళతో ఆడుకున్నాడు. కాని రమణిలాంటి ఆడది తనకి ఎక్కడా తారసపడలేదు. సుఖా

న్నందించటంలో ఫస్ట్ ప్రయిజే; మళ్ళీ లిరగదన్నించ టంలోనూ ఫస్టు ప్రయిజే!

'రమణి తనని నిజంగానే యిష్టపడిందా? లేక అన్నా చెల్లెలు కలిపి ఆడిన నాటకమా యిది? ఆ బ్లాక్ మెయిలర్ నిజంగా రమణికి అన్నయ్యేనా?

'నిజమైన అన్నయ్యే అయితే శీలం కోల్పోయిన తన చెల్లి బ్రతుకు నిలబెట్టడం కోసం రెండు కోరికల్లో ఏదో ఒకటి కోరుకునేవాడు. ఒకటి తన చెల్లెలి మెళ్లో తాళి కట్టమని. రెండోది: ఆమె గర్భాన్ని తీసెయ్యమని!

'కాని వాడు డబ్బుకోసం తనని జలగలా పట్టుకున్నా డంటే? బాస్టర్డ్! వాళ్ళిద్దరూ తోడు దొంగలై వుండాలి. అవును. ఆ తర్వాత రమణి తనకి మళ్ళీ కన్పించనేలేదు. డర్టీ బిచ్! యింకోణ్ని చూసుకొనుంటుంది!

తను ఎంత మూర్ఖుడు? అంతూపంతూలేని తన కామం ఎన్ని విపరీతాలకి దారితీసింది? బంగారంలాంటి భార్యని నిర్లక్ష్యం చేశాడు. అది మరొకణ్ని చూసుకుంది. తనను రమణి నేర్పుగా ట్రాప్‌చేసి పీడించటం మొదలుపెట్టింది. ఆ ఘోర మానసిక సంఘర్షణ నుండి తెప్పరిల్లటం కోసం తాళిగట్టిన భార్యని తనే బ్లాక్ మెయిల్ చెయ్యాల్సొచ్చింది. మాధవస్వామితో చీవాట్లు తినాల్సి వచ్చింది. రమణి 'అన్న' మనుష్లతో తను దేహ శుద్ధి చేయించుకోవాల్సి వచ్చింది.

'పరువు పోయింది. భార్య పోయింది. స్కూటరు పోయింది. ప్రాక్టీసు పోయింది. మనశ్శాంతిపోయింది....'

తనపై తనకే అసహ్యం వేసింది గోవిందరావుకి.

తలుపు తట్టిన చప్పుడు విన్పించింది.

గుండెల్లో రాయి పడ్డట్టయింది గోవిందరావుకి. అయి

పోయింది. వాళ్ళు. వచ్చేశారు. యిప్పుడు తనేం చెయ్యాలి? తలుపు తెరవాలి. 'డబ్బు సిద్ధమేనా' అని బొంగురు కంఠంతో అడుగుతాడో ముసుగు మనిషి. తెచ్చివుంటే ఏమీ అనకుండా తీసుకుపోతాడు. డబ్బు లేకపోతే?

వళ్ళు వాళ్ళకప్పగించి మౌనంగా దెబ్బల్ని సహిస్తూ వూరుకోవాలి. ఒక్కొక్కరు పదిగుద్దులు. అలా పదిమంది. మొత్తం నూరు గుద్దులు.

నూరు గుద్దుల్ని తిని ప్రాణాల్తో నిలబడగలిగే శక్తి ప్రస్తుతం తనలో వుందా?

'శకుంతలా! నన్ను క్షమించు. నీకు తీరని ద్రోహం చేశాను....' చివరిసారిగా అనుకొని వణుకుతోనే లేచి వెళ్ళి తలుపు తెర్చాడు గోవిందరావు.

సుడిగాలిలా దూసుకొచ్చిందో ఆకారం.

గదిలోని చీకట్లో కల్సిపోయిందా ఆకారం. నల్లని దుస్తులు. నల్లని మాస్కుని ముఖానికి అమర్చుకుంది. చేతిలో అదే రంగు రివాల్వర్!

"డబ్బు సిద్ధమేనా??" బొంగురు గొంతుతో కఠినంగా అందా ఆకారం.

"లె....లె....లే....దు....!"

మరుక్షణం గోవిందరావు మెడ పట్టుకొని అమాంతం వంచేసి 'ధభీ'మని గుద్దిందా ఆకారం.

మెలికలు తిరిగిపోయాడు గోవిందరావు. ప్రేవులు చుట్టచుట్టుకున్నట్లయింది. అంత చీకట్లో కూడ అతడి కళ్ళెదుట తెల్లటి శూన్యం కన్పించింది.

"రమణిని నేను మొత్తంమీద మూడుసార్లు మాత్రమే అనుభవించాను. కాని మీరు కోరిన పైకం ఎన్నిసార్లో యిచ్చాను. యింకా... యింకా నాపై కసి చల్లారలేదా?"

దీనంగా అన్నాడు గోవిందరావు అతి కష్టంపైన లేచి నిలుచుని.

"పోనీ ఓ పని చెయ్యి. ఏదేనా అదృశ్య శక్తిని అద్దెకి తీసుకొని రమణిని తిరిగి అనాఘ్రాత పుష్పంగా మార్చు. మొత్తం పైకాన్ని నీకు పువ్వుల్లో పెట్టి అప్పగిస్తాం...., మా శరీరాల్తో బాటు. ఏమంటావ్?"

తలొంచుకున్నాడు గోవిందరావు.

ఒక్క చిటికవేసిందా ఆకారం. బిలబిల తొమ్మిదిమంది దూసుకువచ్చారు లోపలకి. వలయాకారంగా నిలుచున్నారు.

"మిస్టర్ గోవిందరావ్!? యింకా తొంభై తొమ్మిది గుద్దులు మిగిలున్నాయి. కాచుకో...." మరో గుద్దు ప్రయోగించాడు. 'ముసుగు వీరుడు'.

గోవిందరావు కళ్ళముందు చుక్కలు నాట్యమాడాయి. ఆ విసురుకు మరో ముసుగువీరుడి చేతులకి దగ్గరయ్యాడు.

వాళ్ళమధ్య గోవిందరావు బంతిలా తిరుగుతోన్నాడు. ఏడవటానిక్కూడా శక్తి చాలటంలేదతనికి.

యిరవై గుద్దులు పూర్తయ్యాయి.

'ఆగండి' చటుక్కున అన్నాడు మొదటి ముసుగు వీరుడు.

అందరూ మరబొమ్మల్లా ఆగిపోయారు.

"అమ్మ గోవిందరావూ! వంద గుద్దులు తిని పదిహేను వేలు మిగుల్చుకోవాలనుకున్నావా!? నాలుగు నవాల్జిన్ సూదులు గుచ్చుకొని నొప్పులు పోగొట్టుకుందామనుకున్నావా?" వ్యంగ్యంగా అన్నాడు.

"ఏమిటి నువ్వంటోన్నది?" నీరసంలోనూ ఆశ్చర్యంగా అన్నాడు గోవిందరావు.

జవాబివ్వలేదు ముసుగు మనిషి. ఓ మూలకున్న

దుస్తులు తగిలించుకునే స్టాండుకేసి నడిచాడు. దానికో బెడ్‌షీటు వ్రేలాడుతోంది!

గోవిందరావూ ఆ వేపుకి తిరిగాడు. అతని ఆశ్చర్యం అవధులు దాటింది.

ఆ స్టాండుకి ఓ సూటుకేసు తగిలించబడివుంది అవతలి వేపున. గోవిందరావుకేమీ అర్థం కాలేదు.

"యెవరిదా సూట్‌కేసు? యిక్కడికెలా వచ్చింది? ఒక వేళ తనకంటే ముందు ఈ గదిలో వుండినవాళ్ళు మర్చిపోయారా? ఏముందందులో? భగవాన్! అందులో ఓపది హేనువేలుండేలా చెయ్యి. గుద్దులబాధ తగ్గుతుంది!" మనసులోనే వెయ్యిదేవుళ్ళకి మొక్కుకున్నాడు గోవిందరావు.

ముసుగు మనిషి రివాల్వర్ పట్టుకొని మసక చీకట్లో సూట్‌కేసు వద్దకి వెళ్ళి అందుకోబోయాడు. అంతే.

సూట్‌కేసు చటుక్కున ముందుకొచ్చి ముసుగు మనిషిని బలంగా తాకింది. అతని చేతిలోంచి రివాల్వర్ జారి క్రింద పడిపోయింది. యినపముద్దపై ముష్టిఘాతం ప్రయోగించినవాడిలా చెయ్యి ముడుచుకొని బాధతో కూర్చుండిపోయాడు ముసుగుమనిషి పళ్ళు బిగబట్టి.

మెరుపుల్లా యిద్దరు యువకులు ప్రవేశించారు బట్టల స్టాండు వెనకనుండి. ఒకరు డిటెక్టివ్ జలంధర్! మరొకరు చెప్పాల్సిన పన్లేదు.

గదిలో దేదీప్యమానంగా లైటు వెలగటం, డిటెక్టివ్‌లు జేబుల్లోంచి రివాల్వర్లు తియ్యటం, పదిమంది రౌడీలూ చేతులెత్తి నిలబడటం ఒక్క క్షణంలో జరిగిపోయింది.

గోవిందరావు ఆశ్చర్యపోతూ నాలుక వెళ్ళబెట్టాడు.

"తెలివి మీ సొత్తే కాదు మైడియర్ మాస్క్స్!" గంభీరంగా వాళ్ళకేసి చూస్తూ అన్నాడు డిటెక్టివ్ జలంధర్.

"యిన్నాళ్ళూ మీ ఆటలు సాగాయి. కాని యిప్పుడు కథ క్లయిమాక్సు కొచ్చింది. మీ రెవరెవరో బయటపటక తప్పదు" అని గోవిందరావుకేసి తిరిగాడు జలంధర్.

"మిస్టర్ గోవిందరావ్! వీళ్ళు యింతకుముందు మిమ్మల్ని ఎన్ని గుద్దులు గుద్దారో మీకే జ్ఞాపకం వుండాలి. కమాన్ 'యిక నేను కొట్టలేను బాబోయ్' అనేంతవరకు దంచండి."

"వద్దు జలంధర్‌గారూ! డబ్బుగుంజటం తప్పిస్తే వీళ్లు పెట్టిన శారీరక బాధలకి నేను అర్హుణ్ని. నేరస్థుల్ని చట్టాని కప్పగించండి" అన్నాడు గోవిందరావు.

సూట్‌కేస్ ఆకారంలో పోతపోసిన యినపముద్దని ప్రక్కకి జరుపుతూ అన్నాడు డిటెక్టివ్ జలంధర్....

"మీరు బ్లాక్‌మెయిల్ చేసినప్రకారం గోవిందరావు పది హేనువేలు సంపాదించలేనని, తనని రక్షించమని నాతో చెప్పుకున్నాడు. మీరు ఈ ట్రిప్పుకి ఈ హోటల్లో ఈ గదిని ఎన్నుకున్నట్టు కూడ చెప్పాడు.

"ఈ యినపముద్దతో గోవిందరావుకంటే ముందుగా చేరుకున్నాం. నీ చేతిలో రివాల్వర్ చూశాను. సమయం కోసం కాచుకున్నాను. నువ్వు సూట్‌కేసనుకున్నావ్ దీన్ని చూపి.... ఊఁ....కమాన్! మీ లీడర్ ప్రాణాలు, మీ ప్రాణాలూ నిలవాలంటే ముసుగులు తొలగించండి...." క్రౌర్యంగా అన్నాడు జలంధర్.

తొమ్మిదిమందీ ముసుగులు తొలగించారు. అందరూ చిల్లరరౌడీలు! పాతిక్కీ పరక్కీ గడ్డితినేవాళ్లు! పోలీసు రికార్డులో పాత కేడీలు!!!

"నీ పనికూడ కానియ్ డియర్...." వ్యంగ్యప్రేమతో అన్నాడు జలంధర్, ఇంకా నొప్పితగ్గక చేతులు నలుపు కుంటోన్న మొదటి శాస్త్రితో.

తప్పదనుకున్నాడులావుంది. వణుకుతోన్న చేత్తో ముసుగు తొలగించాడతను. అతన్నిచూడగానే కొయ్యబారిపోయాడు గోవిందరావు రెండుక్షణాల తర్వాత తేరుకొని 'రా..మూ..' అని మాత్రం అనగల్గాడు.

"యస్, మీ వద్ద కాంపౌండర్‌గా పనిచేస్తోన్న రాము!! రామూ!? ఏమిటిది?" గర్జించాడు జలంధర్.

"అవునుసార్! నేనే! నేను, నర్సు అయ్ మీన్ రజని ప్రేమించుకున్నాం. కాని రజనిని చెడగొట్టాడు వీడు. రజని మాత్రం వీడు మంచివాడనే భ్రమలో వుండేది మొదట. కాని వీడి నిజస్వరూపం చూపాలని, ఓ డ్యాన్సింగ్ గర్ల్‌కి డబ్బిచ్చి రమణిగా రంగంలోకి దూకించాను.వీడు దానివల్లో పడ్డాడు. ఓసారి రజని చూడకూడని దృశ్యాన్ని చూపించాను. నిప్పుతొక్కిన కోతిలా మారిపోయింది రజని.

"మరేం ఫర్వాలేదని, యిప్పటికైనా గోవిందరావుని మర్చిపోయే పక్షంలో ఆమెని చేసుకుంటానని చెప్పాను. అయితే వీడికి తగినవిధంగా బుద్ధిచెప్పమని రజని కోరింది.

"రమణి అన్నగా చెలామణి అవుతూ కిరాయి రౌడీలని పోగుచేసుకొని యీ పని ప్రారంభించాను....సార్....నేను బ్లాక్ మెయిలింగ్‌ద్వారా సంపాదించినదంతా మీ రెవరి కిమ్మంటే వాళ్ళకిచ్చేస్తాను. నన్నొదిలెయ్యండి సార్...." దీనంగా అన్నాడు కాంపౌండర్ రాము.

"నో మిస్టర్ రామూ! బ్లాక్ మెయిలింగ్ పెద్ద నేరం. నువ్వూ, నిన్ను ప్రోత్సహించినందుకు రజనీ, భార్యనే బ్లాక్ మెయిల్ చేసి ఆమె ఓ హత్య చెయ్యటానికి కారణ భూతుడైన డాక్టర్ గోవిందరావ్-మీ ముగ్గురూ శిక్షననుభవించాల్సిందే...." గంభీరంగా ముగించాడు డిటెక్టివ్ జలంధర్, జేబులోంచి రెడ్ విల్స్ పేకట్ తీస్తూ. □

మంచులో ప్రపంచం మునిగిపోయింది.

తెల్లవారి ఆరుగంటలు కావచ్చినా చీకటి పారిపోలేదు.

తూర్పుదిక్కున ఆకాశం ముదురు ఎరుపురంగులో కనిపిస్తోంది.

మంచు ముసుగులో వెండికొండ హాయిగా నిద్ర పోతోంది.

రామానుజాచార్యులు మాత్రం అంత చలిలోనూ కొండ దిగువన కోనేట్లో మునిగి, కొండమీద దేవుడికి సుప్రభాతం పాడడానికి బయల్దేరాడు.

గాలిగోపురానికి వున్న సింహద్వారం చిన్న తలుపు నెట్టగానే వచ్చేసింది.

ఆలయంలోకి ప్రవేశించి బొడ్డులో దోపుకున్న తాళాల గుత్తి చేతిలోకి తీసుకుంటున్న ఆచార్యుల కన్ను గుడి తలుపుల వంక చూసి అదిరిపొయ్యాయి.

తాళాలు బ్రద్దలుకొట్టి వున్నాయి.

గుండె వెయ్యిమైళ్ళ స్పీడుతో కొట్టుకుంది.

భయంతో శరీరం వణికిపోయింది.

"సుబ్బన్నా!" అని గావుకేక పెట్టాడు.

సమాధానం రాలేదు.

చుట్టూ ప్రహరీగోడ కోటగోడల్ని మరపిస్తున్నాయి. విశాలమైన ప్రాంగణంలో ఒంటరిగా నిల్చున్న రామానుజాచార్యులు పిచ్చెక్కిన వాడిలా అయిపోయాడు.

గర్భగుడి తలుపులకు వేసిన తాళాలు బ్రద్దలు కొట్టి వున్నాయి. అంటే దొంగతనం జరిగిందన్నమాట. తను ఇప్పుడేం చెయ్యాలి? తలుపులు నెట్టిచూడాలా వద్దా?

రామానుజాచార్యులు గుడిచుట్టూ ప్రదక్షిణలు చేశాడు సుబ్బన్నకోసం కేకలు వేసుకుంటూ.

అంత చలిలోనూ అతని శరీరం వేడెక్కిపోయి చెమట పట్టింది.

సుబ్బన్న ఏమైపోయాడో ఆచార్యులకి అర్థంకాలేదు.

ఒకవేళ దొంగలు సుబ్బన్నని చంపి పారెయ్యలేదు

గదా, అని అనుమానం వచ్చింది. ఆ ఆలోచన రాగానే కట్టెలా బిగుసుకుపోయాడు.

ఇంతలో సన్నటి మూలుగు వినిపించింది.

ఉత్సవ విగ్రహాలున్న గదివైపు చూశాడు. ఆ గదికి తాళం వేసింది వేసినట్లే వుంది.

ఆలయ ప్రాంగణంలో నాలుగువైపులా పొగడచెట్లు వున్నాయి. ఒక చెట్టుకొమ్మ అదేపనిగా కదులుతోంది. మూలుగుగూడా అక్కడ్నుంచే వినిపిస్తోంది.

ఆచార్యులు పరుగున ఆ చెట్టుక్రిందకి వెళ్ళాడు. తల పైకెత్తి చూసాడు.

సుబ్బన్న చెట్టుకొమ్మలకి కట్టేసివున్నాడు. చేతులు వెనక్కి విరిచికట్టారు. ఒక కొమ్మమీద కాళ్ళు నిలబెట్టి కదలకుండా కట్టేసారు. నోరుఎత్తి అరవకుండా నోట్లో గుడ్డలు క్రుక్కారు.

పొగడచెట్టు ఏమంత ఎత్తు లేకపోయినా, చెట్టు ఎక్కి సుబ్బన్నని విడిపించడం అతని చేతగాని పని.

ఇక మిగిలింది వూళ్ళోకి వెళ్ళి జనాన్ని పిల్చుకొని రావడమే. అదేపని చేసాడు ఆచార్యులు. పరుగు పరుగున కొండదిగి వెళ్ళాడు.

సరాసరి ప్రెసిడెంట్ సింహాద్రినాయుడి యిల్లు చేరుకున్నాడు.

అప్పుడే తెల్లవారుతోంది.

ప్రెసిడెంట్‌గారి యింటిముందు పనిమనిషి కళ్ళాపి జల్లుతోంది. ఆయన చిన్నకూతురు ఆవుపేడతో గొబ్బెమ్మలు తయారుచేసి పూలతో అలంకరిస్తోంది. మరొకవైపునుంచి ఆయన మూడోకూతురు ముగ్గులు మొదలు పెట్టింది.

ఆచార్యులు చెమట్లు క్రక్కుకుంటూ రావడం చూసి పాలేరు ఎగతాళి చేశాడు. "ఏటి పంతులూ, కొంప మునిగినవాడిలా ఆ పురుకులు పరుగులూను!" అని.

"అవున్రా నాయనా! కొంప మునిగిపోయింది. తొందరగా నాయుడుగార్ని పిలువు" అన్నాడు అరుగుమీద కూలబడిపోయి.

"నాయుడుగారింకా నిద్ర లేవలేదు పంతులూ!"

"లేవకపోతే లేపరా. నేనొచ్చానని చెప్పు" ఆయాసపడుతూ అన్నాడు ఆచార్యులు.

పాలేరు ఇంట్లోకి వెళ్ళి అమ్మగారి చెవిన వేసాడు ఆచార్యుల కొంపేదో మునిగిందనీ, నాయుడిగార్ని తక్షణం కలుసుకోవాలనీను.

ఆమెగారు ప్రొద్దునే ఇంటికి తగలబడిన మాయదారి సంతను కాసేపు తిట్టుకుని, భర్తకి మేలుకొలుపు పాడింది.

"ఎవడేవాడు ప్రొద్దునే వచ్చిందీ!" అన్నాడు కళ్ళు విప్పకుండానే.

"గుడిపూజారి."

"ఏమొచ్చింది వాడికి ప్రొద్దున్నే, ఇంకా తెల్లవారక ముందే చచ్చాడు" అన్నాడు బద్ధకంగా లేచి కూర్చుంటూ.

"నన్నడిగితే నేనేం చెప్పేది? వెళ్ళి అడగండి" అని వెళ్ళిపోయింది.

నాయుడు ముఖం నీళ్ళతో కడుక్కుని, చుట్ట వెలిగించి గుప్పుగుప్పున పొగవదుల్తూ వచ్చి, అరుగుమీద పడక్కుర్చీలో ఆసీనుడై "ఏంటయ్యా పంతులూ?" అన్నాడు తాపీగా.

"కొంప మునిగిందయ్యా!" అదుర్దాగా అన్నాడు ఆచార్లు.

"చెప్పవయ్యా బాబూ! ఏం జరిగిందో?" విసుగ్గా అన్నాడు నాయుడు.

"గర్భగుడి తాళాలు బ్రద్దలుకొట్టి వున్నాయయ్యా! సుబ్బన్నని ఏమో చెట్టుమీద నిలబెట్టి కట్టేశారయ్యా!"

ఆ మాట విని తనముందు బాంబు బ్రద్దలైనట్లు భయంతో లేచి నిల్చున్నాడు నాయుడు.

"ఆఁ.....కొంపదీసి దేవుడు నగలుగాని పోలేదుగదా!" కంగారుగా వున్నాయి నాయుడి మాటలు.

"ఏమోనయ్యా! నేను తలుపులు ముట్టలేదు. భయంతో పరిగెత్తుకుని తమరివద్దకు వచ్చాను" అన్నాడు.

"ఒరేయ్! నారిగా! వెంకా! చంద్రుడూ!" అని పేరు పేరునా జీతగాళ్ళని కేకేసి ఊళ్ళో పెద్దల కీ వార్త చెప్పి వున్నపాటున గుడిదగ్గరికి రమ్మని చెప్పమన్నాడు.

కొండమీద రాములవారి గుళ్ళో దొంగతనం జరిగిందనే వార్త వెండికొండ ఊళ్ళో వీధి వీధినా కార్చిచ్చులా వ్యాపించింది.

పొలాలలో కోతలు, కుప్పనూర్పిళ్ళు పూర్తిగా అయిపోయాయి. అంతా ఇళ్ళల్లోనే వున్నారు. దొంగతనం సంగతి తెలిసి జనం గుంపులు గుంపులుగా గుడికి చేర సాగారు.

సింహాద్రినాయుడు, మునసబు వెంకట్రాయుడు, కరణం రామశాస్త్రి, పంచాయితీ మెంబర్లు, ఊళ్ళో మోతుబరి రైతులు అంతా గుళ్ళోకి వచ్చేశారు.

సుబ్బన్న కట్లు విప్పి క్రిందకి దించగానే వాడు భోరు, భోరున ఏడుస్తూ నాయుడు కాళ్ళమీద పడిపోయాడు.

"ఏం జరిగిందిరా?" అని అడిగాడు నాయుడు.

'అర్ధరాత్రి సుబ్బన్న గాలిగోపురంలో అరుగుమీద

గొంగళి కప్పుకుని పడుకున్నాడు. ఎవరో వచ్చి నిద్ర లేపారు. గుడిలో దేవుడికి నగలు వున్నాయా లేవా అని అడిగారు. తనకు తెలియదన్నాడు. నిజం చెప్పమని కొట్టారు. నిజంగానే తెలియదని ఏడ్చి మొత్తుకున్నాడు. దేవుడి మెడలో వున్నాయా? లేక ధర్మకర్తగారి ఇంట్లో వున్నాయా చెప్పమని వేధించారు. సుబ్బన్న యేమీ చెప్పలేదు.

తర్వాత వాళ్ళు సుబ్బన్నని చెట్టుమీద నిలబెట్టి కట్టేశారు. కేకలు వెయ్యకుండా నోట్లో గుడ్డలు కుక్కారు. సుమారు గంట తర్వాత గాలిగోపురానికి వున్న సింహ ద్వారం చిన్నతలుపు తీసుకుని వెళ్ళిపోయారు.' అని చెప్పాడు సుబ్బన్న.

వెండికొండ ఊళ్ళో పోలీస్‌స్టేషన్ లేదు. నాలుగు మైళ్ళ దూరాన బంగారుపాళెంలో వుంది. నాయుడు ఫోన్ చేసి జరిగిన సంగతి చెప్పాడు.

తొమ్మిది గంటల ప్రాంతాన పోలీస్‌వ్యాన్ కొండ

దిగువన ఆగింది.

సర్కిల్ ఆనందమూర్తి, సబిన్‌స్పెక్టర్ గంగరాజు, హెడ్ వెంకటస్వామి సింహాద్రినాయుడికి చిరపరిచితులే. వాళ్ళతోపాటు నలుగురు కానిస్టేబుల్స్ గూడ ఫాలో అయ్యారు.

వాళ్ళు రాగానే నాయుడిని కుశలప్రశ్నలు వేసారు. నాయుడు చెప్పిందంతా విన్నారు.

పోలీసులు వచ్చాక జనం ముందుకు రావడం మొదలు పెట్టారు. వాళ్ళని అదుపులో పెట్టడం కానిస్టేబుల్స్‌కి చాల కష్టమైంది.

పోలీసులు వచ్చేవరకూ ఎవరూ గుడితలుపులు ముట్టుకోలేదు. తలుపులమీద దొంగల వేలిముద్రలు దొరకవచ్చనీ, తద్వారా దొంగలు పాతవాళ్ళయితే వెంటనే దొరికిపోతారని నాయుడు చెప్పాడు.

సర్కిల్ ఆనందమూర్తి పగిలిన తాళంకప్పలు ఎవర్నీ ముట్టుకోవద్దని ఆదేశించాడు.

నెమ్మదిగా తలుపులు నెట్టారు.

గర్భగుడిలో చీకటిగా వుంది.

లోపల కరెంట్ దీపాలు లేవు.

రామానుజాచార్యులు దీపారాధన చేసాడు. గర్భగుడిలో వెలుగు వచ్చింది.

తెల్లటి పాలరాతి విగ్రహాలు నాలుగు. రాముడు, సీత, లక్ష్మణుడు, ఆంజనేయుడు. విగ్రహాలకున్న కిరీటాలు పంచలోహాలతో చేసినవి. అవి అలాగే వున్నాయి.

శఠగోపురం వెండిది. అది కనిపించలేదు. రాములవారి కంఠంలో ముత్యాలహారం మాయమైంది. సీతమ్మ మెడలో నల్లపూసల గొలుసు, నవరత్నాల హారం

పోయినట్లే. అవి ఎప్పుడూ వుండేవే. ఇక విగ్రహాల వెనుక ఐరన్ సేఫ్‌లో కొన్ని నగలున్నాయి. ఎప్పుడూ తెర అడ్డం వుంటుంది గనుక విగ్రహాల వెనుక సేఫ్ వున్న సంగతి ఎవరికీ తెలియదు.

దొంగలు యెవరోగాని అసాధ్యుల్లాగే వున్నారు. ఐరన్ సేఫ్ గూడ తెరిచేవుంది. అందులో ఎంతో విలువైన ఆభరణాలున్నాయి. కొన్ని వందల ఏండ్లుగా అవి దేవుడికి సంక్రమించి వున్నాయి.

శ్రీరామాలయం ఎంతో పురాతనమైంది. గొప్పచరిత్ర వుంది. ఆ దేవుడి మహాత్యాలు చెప్పుకుని జనం తన్మయత్వం చెందుతూ వుంటారు. ప్రతి ఏడూ శ్రీరామనవమికి రాములవారికీ, సీతాదేవికీ బ్రహ్మాండగా కళ్యాణం జరిపిస్తారు. నిత్య ధూప నైవేద్యాలేగాక సంవత్సరాని కొకసారి జరిగే బ్రహ్మోత్సవం ఆ చుట్టుప్రక్కల వూళ్ళ నుంచి వచ్చిన జనంతో వెండికొండ మునిగిపోతూ వుంటుంది. ఆ రోజులలో దేవుడికి కొన్ని లక్షల రూపాయల ఆదాయం గూడా వస్తుంది.

కళింగ గజపతి రాజులు, కొండవీటి రెడ్డి ప్రభువులు, విజయనగర సామ్రాట్ శ్రీ కృష్ణరాయలు ఆదిగా గల దైవభక్త పరాయణులు, పుణ్యమూర్తులు ఆ ఆలయం దర్శించి కానుకలు సమర్పించుకొన్నట్లు దాఖలాలున్నాయి. కొందరు రాజులు శిలా ఫలకాలు వేయించగా మరికొందరు మాన్యాలు రాసిచ్చారు.

అటువంటి చరిత్రమాత్రమే కాదు. స్థల మహాత్యం గూడా వుంది ఆ దేవాలయానికి.

త్రేతాయుగంలో శ్రీరాములవారు అరణ్యవాసం చేస్తుండగా వెండికొండ కోనేట్లో స్నానం చేశారనీ,

ఇప్పుడు దేవాలయం కట్టిన స్థలంలో భోజనం చేశారనీ ఆ మార్గం గుండా దండకారణ్యంలో ప్రవేశించారనీ పురాణాలలో వుంది.

చెప్పుకుంటే యెన్నో వున్నాయి.

చెప్పుకోవలసిన విషయాలు కొన్ని వున్నాయి.

పాతికేళ్ళ క్రితంవరకూ ఆ దేవాలయం ధర్మకర్తలు వెండికొండ జమిందారులే. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తదుపరి జమిందారీలు రద్దు అయిన తర్వాత వెండి కొండ ఆఖరి జమిందారు కలకత్తాలో ఫ్యాక్టరీలు కట్టుకుని స్థిరపడిపోయాడు.

పోతూ పోతూ తమ కోటను హైస్కూలుకి దానం చేశాడు. తమ వంశానికి తరతరాలుగా పెద్ద పాలేరుగా పని చేస్తున్న సింహాంద్రినాయుడి వంశానికి మేలుచేసిపోయాడు. పది ఎకరాలు సుక్షేత్రమైన మాగాణి, శ్రీ రామాలయానికి ధర్మ కర్తృత్వం అప్పగించిపోయాడు.

అప్పట్నించి జమీందారు స్థానే సింహాద్రినాయుడు పెద్దరికంలో వెండికొండ గ్రామం మనుగడ సాగిస్తోంది.

2

హైదరాబాద్ నుంచి పోలీసు కుక్కలు వచ్చాయి.

వాసననుబట్టి కొండకు అవలివైపుకి పరిగెత్తాయి. రెండు ఫర్లాంగుల తర్వాత ఆగిపోయాయి. అక్కడ్నించి జీప్ వెళ్ళిన గుర్తులు కన్పించాయి.

పోలీసుకుక్కల్నిబట్టి దొంగల ఆచూకీ తెలుసుకోవడం అసాధ్యం అని తేలింది.

తాళాలమీద, తలుపులుమీద, ఐరన్ సేఫ్ మీద ఎక్కడా ఫింగర్స్ ప్రింట్స్ దొరకలేదు.

పోయిన నగల వివరాలతో అన్ని పోలీస్ స్టేషన్లకి

వైర్లెస్ మెసేజ్ పంపించారు. దేశంలోని అన్ని కేంద్రాలనూ హెచ్చరించారు. బులియన్ మార్కెట్‌లో సి. ఐ. డీలు కనిపెడుతున్నారు.

వెండికొండ రామాలయం వాచ్‌మాన్ సుబ్బన్న చెప్పిన వివరాలు తప్ప వేరే ఆధారం ఏమీ దొరకలేదు.

సుబ్బన్న స్టేట్‌మెంటు ప్రకారం దొంగల ముఠాలో నలుగురు వున్నారు. అంతా ముప్పై సంవత్సరాల లోపు వాళ్ళే. దృఢంగా వున్నారు. చేతులకు నల్లటి గ్లోవ్స్, తలలకు టోపీలు వున్నాయి. ముదురు రంగు నీలం బట్టలు కట్టుకున్నారు. చీకట్లో ముఖాలు స్పష్టంగా కన్పించలేదు. వాళ్లు తెలుగు, హిందీ కలగాపులగంగా మాట్లాడారు.

ఐ. జి. పి., యస్పీ, డియస్పీ హుటాహుటిన వెండికొండ రామాలయం సందర్శించారు.

స్థానికపోలీస్ దర్యాప్తు రికార్డు చేసిన స్టేట్‌మెంట్లు అన్నీ పరిశీలించారు.

అది చిన్న దొంగలు చేసిన పని కాదనీ, యేదో అంతర్రాష్ట్రీ ముఠా ప్లాన్ ప్రకారం చేశారనీ తీర్మానించారు.

వెండికొండ రామాలయం దేవుడి నగలు దొంగిలించడం వార్త దిన పత్రికలు ప్రముఖంగా మొదటి పేజీలలో ప్రకటించాయి.

విలేఖరులు వెండికొండ సందర్శించి రామాలయం పుట్టు పూర్వోత్తరాలు సేకరించి, ఆ దేవాలయం గురించి ప్రత్యేక వ్యాసాలు వ్రాసారు.

ఆధ్యాత్మిక దేశంలో దేవుడికే దిక్కు లేకుండాపోయింది గదా అని ఆస్తికులు దిగులుపడ్డారు.

వెండికొండ వూరి ప్రజలేగాక చుట్టుప్రక్కల కొన్ని తాలూకాలలోని ప్రజలు ఆరాధ్య దైవంగా కొలిచే శ్రీరామ

చంద్రమూర్తి నగలు పోవడంపట్ల దిగ్భ్రాంతి చెందారు.

అసలీ దొంగతనం జరగడానికి కారణం మునసబు వెంకట్రాయుడే అని కొందరు చాటుమాటుగా గుసగుసలాడ జొచ్చారు. ఆ గాలి దుమారం సింహాద్రినాయుడి వరకూ వచ్చి ఆయన కేకలు వేశాడు అటువంటి వార్తలు మోసుకు వచ్చినవాళ్ళని.

ఇందులో మునసబు వెంకట్రాయుడు చేసిన పొరపాటు యేమీ లేదు. అతను ఈసారి ఎలక్షన్స్‌లో అసెంబ్లీకి పోటీ చెయ్యాలని నిర్ణయించుకున్నాడు. అందుకు నాయుడి ప్రోత్సాహం గూడా వుంది.

నాయుడు పంచాయితీ లెవల్ దాటి పోదల్చుకోలేదు. తన పుట్టిన వూరికి సేవ చేయగలితే చాలు అని సంతృప్తిని వెల్లడించాడు. వెంకట్రాయుడు తెగ వుత్సాహపడిపోయారు నాయుడు తనకి అడ్డం రానందుకు. ఆ ప్రాంతంలో కురువృద్ధుడు భీష్మాచార్యులు వంటి సుబ్బరాజు అసెంబ్లిలో సిట్టింగ్ మెంబర్‌గానే గాక శాశ్వత సభ్యుడు. ఆయన గుండెజబ్బుతో పోయాడు.

ఆయాన తర్వాత సీనియార్టీప్రకారం సింహాద్రినాయుడికే ప్రజల్లో పలుకుబడి వుంది. కాని నాయుడికి ఎమ్మెల్లే అవడం ఇష్టం లేదు. అందుకని వెంకట్రాయుడు తెగ వుబలాట పడిపోతున్నాడు ప్రజాసేవ చెయ్యాలని.

ప్రజాసేవ చెయ్యాలంటే పదవి కావాలి. పదవి వూరికే వస్తుందా? ప్రజల్లో పలుకుబడి సంపాదించాలి. అన్నదానాలుచేసి, సత్రాలు కట్టించీ, చెట్లు నాటించీ, బావులు త్రవ్వించీ మంచిపేరు సంపాదించే రోజులు పోయాయి.

నాయకుడికి హైదరాబాదులో అధికార వర్గాలలో పనులు చేయించే కెపాసిటీ వుండాలి. మంత్రులతో పూసుకుని



రాసుకుని తిరగగలిగే చొరవవుండాలి. ఆ ప్రాంతంలో కుర్రాళ్ళకి వుద్యోగాలు సంపాదించి పెట్టగలగాలి. వ్యాపారస్తులకి పర్మిట్లు, బస్సు ఓనర్లకి రూట్లు, చిటికలో తెప్పించాలి. ఖూనీకేసునయినా సరే మాఫ్ చేయించే సత్తా వుండాలి. వాడూ నాయకుడంటే. అదీ మగతనం అంటే. అటువంటివాడికి జనం ఓట్ల వర్షం కురిపిస్తారు.

వెంకట్రాయుడికి అవన్నీ తెలుసు. ఎన్నాళ్ళు చేస్తాడీ మునసబుగిరీ. జీవితాంతం రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లకీ, తాపిల్దార్లకీ సలాములు కొట్టడమే సరిపోతే, ఇక సార్ధకత ఏముంది? అందుకే నడుం బిగించాడు అసెంబ్లీలో పాగా వెయ్యాలని.

మూడు నెలల క్రితమే రామాలయం బ్రహ్మోత్సవాలు జరిగాయి. ప్రతిఏడూ జరిగే వుత్సవాలకన్నా ఈసారి జరిగినవి ఎంతో ప్రత్యేకత కలిగాయి.

ఉత్సవాలు జరిగినన్ని రోజులూ మంత్రులు వెండికొండ రామాలయాన్ని సందర్శించడమూ, పూజలలో

పాల్గొనడం, పూజారులు వేద మంత్రాలు పల్లిస్తూ పూర్ణ కుంభంతో వారికి స్వాగతం చెప్పడమూ, అట్టహాసంగా ఏర్పాట్లు చేయబడ్డాయి.

హరికథలు, బుర్రకథలూ, పురాణ కాలక్షేపాలకంటే మంత్రుల వుపన్యాసాలకే ఎక్కువ సమయం కేటాయించ బడింది.

ఆ సభలలో మునసబు వెంకట్రాయుడు వెండికొండ రాముడిని తెగపొగిడాడు. ఆ దేవుడి మహాత్యాలు కథ లుగా చెప్పి కథకులను మురిపించాడు. కొండవీడు, కళింగ, విజయనగర రాజులు దేవుడికి సమర్పించిన నగల వైభ వాన్ని వివరించాడు. అటువంటి విలువయిన నగలు దేశ ములో ఏ దేవుడికీ లేవని గర్వంగా చెప్పుకున్నాడు. చివరికి తేల్చి చెప్పిందేమిటంటే వెండికొండ రాముడు దేశంలోని ధనవంతులలో ఒకడనే.

మంత్రుల ప్రసంగాలతోపాటు వెంకట్రాయుడి వుప న్యాస సారం గూడా పేపర్లలోకి ఎక్కిపోయింది. ఆ గుళ్ళో అమూల్యమైన నగలు వున్న సంగతి దేశం నలు మూలలా వ్యాపించింది. బడా దొంగలు దేవుడి నగలమీద కన్ను వేశారు. సమయం చూసి దోపిడీ చేశారు.

ఇదంతా వెంకట్రాయుడి వల్లనే జరిగిందని మూర్ఖ ప్రజలు అనుకుంటున్నారు.

బాగుందండీ వీరి తెలివి!

ఆ సమయానికి అలా జరగవలసి వుందని దేవుడి రాత తప్పించ ఎవరి తరము?

3

దేవుడి నగలుపోయి వారం దాటింది?

బంగారుపాలెం పోలీస్‌స్టేషన్‌కి హైదరాబాద్ నుంచి

వైర్‌లెస్ మెసేజ్ వచ్చింది.

నగలు దొరికాయి. వెండికొండ రామాలయం ట్రస్టీలందరూ హైదరాబాద్ వస్తే, నగలు భద్రంగా అందజేస్తారు అని సర్కిల్ ఆనందమూర్తి రాత్రికి రాత్రి వెండికొండకి వెళ్ళాడు. హైదరాబాద్ రావడానికి నాయుడు సుముఖంగా లేడు. వెంకట్రాయుడికి జ్వరంగా వుందట.

వెంటనే వెళ్ళకపోతే తనకి చార్జిషీటు వస్తుందని ఆనందమూర్తి మొత్తుకున్న తర్వాత బయల్దేరారు ఆ పెద్ద మనుష్యులు. ఆ రాత్రి బయల్దేరి వెళ్ళిన పెద్దమనుషులు మర్నాడు రాలేదు సరిగదా, ఆ మర్నాడుగూడా అంతులేరు.

కాని దినపత్రికలలో వాళ్ళ ఫోటోలు పడ్డాయి.

వెండికొండ ప్రజలు అది చదివి మూర్ఛపోబోయేరు.

'వెండికొండ రామాలయంలో దోపిడీ చేయబడ్డ నగలు వారం లోపునే దొంగలు ఇనస్పెక్టర్ జనరల్‌కి పార్సెల్ ద్వారా పంపించారు.

'అయ్యో! మేము దొంగిలించిన నగలన్నీ గిల్టువి. మాకు శ్రమ తప్ప లాభం కలగలేదని తెలియజెయ్యడానికి చింతిస్తున్నాము. అందుకే త్రిప్పి భద్రంగా పంపిస్తున్నాము. సదరు అమూల్య ఆభరణములు ఆ దేవుడిగారి ధర్మకర్తలకు అందజేయ ప్రార్థన' అని ఒక విజ్ఞాపన పత్రంగూడా వుంచారు. అదీ కథ!

తరతరాలనుంచీ దేవుడికి సంక్రమిస్తున్న అమూల్య ఆభరణాలకి నకలు చేయించి అసలు నగలు స్వాహా చేసినట్లు సింహాద్రినాయుడు, మునసబు వెంకట్రాయుడు పగైరా ధర్మకర్తలు నిజాన్ని ఒప్పుకున్నారనీ, వారంతా ప్రస్తుతం శ్రీకృష్ణజన్మస్థానంలో దేవుడిని ప్రార్థిస్తున్నారనీ, పేపర్లవాళ్లు దేశానికి తెలియజేశారు. □

పేగు కొమ్ముడి

ఎమ్.వి.వి. సత్యనారాయణ

మధ్యాహ్నం 1 గం॥ 10 ని.

వాల్తేరు స్టేషన్‌లో మెయిల్ ఆగింది. దిగేజనం, ఎక్కే జనం, కాఫీ ఫలహారాలు సిగరెట్లు అమ్మేవాళ్ళూ, తినితాగేవాళ్ళూ, వీడ్కోలు యిచ్చేవాళ్ళూ, రిసీవ్ చేసుకునేవాళ్ళూ— మొత్తానికి నగరంలో వున్న జనాభా

మొత్తములో సగం మంది అక్కడే వున్నట్టు హడావిడిగా గందరగోళంగా వుంది.

కాస్త ఆలస్యంగా రావడంవలన మెయిల్ ఎక్కువ సేపు ఆగకుండా బయల్దేరబోతోన్నట్లు ఎనౌన్సర్ ప్రకటించాడు. గ్రీన్ సిగ్నల్ యిచ్చారు.

పాతికేళ్ళ యువకుడొకడు ప్లాట్‌ఫాం మీద అడుగు పెట్టాడు. అతని వెనకగా రెండేళ్ళ చిన్నగా కనిపించే మరో యువకుడూ అతడికి చెరో ప్రక్క ఇద్దరు స్త్రీలూ ప్లాట్‌ఫాం మీద అడుగు పెట్టారు.

"మెయిలు టయిమయినట్టుంది. త్వరగా రండి.... అన్నయ్యా! ఫస్టుక్లాసు కంపార్టుమెంటు ఎక్కడుందో చూడు" అన్నాడు ఇరవై మూడేళ్ళ యువకుడు గోపాలరావు.

ముందు నడుస్తోన్న రాజారావు వులిక్కిపడ్డాడు.

మెయిలు ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం మీదవుంది. బయలుదేరేవేళ కావడంతో హడావిడి మరింత ఎక్కువయింది.

"గోపీ!" రాజారావు వెనక్కి తిరిగి గోపాలరావు భుజం పట్టుకున్నాడు.

జనం వాళ్ళను ఒరుసుకుంటూ పరుగులు తీస్తున్నారు. ఉన్నట్టుండి ఎవరో వాళ్ళిద్దరిమీదా పడ్డారు. గోపాలరావు ముందుకి తూలాడు. బాలెన్స్ తప్పి క్రిందపడ్డాడు. అతడికి ఏం జరుగుతుందో తెలిసే లోపున కుడి జబ్బలో సూది దిగబడింది. నిజానికది సూదికాదు. దబ్బనానికీ సూదికీమధ్య ప్రమాణములో వున్న సిరంజి!

గోపాలరావు కెవ్వుమన్నాడు. సిరంజిలోంచి పసుపు పచ్చటి ద్రవం అతడి శరీరంలోకి ఎక్కింది. రద్దీలో ఒకరి

గొడవ మరొకరికి లేదు. అంతా క్షణంలో జరిగిపోయింది. ఆతడి భుజంలో కండరాలను కోస్తోన్నట్టు ఒకటే బాధ.

గోపాలరావు తల త్రిప్పి చూసేసరికి తన ప్రక్క నుండి ఎవరో దూసుకు వెళ్ళిపోతూ కనిపించారు. రాజా రావు ప్రక్కకు తిరిగి గోపాలరావు జబ్బ పుచ్చుకుని రబ్ చేస్తూ, "ఏమయింది? ఎవరు వాళ్ళు?" అంటూ ప్రశ్నలు వేశాడు.

మెయిలు కూత వేసింది.

గోపాలరావు బాధగా చూచి, "అతడెవరో....నా జబ్బలో సూది గ్రుచ్చాడు....ఒకటే పోటు...." అని మూలగసాగాడు.

రాజారావు రబ్ చేయటం ఆపి, "అతడిని గుర్తు పట్టావా? ఎలా వుంటాడు?" అన్నాడు.

గోపాలరావు మూలిగి, "పసుపురంగు చొక్కా.... మీసాలు....అంతే చూడగలిగాను."

స్త్రీలిద్దరూ అతడి చుట్టూచేరి ప్రశ్నలు వర్షంలా కురి పించారు.

గోపాలరావు భుజాలకేసి చూసుకున్నాడు. ఇంజక్షన్ రంధ్రంలోంచి పసుపుపచ్చటి ద్రవం కారుతోంది.

"పదండి, బండి కదిలేలా వుంది" అన్నాడు గోపాల రావు.

"పోలీస్ రిపోర్టు యిద్దాం" అంది యువతి.

"ఇవ్వాల్టికి ప్రయాణం వాయిదా పడుతుంది" అన్నాడు రాజారావు.

"వద్దు. నాకు బాగానే వుంది. కాస్త సాయం పట్టండి. మెయిలు వెళ్ళిపోతుంది" గోపాలరావు నొప్పిని అణచి పెట్టుకుని లేవబోయాడు.

గోపాలరావును సాయంపట్టి కంపార్టుమెంటు ఎక్కిం చాడు రాజారావు. స్త్రీలు కూడా అతని వెనకనే ఎక్కారు. బండి కదిలింది.

"ఆ వ్యక్తి ఎవరో కనుక్కుంటావా అన్నయ్యా?" అన్నాడు గోపాలరావు.

"ఆఁ! ఆఁ! తప్పకుండా" అంటూ రాజారావు బండి దిగిపోతూ వాళ్ళకి వీడ్కోలు యిచ్చాడు.

"అన్నయ్యా!" గోపాలరావు కిటికీలోంచి తొంగి చూశాడు.

రాజారావు చెయ్యివూపి, "కలకత్తా వెళ్ళగానే వైద్యం చేయించు. ఒంట్లో నలతగా వుంది. పాపం! అనవసరంగా బయల్దేరావు" అన్నాడు.

అతడి మాటలు రైలు హోరులో కలిసిపోయాయి.

"ఎలా వుంది బావా?" అడిగింది రాధ.

రాధ గోపాలరావుకి వరసకి మరదలు అవుతుంది. రాధ తండ్రి ఆమె చిన్నతనంలోనే కలరా తగిలి మరణించాడు. తల్లి కాంతంతో కలసి గోపాలరావు వద్దవుండి చదువు కుంటోంది. గోపాలరావుకి అయిదారు నెలలుగా అస్వస్థతగా వుంటోంది.

గోపాలరావు బాధగా తలెత్తి రాధకేసి చూశాడు.

"ఇంకా నొప్పిగా వుంది. పడుకుంటాను. కూర్చో లేను...."

కాంతం, రాధ లేచి ఒక మూలగా జరిగి కూర్చున్నారు. గోపాలరావు ముడిచిపెట్టి పండుకున్నాడు, ఎడంవైపుగా ఒత్తిగిలి.

షర్టు ఒత్తిగించి గోపాలరావు భుజంకేసి చూసింది రాధ.

గాయంలోంచి రక్తపుచుక్క కనిపిస్తోంది.

ఆమె కళ్ళల్లో నీళ్లు నిలిచాయి. తల్లి తనను గమనించ కుండా జాగ్రత్తపడి దూరంగా వెనక్కి పోతోన్న కొండల కేసి చూడసాగింది.

2

రాజారావూ గోపాలరావూ లక్షాధికారి జగన్నాధంగారి కొడుకులు.

జగన్నాధంగారు పక్షవాతంతో తీసుకుంటూ మంచాన పడ్డారు. అప్పటికింకా పిల్లలిద్దరూ హైస్కూలు చదువుల్లో వున్నారు. రోగ తీవ్రతా, పిల్లలమీద అపేక్షా ఆయన్ని మరంత క్రుంగదీశాయి. విశాఖపట్నం నడిబొడ్డున వున్న రెండు బంగళాలూ, లక్ష రూపాయిల పైచిలుకు పైకమూ, పొలాలూ అన్నదమ్ములిద్దరికీ సమానంగా పంచి జగన్నాధంగారు కన్ను మూశారు. అన్నదమ్ములిద్దరి మధ్యా రెండేళ్ళే తేడా. అయినా ఇద్దరికీ వున్న స్నేహితులు వేరు. అభిరుచులు వేరు. అభిప్రాయాలు వేరు. అలవాట్లలో ఎంతో అగాధమూ వుంది.

రాజారావు హైస్కూలు చదువుతో ఫుల్‌స్టాప్ పెట్టి ఆస్తి చూసుకోసాగాడు. గోపాలరావు కాలేజీలో చేరాడు.

కాంతం తన కూతురు రాధతో అన్నదమ్ముల యింటికి వచ్చేసింది.

మెయిలు విజయనగరం వదిలిపెట్టింది.

తల్లి నిశ్శబ్దంగా కూర్చోడంతో రాధ తిరిగి ఆలోచనల్లోకి జారిపోయింది.

సరిగ్గా ఆరునెలల క్రితం....

ఆ రోజు గోపాలరావు బావ యూనివర్శిటీ నుండి ఆలస్యంగా వచ్చాడు. బావవచ్చే సమయానికి తాను ఇంట్లోనే



వుంది.

"అబ్బ! యీ రోజు అన్ని క్లాసులూ వర్కే!" అని వస్తూనే గోపాలరావు పడకకుర్చీలో వాలిపోయాడు.

గోపాలరావు ఎం.బి.ఎ. చేస్తున్నాడు. కలకత్తాలో ఈస్టుకోస్టు గ్లాస్‌వేర్ కంపెనీ పెట్టాడు. నిర్వహణా సామర్థ్యం పెంచుకోవాలని గోపాలరావు తాపత్రయ పడుతున్నాడు. అక్కడ బిజినెస్! ఇక్కడ చదువు! రెండు పడవల మీద కాళ్ళు పెట్టినట్టు ప్రతివిషయంలో అస్తవ్యస్తం యెదురౌతోంది.

ఆలోచనలతో గోపాలరావు బుర్ర వేడెక్కిపోతోంది.

బావకి పూర్తి విశ్రాంతిని యివ్వాలనే వుద్దేశ్యంతో రాధ ఓవల్‌టీన్ తెచ్చిపెట్టి మామూలుగా పలకరించి వెళ్ళిపోయింది. గోపాలరావు తాగి అలాగే నిద్రలోకి జారిపోయాడు.

భోజనంవేళకి ఏదో యింత తిని నిద్రలోకి జారిపోయాడు. కాంతం లేపి లోపల పడుకోమని చెప్పబోయింది.

"వద్దమ్మా! లేపకు! బావను విశ్రాంతిగా నిద్రపోనివ్వు. నేను కాస్త మెలకువగా వుంటాను. నిద్రలేవగానే బావకి ఏం కావాలో చూస్తాను" అంది రాధ.

తల్లి లైటుతీపి నిద్రలోకి జారిపోయింది.

టైం యెంత గడిచిందో కాంతానికి తెలియదు. ఆమెకు మెలకువ వచ్చేటప్పటికి బయట రాధ కేకలు పెడుతోంది. ఆమె కేకలమధ్య గోపాలరావు మూలుగుతున్నాడు. కాంతం చప్పునలేచి లైటువేసి తలుపుతీసి నడవాలోకి వెళ్ళింది.

రాధ తల్లిని చూడగానే బావురుమంది. కాంతం రెండంగల్లో రాధని సమీపించి పొదివి పట్టుకున్నది.

"ఏమయిందమ్మా!" అడిగింది తల్లి.

"ఏమోనమ్మా! నాకేమీ తెలియడంలేదు. ఎప్పుడు నిద్రపట్టిందో మత్తుగా నిద్రపోయాను. తలుపు తెరుచుకున్న శబ్దానికి ఇట్టే మెలకువ వచ్చింది. అయితే కళ్ళు తెరుచుకుని చూడలేని మగతగా వుంది. అప్పుడు..." రాధ గొంతులో దుఃఖంపొర కలకబారింది.

గోపాలరావు మూలుగుతున్నాడు. కాంతం రాధని సముదాయిస్తూనే గోపాలరావును సమీపించింది. కళ్ళు మూసుకుని గడగడ వణుకుతున్నాడు. గోపాలరావు తన యెడంభుజాన్ని కుడిచేత్తో పట్టుకుని వుండడం కాంతం గమనించింది.

"బాబూ! ఏమయింది" అడిగింది కాంతం.

గోపాలరావు పండ్లబిగిని బాధను నొక్కిపట్టి, "అత్తయ్యా! యెవరో నా మీద పడి ఏదో ఇంజక్షన్ యిచ్చారు" అన్నాడు.

"అవునమ్మా! ఇద్దరు వ్యక్తులు బావను పట్టుకున్నారు.

ఇద్దరికీ నల్లటి ముసుగులున్నాయి. వాళ్ళలో ఒక వ్యక్తి ఇంజక్షన్ చేశాడు. నేను అరచేలోపుగానే పారిపోయారు" అంది రాధ.

కాంతం చటుక్కున బయటికి పరుగెత్తింది. వరండాలో లైటువేసింది. అక్కడే నిలబడి, "దేశపాండేగారూ! డాక్టర్‌గారూ!" అని కంఠం చించుకుంటూ కేకలు పెట్టింది.

దేశపాండే కాంతం యింటి ప్రక్కనేవున్న ఎం. డి. అయితే ఆయన యింట్లో ప్రాక్టీసు చేయడు. కాంతం పెద బొబ్బలికి ఆయన లేచాడు. కాంతం అరుస్తూనే సంగతి చెప్పింది. దేశపాండే కళ్ళు నులుముకుంటూ లేచివచ్చాడు. గోపాలరావును పరీక్షించాడు. ఇంజక్షన్ చేసిన చోటు నుండి రసి, మందు కలిసిన ద్రవపదార్థం కారుతోంది. దేశపాండే గోపాలరావును తన యింటికి తీసుకువెళ్ళి ప్రయోగశాలలో పడుకోబెట్టి చికిత్సకి ఏర్పాట్లు చేయసాగాడు.

"నన్ను పిలవడంతో తెలివయిన పనిచేశారు కాంతంగారూ!" అన్నాడు దేశపాండే.

కాంతం కృతజ్ఞతగా చూచింది ఆయనని.

"ఎవరో ధనుర్వాతం క్రమ్మే ఇంజక్షన్ చేశారు. గంటలో ప్రాణం పోయేది" అన్నాడు దేశపాండే.

3

బుసలు కక్కుతూ మెయిల్ హౌరా ప్లాట్‌ఫాం మీద ఆగింది.

ప్రయాణీకులు దిగుతున్నారు. కాంతం గోపాలరావును లేపింది. అతడి శరీరం కాలిపోతోంది. కళ్లు మగతగా విప్పి చూశాడు.

సామాను పోర్టర్‌కి యిచ్చి కాంతం, రాధ యిద్దరూ గోపాలరావును చెరో ప్రక్క పాయంపట్టి స్టేషన్ బయటికి తీసుకువచ్చారు.

రాధ టాక్సీ మాట్లాడింది. సామాను డిక్కీలో సర్దాడు డ్రైవర్.

టాక్సీ జతిన్‌దాస్ రోడ్లో ఒక యింటి ముందాగింది. రాధ టాక్సీ దిగి యింటి తలుపుతట్టింది. తలుపు తెరుచుకుంది. పాతికేళ్ళ యువకుడి మొహం కనిపించింది.

"నమస్తే! డాక్టర్ జీ!" చేతులు జోడించింది రాధ.

డాక్టర్ సంతోష్‌చటర్జీ ప్రతినమస్కారం చేశాడు.

"గోపాలరావు వస్తోన్నట్టు రాసిన ఉత్తరం అందింది. అందుకే ఇంట్లో కాచుకూచున్నాను" అన్నాడు డా. సంతోష్ చటర్జీ.

గోపాలరావును నడిపించుకుంటూ కాంతం వచ్చింది. కాంతం యిచ్చిన బాడుగను జేబులో పెట్టుకుని సామాను దించి టాక్సీ తీసుకువెళ్ళిపోయాడు డ్రైవర్.

సంతోష్‌చటర్జీ కాంతానికి నమస్కరించి గోపాలరావు కేసి ఆశ్చర్యంగా చూస్తూండిపోయాడు. లోపలకి తీసుకువెళ్ళి సోఫాలో పడుకోబెట్టారు గోపాలరావును.

కాంతం వాల్తేరు రైల్వేస్టేషన్‌లో జరిగిన సంగతి వివరించి చెప్పింది. డా. సంతోష్‌చటర్జీ గోపాలరావు భుజం కేసి చూశాడు. అతడి భుజం నెత్తురు గడ్డలాగా వుంది. మధ్యలో మాడిపోయిన రంగులో చీము పేరుకుని వుంది.

"డాక్టరుగారూ! దుండగులు ఎవరో పాప ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు" అంది రాధ.

డా. సంతోష్‌చటర్జీ తల పంకించాడు.

డా. సంతోష్‌చటర్జీ హౌరాలో పేరుమోసిన బాక్టీరియా

లజిస్ట్. ఆయనకి సూక్ష్మ జీవులమీద జరిపే ప్రయోగాల్లో అవసరమైన రీతిలో పరికరాలు సరఫరాచేసి గోపాలరావు యెంతగానో సహకరించాడు. గోపాలరావుకి వైద్యంలో సలహా యిస్తూ చికిత్స చేసేవాడు డా. సంతోష్‌చటర్జీ. ఒకరికొకరు చేదోడు వాదోడుగా వుంటూ కలకత్తాలో గౌరవాదరాలు సంపాదించుకున్నారు.

డాక్టర్ సంతోష్‌చటర్జీ తన కాంపౌండర్‌ని పిలిచాడు. కాంపౌండర్ వచ్చాడు.

"లాబ్‌లో బాక్టిరియా టెస్టుకి ఏర్పాటు చెయ్యి. పేషెంటును అక్కడికి చేర్పించు." అంటూ డా. సంతోష్ చటర్జీ చకగక ఆదేశాలిస్తూ తెల్లకోటులోకి దూరి స్టెత స్కోప్ మెడలో తగిలించుకున్నాడు.

"మీరు విశ్రాంతి తీసుకోండమ్మా! భోజనం ఏర్పాట్లు జరుగుతున్నాయి." అంటూ తల్లీ కూతుళ్ళకి చెప్పి, వాళ్ళ సమాధానంకోసం ఎదురు చూడకుండా లాబ్‌లో అడుగు పెట్టి తలుపు మూశాడు.

అరగంట తర్వాత నిస్పృహగా బయటకి వచ్చాడు.

"సారీ నేను చేయగలిగిందేమీ లేదు. చేయవలసిం దంతా చేశాను. గోపాలరావు శవాన్ని పోలీసులకు ఒప్ప చెప్పడం మినహా నేనేమీ చేయలేను." డా. సంతోష్ చటర్జీ గోడకేసి తిరిగి అన్నాడు.

అతడు తల్లీ కూతుళ్ళకేసి చూడలేక పోతోన్నాడు. గోపాలరావు తనచేతిమీదుగా చివరి శ్వాస పీల్చాడు.

"గోపాలరావు హత్య చేయబడ్డాడు. సందేహం లేదు. ఎవరో అతడి శరీరంలోకి ప్లేగు క్రిములను ఇంజెక్ట్ చేశారు. ఈ విషయం పోలీసులకి చెప్పాలి. వార్తేరులో వుండగానే అతడికి వైద్యం అందివుంటే.... సారీ....

అక్కడెక్కడా బ్యాక్టీరియాలజిస్ట్ లేడు. వైద్య చికిత్స అందే అవకాశం లేదు.” అన్నాడు సంతోష్ చటర్జీ.

తల్లీ కూతుళ్ళు నిర్ఘాంతపోయారు.

4

టెలిఫోన్ గణగణలాడింది. సునీత రిసీవర్ ఎత్తింది. అర నిమిషం మాట్లాడి “లైన్‌లో వుండండి. పిలుస్తాను” అని రిసీవర్ బల్లమీద పెట్టి గదిలోపలికెళ్ళింది.

“మీకు ట్రంక్ కాల్. కలకత్తానుండి. సంతోష్ చటర్జీ.” అంది సునీత.

డిటెక్టివ్ శిరీష్ కాఫీ తాగుతున్నవాడల్లా చటుక్కున కప్పు బల్లమీద వుంచి టెలిఫోన్ వున్న గదిలోకి పరుగెత్తాడు. రిసీవర్ అందుకున్నాడు.

“హల్లో....నమస్తే .... డాక్టర్ సంతోష్! చాలకాలమయింది మీ గొంతు విని.” అన్నాడు డిటెక్టివ్ శిరీష్.

“నమస్తే బాగున్నారా?”

“ఆఁ! చెప్పండి ఏమిటి విశేషాలు?”

“చాలా వున్నాయి. ఇక్కడ ఈస్టుకోస్టుగ్లాస్‌వేర్ కంపెనీ వుంది. దాని యజమాని గోపాలరావు హత్య చేయబడ్డాడు” అని వాల్తేరు రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంమీద జరిగిన విశేషాలనుండి తన లాబ్‌లో గోపాల్‌రావు చనిపోయిన సంగతివరకూ చెప్పుకువచ్చాడు డా. సంతోష్ చటర్జీ.

“అవును. నేను చదివాను. సి.బి.ఐ. దర్యాప్తు చేస్తున్నట్టు రాశారు.”

“సి. బి. ఐ. దర్యాప్తులో గోపాలరావు పేర అర లక్ష రూపాయల ఇన్సూరెన్సుపాలసీ తీసుకోబడింది. నామినీ, దక్షిణామూర్తి. సి. బి. ఐ. వారు దక్షిణామూర్తి ఎవరో మొదట్లో గోపాలరావుకి ఆప్తుడనీ, తరువాత

డబ్బుకి ఆశపడి గోపాలరావు ప్రాణాలకే ముప్పు తెచ్చాడని అభిప్రాయపడ్డారు. దక్షిణామూర్తి ఎవరో వారి పరిశోధనలో తేలలేదు. కేసు ఫైలు మూత పడింది."

"కాంతాన్ని అడిగారా? దక్షిణామూర్తి యెవరో తెలుస్తుంది."

"ప్రయత్నించాం. ఫలించలేకపోయింది."

"అయితే దక్షిణామూర్తి యెవరో కల్పిత వ్యక్తి కావచ్చును కదా!"

"పాయింటికి వచ్చారు. నా నమ్మకం అదే! కల్పిత

వ్యక్తిని సృష్టించి వెయ్యో రెండువేలో ప్రీమియములుగా కట్టి గోపాలరావును మరెవరో హత్యచేశారని నా అభిప్రాయం."

"కావచ్చును."

"మిస్టర్ శిరీష్! మీరు ఈ కేసు టేకప్‌చేసి గోపాలరావును హత్యచేసిన వాళ్ళను పట్టుకోవాలి. నా కోరిక కాదనకండి.... ప్లీజ్."

డిటెక్టివ్ శిరీష్ నవ్వి, "డాక్టర్‌గారూ! ఈ కేసులో మీ యింటరెస్ట్ ఏమిటి? గోపాలరావు కేవలం మీకు స్నేహితుడే కదా!" అన్నాడు.

"అది ఒక్కటే కాదు డిటెక్టివ్ శిరీష్! వైద్యుడిగా నా బాధ్యత కూడా వుంది. గోపాలరావు శరీరంలోకి ప్లేగు క్రిములు ఇంజెక్ట్ చేశాడు. బెంగాల్ క్షామం తర్వాత ప్లేగుతో చనిపోయిన కేసు భారత చరిత్రలో లేదు. ప్లేగు క్రిములు గోపాలరావు శరీరంలో సజీవంగా దొరికాయి. అంటే హంతకుడికి యింత ప్రమాదకరమైన క్రిములు దొరికాయన్నమాట! గోపాలరావులాగా మరెందరో హంతకుడికి బలవుతారు. లేదా అలాంటి అవకాశం వుంది. సి.బి.ఐ. వారు ఈ కేసులో మరింత ముందుకి వెళ్ళలేక పోయారు."

"కరెక్ట్! సూక్ష్మజీవులు మనదేశంలో హాఫ్‌కిన్ ఇన్‌స్టిట్యూట్‌లోనేగదా దొరుకుతాయి."

"అవును. హంతకుడు యెవరో తెలిస్తే తప్ప ఇన్‌స్టిట్యూట్‌లో మాత్రం సూక్ష్మజీవులు యెలా బయటికి వెళ్ళాయో తెలియచెప్పే అవకాశం లేదుకదా!"

"ఇండియాలో వున్న బాక్టీరియాలజిస్టులు చాల తక్కువమంది కదా! వారిలోనే ఎవరో కోరితే తప్ప

బాక్టీరియా సరఫరా చేయరు. మీ దగ్గర బాక్టీరియాలజిస్టుల జాబితా వుందా?"

"వుంది.... మొత్తం పదిమంది."

"రాసుకుంటాను చెప్పండి" శిరీష్ కాగితం కలం తీసుకున్నాడు."

డాక్టర్ జాబితా చదవసాగాడు.

5

"మీ తమ్ముడి హత్య విషయంలో మీరు ఏమైనా చెప్పగలరా?" అడిగాడు డిటెక్టివ్ శిరీష్.

రాజారావు విచారంగా చూశాడు. అతడి కళ్ళలో నీటి పొర కదిలింది. నిముషంపాటు మాట్లాడలేకపోయాడు.

"సారీ.... మరిచిపోయిన విషయాన్ని మరల కెలుకుతున్నాను."

"ఆల్ రైట్."

"మీ తమ్ముడు యెవరికీ అపకారం చేసేవాడు కాదు. ఆస్తిలో ఏ మాత్రం పాడుచేసినట్టు కూడా యెవరూ చెప్ప లేదు. చెడు అలవాట్లుకూడా లేవు."

"అవును తమ్ముడు ఆస్తిని వృద్ధిచేసేవాడే కాని పాడు చేసేవాడు కాదు."

"మీకు మీ తమ్ముడి వ్యాపారంలో ఆసక్తిలేదా!"

"లేదు. నాకు ఆస్తిని సంరంక్షించుకుంటే చాలు అని నమ్మకం."

"గోపాలరావుగారి అనంతరం ఆస్తి హక్కులు మీవే కదా!"

"అవును. ఈ పాపిష్టి సొమ్ము నాదే! ఒకరిద్దరికి నా మీద అనుమానం కూడా వచ్చింది."

"సహజమే కదా! ఆస్తి తగాదాల్లో అన్నదమ్ములు

పరమ శత్రువులు!"

"..........."

"సి.బి.ఐ. దర్యాప్తుతో మీరు సంతృప్తిపడ్డారా?"

"వాళ్ళుమటుకు ఏం చేయగలరు? దక్షిణామూర్తి ఎవరో తెలియనిదే కేసు ముందుకి ఎలా వెళ్తుంది?"

డిటెక్టివ్ శిరీష్ లేచాడు.

రాజారావు లేచి కరచాలనం చేశాడు.

6

డిటెక్టివ్ శిరీష్ చకచక భవనంలోకి అడుగుపెట్టాడు.

బొంబాయిలో విశాలమైన ఆవరణలో కట్టబడిన హాఫ్ కిన్ ఇన్‌స్టిట్యూట్ అది! విజిటింగ్ కార్డ్ లోపలికి పంపి డాక్టర్ మెహతా గదిముందున్న వెయిటింగ్ హాలులో కూర్చున్నాడు. నిమిషం తర్వాత శిరీష్‌ను లోపలకు రమ్మని పిలుపు వచ్చింది. డిటెక్టివ్ శిరీష్ లోపలికి వెళ్ళాడు.

డా॥ మెహతా సీట్లోంచి లేచి కరచాలనంచేసి కుర్చీ చూపించాడు. థాంక్స్ చెప్పి డిటెక్టివ్ శిరీష్ కూర్చున్నాడు.

"మీ గురించి ఒకటి రెండు హత్యకేసులలో విన్నాను. మీరు వచ్చిన పనేమిటో చెప్పండి. మీకు సర్వీస్ చేయడానికి మా సంస్థ సిద్ధంగా వుంటుంది." అన్నాడు డా॥ మెహతా.

డిటెక్టివ్ శిరీష్ కృతజ్ఞతాపూర్వకంగా నవ్వి గోపాలరావు హత్య కేసు చెప్పాడు.

డా. మెహతా విచారంగా చూచి, "మనుషులు ఇంత దారుణానికి కూడా దిగజారతారన్నమాట! ఈ హత్య బాక్టీరియాలజిస్టు చేసయినా వుండాలి. హత్యలో సహకరించయినా వుండాలి" అన్నాడు.

"అవును. గోపాలరావు హత్య జరగడానికి ముందు

ప్లేగు క్రిములు ఎవరి కెవరికి ఇచ్చారో తెలుసుకోవాలి."

"ఇష్యూ రిజిష్టర్ తెప్పించుతాను" అంటూ డా. మెహతా ఇంటర్‌కమ్ నెంబర్ నొక్కాడు. అవతల రిసీవర్ ఎత్తారు.

"ప్లేగుక్రిములను ఇష్యూచేసే రిజిష్టర్ పంపించు" అన్నాడు డా. మెహతా, ఫోన్‌లో.

బాయ్ నిమిషంలో రిజిష్టర్ తీసుకువచ్చాడు. డా. మెహతా రిజిష్టర్ చూచి, "ఏప్రిల్ 12 న 5 పి.సి.ల క్రిములను ఇష్యూ చేశాం" అన్నాడు.

"అంటే గోపాలరావు హత్య చేయబడటానికి వారం రోజుల ముందు అన్నమాట."

"ఏప్రిల్ 19 న గోపాలరావుకి ఇంజెక్ట్ చేశారా?"

"అవును సార్. 20 న చనిపోయాడు."

కొంతసేపు నిశ్శబ్దం.

"ఎవరికి ఇష్యూ చేసారు?" అడిగాడు డిటెక్టివ్ శిరీష్.

"డా. సంతోష్‌చటర్జీ."

డిటెక్టివ్ శిరీష్ విస్తుపోయాడు.

"ఆయనే స్వయంగా తీసుకు వెళ్ళారా?"

"లేదు. ఎవరో ఆథరైజేషన్ యిచ్చారు."

"అతడు సంతకం పెట్టాడా."

"అవును. దక్షిణామూర్తి. 79సి, జతీన్‌దాస్‌రోడ్, కలకత్తా 29."

"ఆశ్చర్యంగా వుంది."

"ఏం?"

"దక్షిణామూర్తి అనే వ్యక్తి ఈ కేసులో ప్రముఖ పాత్ర వహిస్తున్నాడు."

"అవును."

"అయితే అతడు ఎవరో ఎక్కడ దొరుకుతాడో సి. బి. ఐ. వారికే అంతుపట్టలేదు."

"మై గుడ్ నెస్."

"దేనికోసమో రాసివుందా?"

"పరిశోధనలకోసం."

"డబ్బు మొత్తం చెల్లించారా?"

"ఆఁ? పూర్తిగా, పదివేలు చెల్లించి మరీ తీసుకు వెళ్ళాడు దక్షిణామూర్తి."

"ధరఖాస్తు చూడవచ్చునా?"

"ఓ యస్. యేర్పాటు చేస్తాను."

అయిదు నిముషాల్లో దరఖాస్తుల ఫైలు వచ్చింది.

తనకి పరిశోధనల కోసం ప్లేగు క్రిములు కావాలని తన తరపున దక్షిణామూర్తికి ఇష్యూచేయమని కోరుతూ డా॥ సంతోష్ చటర్జీ రాసిన దరఖాస్తు దొరికింది.

డా॥ సంతోష్ చటర్జీ లెటర్ హెడ్ మీద టైప్ చేయ బడివుంది.

కింద నల్లసిరాతో అతడి సంతకం వుంది.

"వింతగా వుంది మిస్టర్ శిరీష్! మీకు కేసు ఒప్పగించిన వ్యక్తే ప్లేగుక్రిముల కోసం పదివేలు ఖర్చుపెట్టాడు" అన్నాడు డా. మెహతా.

"అవును డాక్టర్! కేసు వింత మలుపులు తిరుగు తోంది."

"........____"

"బాక్టీరియాలజిష్టుల సంతకం నమూనాలు మీ ఇన్స్టి ట్యూట్ లో వుంటాయా?"

"ఉంటాయి" అంటూనే డా. మెహతా సంతకాల పుస్తకం తెప్పించాడు.



డిటెక్టిన్ శిరీష్ దరఖాస్తు మీదవున్న డా. సంతోష్ చటర్జీ సంతకాన్ని నమూనా సంతకంతో పోల్చిచూచాడు. డా. మెహతా భూతద్దం ఇచ్చాడు.

"ఈ సంతకాన్ని ఎవరో ఫోర్జరీచేశారు" అంటూ డిటెక్టివ్ శిరీష్ దక్షిణామూర్తి సంతకాన్ని పరిశీలనగా చూశాడు.

"చూసారా డాక్టర్‌గారూ! సంతోష్‌చటర్జీ సంతకంలో వున్న ఇంగ్లీషు అక్షరాలకీ, దక్షిణామూర్తి సంతకంలో వున్న కొన్ని అక్షరాలతో పోలిక వుంది."

డా. మెహతా పరిశీలనగా చూశాడు.

"అవును. ఎ. హెచ్. ఒకేరకంగా వున్నాయి."

డిటెక్టిశ్ శిరీష్ ఆలోచనలో పడ్డాడు.

"ఇష్యూ ఆఫీసర్‌ని చట్టానికి ఒప్పగించాలి. ఫోర్జరీ సంతకానికి మోసపోయాడు" అరిచాడు డా. మెహతా.

"డాక్టర్‌గారూ! నిజానికి ఈ సంతకాలు ఫోర్జరీ అను

కోవడానికి లేదు. అంత నైపుణ్యంగా చేశారు. ఆయనని పిలిపించండి చాలు! దక్షిణామూర్తిని వర్ణిస్తారు."

"ఆల్‌రైట్!"

నిమిషాల్లో బాక్టీరియా ఇష్యూ ఆఫీసర్ కుమార్ వచ్చాడు.

"ప్లేగుక్రిములను తీసుకువెళ్ళిన దక్షిణామూర్తిని వర్ణించ చలరా? ప్లీజ్....గుర్తు తెచ్చుకోనండి" అడిగాడు డిటెక్టివ్ శిరీష్.

కుమార్ ఆలోచనలో పడ్డాడు.

"యాభై ఏళ్ళు దాటుంటాయి. పొడువుగా చామన ఛాయలో వుంటాడు. చెంపలు నెరిశాయి. దుబ్బుమీసాలు. అన్నట్టు కుడిబుగ్గమీద కంటికి సమీపంలో చిన్న పులిపిరి కాయ. కొత్తగా అభ్యాసం చేస్తోన్నట్టు నడుస్తాడు" అన్నాడు కుమార్.

"తెలుగువాడేనా?"

"అవుననుకుంటాను."

డిటెక్టివ్ శిరీష్ నోట్ చేసుకున్నాడు.

"డా. మెహతా! ఈ దరఖాస్తునూ, నమూనా సంత కాన్ని ఫోటోస్టాట్ తీయిస్తే మీకు అభ్యంతరమా?"

"లేదు."

కుమార్ భయంగా చూశాడు.

"మీకూ, సంస్థకీ ఏ విధంగానూ అప్రతిష్ట రాదు. మానవసేవకోసం అంకితమైన మీ సంస్థని ఈ కేసులో కూడు మానవులకు అపకారం జరగకుండా చూడటం కోసమే దర్యాప్తు చేయవలసి వచ్చింది. అందుకే నేను చింతిస్తున్నాను. తప్పలేదు. అన్నట్టు ఏ మాత్రం ప్రమా ణంలో ఇంజెక్ట్‌చేస్తే మనిషి చనిపోతాడు? ఐ మీన్ ప్లేగు

క్రిములను."

"రెండు సి.సి. చాలు" అన్నాడు డా. మెహతా.

కృతజ్ఞతలు చెప్పి డిటెక్టివ్ శిరీష్ లేచాడు.

7

"నమస్తే .... లోపలికి రండి" ఆహ్వానించాడు దేశపాండే.

డిటెక్టివ్ శిరీష్ ప్రతినమస్కారం చేసి లోపలకి నడిచాడు. గదిలో సోఫా, ఒకప్రక్కగా కుర్చీలు, మధ్యలో టీపాయ్. గోడలకి చిత్రపటాలు తగిలించివున్నాయి. మొత్తానికి నీట్‌గా అమర్చబడివుంది డ్రాయింగ్ రూం. దానికి ఎడంప్రక్కగా బెడ్‌రూం, గాజుఅద్దాలతో అమర్చబడిన మరో గదీ వున్నాయి.

"ఇది నా లేబొరేటరీ" అన్నాడు డా. దేశపాండే.

డిటెక్టివ్ శిరీష్ తలాడించాడు.

"రండి. లాబ్‌లో కూర్చోండి. మాట్లాడుకుందాం!" అంటూ దేశపాండే గాజుతలుపు తెరిచి లోపలికి వెళ్ళాడు. డిటెక్టివ్ శిరీష్ అతడిని అనుసరించాడు. రెండు పెద్ద టేబుళ్ళు వున్నాయి లోపల. వాటిపైన కొయ్య రాక్‌లకు టెస్ట్‌ట్యూబ్స్ వరుసగా అమర్చబడవున్నాయి. ఒకప్రక్కగా ప్రయోగ పరికరాలు నీట్‌గా తళతళలాడుతున్నాయి. బల్లలకి ఇవతల రెండు కుర్చీలు. గోడకి వాష్ బేసినూ, దానికి కాస్తదూరంగా రెండు రిఫ్రిజిరేటర్లూ వున్నాయి.

డా. దేశపాండే తను ఒక కుర్చీలో కూర్చుంటూ శిరీష్‌కో కుర్చీ చూపించాడు.

"కాస్ట్లీ లాబ్" అన్నాడు శిరిష్ మెచ్చుకోలుగా.

"థాంక్యూ" అంటూ డా. దేశపాండే గర్వంగా, "బాయ్!" అంటూ పిల్చాడు లోపలికి చూచి.

బాయ్ పరుగెత్తుకు వచ్చాడు.

"రెండు కూల్ డ్రింక్స్ సర్వ్ చెయ్యి!" అన్నాడు డా. దేశపాండే.

బాయ్ చకచక ఫ్రిజ్‌ని సమీపించి తెరవబోయాడు.

"అదికాదు" అరిచాడు డా. దేశపాండే.

డిటెక్టివ్ శిరీష్ విస్తుబోయాడు. అంతగట్టిగా అరవ వలసిన పనిలేదు! బాయ్ గడగడలాడి రెండో ఫ్రిజ్ తెరచి కూల్ డ్రింకులు సర్వ్ చేసి వెళ్ళిపోయాడు.

"ఈ పనివాళ్ళకి అసలు బుద్ధివుండదు" అన్నాడు దేశపాండే.

'దేశపాండేకి విపరీతమైన కోపం వచ్చింది. తమా యించుకున్నాడు' అనుకున్నాడు డిటెక్టివ్ శిరీష్.

పైకి మాత్రం నవ్వుతూ, "కొన్నిచోట్ల వాళ్ళెంత అజ్ఞానులయితే వాళ్ళచేత పని చేయించుకునేవాళ్ళకంత లాభం!" అన్నాడు.

డా. దేశపాండే పట్టించుకోలేదు.

"ఆరునెలలక్రితం చనిపోయిన గోపాలరావుకి టిటానస్ ఇంజక్షన్ చేశారట. మీరు వైద్యం చేసినట్లు అతడి మేనత్త చెప్పింది. మీరు ఏమైనా చెప్పగలరా?" అడిగాడు డిటెక్టివ్ శిరీష్.

డా. దేశపాండే క్షణం ఆలోచించి, "అవును. నా దగ్గరకు రావడానికి ఏ మాత్రం ఆలస్యమయినా అతడి ప్రాణాలమీదికు వచ్చేది" అన్నాడు.

"టిటానస్ అని ఎలా గుర్తుపట్టారు?"

"అనుభవం మీద."

"అంటే?"

"రోగి శరీరంమీద కనబడిన చిహ్నాలనుబట్టి. అయినా

ఏడునెలలనాటి విషయం!"

"ప్లీజ్ .... గుర్తు తెచ్చుకోనండి. పాపం! అతడు హత్య చేయబడ్డాడు."

"ఇంజక్షన్ చేసినచోట మందు డ్రాప్ దొరికింది. మెడికల్ ఎనాలిసిస్‌లో దాన్ని గుర్తుపట్టాను."

"గోపాలరావు ప్లేగుక్రిములతో హత్య చేయబడటం మీద మీ అభిప్రాయం ఏమిటి?"

"దారుణం? హంతకుడికి బాక్టీరియా గురించి బాగా తెలుసుండాలి."

"క్రిములను సజీవంగా ఎంతకాలం వుంచవచ్చును?"

"తెలియదు. బాక్టీరియాలజీని స్పెషలైజేషన్‌గా తీసుకున్నవాళ్ళకి బాగా తెలుస్తుంది."

డిటెక్టివ్ శిరీష్ మరికొన్ని ప్రశ్నలడిగి బయటపడ్డాడు.

"నువ్వు ఎంతకాలం నుండి డాక్టర్‌గారింట్లో వుంటున్నావు?" అడిగాడు డిటెక్టివ్ శిరీష్.

"రెండు సంవత్సరాల నుండి" అన్నాడు బాయ్.

"రెండో ఫ్రిజ్‌లో ఏముంది?"

"ఏమోసార్! రెండువారాల క్రితం నుండి కాబోలు ఆయన రెండో ఫ్రిజ్ దగ్గరకు నన్నుగానీ అమ్మగారినిగానీ వెళ్ళనివ్వడం లేదు."

"మీ డాక్టర్‌గారి ఫోటో ఒకటి కావాలి. సంపాదించగలవా?" బాయ్ యింట్లోకి వెళ్ళి ఇంగ్లీషు పత్రిక తెచ్చి పెట్టాడు.

"దీంట్లో డాక్టర్‌గారి ఫోటో అచ్చయింది సార్!" అన్నాడు.

"వెరీగుడ్. డాక్టర్‌గారిని ఇన్‌స్పెక్టర్ కుమార్ ఏవో

ప్రశ్నలడగడానికి స్టేషన్‌కి పిలిపించారు. నేను వచ్చి వెళ్లిన సంగతి చెప్పక!”

“అలాగే సార్! గుడికి వెళ్ళిన అమ్మగారు వస్తారేమో సార్!”

“నువ్వు బయట నిలబడి చూడు. రోడ్డుమీద ఆమె కానీ, డాక్టర్‌గారు కానీ కనిపించగానే నాకు సిగ్నల్ యివ్వు.”

అంటూ చకచక లాబ్ తలుపు తెరచి లోపలికి వెళ్లాడు డిటెక్టివ్ శిరీష్.

బాయ్‌కి సంతోషంగా వుంది. తాను నిజజీవితంలో అపరాధ పరిశోధకుడిగా ప్రవర్తించలేక పోయినప్పటికీ తాత్కాలికంగానయినా పేరువున్న అపరాధపరిశోధకుడికి అసిస్టెంటుగా పని చేయగలుగుతున్నాడు.

డిటెక్టివ్ శిరీష్ చేతులకు గ్లోవ్స్ తొడుక్కున్నాడు. ఫ్రిజ్ తెరిచాడు. టాంగ్స్ చేత్తో పట్టుకుని లోపలికి చూశాడు. మంచుపలకల మధ్య ఏవేవో పరిశోధక ఫలితాలున్న శోధన నాళికలున్నాయి.

క్రింద అరలో ఒకమూలగా సీలువేసిన శోధననాళిక కనిపించింది. టాంగ్స్ సహాయంతో దాన్ని పైకితీశాడు. శోధన నాళికలో క్రిందభాగంలో పసుపుపచ్చటి ద్రవం వుంది. దానిమీద పేరు రాసివుంది.

డిటెక్టివ్ శిరీష్ సంతృప్తిగా తలాడించి దాన్ని భద్రంగా తన కోటుజేబులో వుంచుకుని ఫ్రిజ్ మూశాడు.

బాయ్‌కి ‘థాంక్స్’ చెప్పి డిటెక్టివ్ శిరీష్ రోడ్డెక్కాడు.

9

“యూ ఆర్ అండర్ అరెస్ట్!”

రాజారావు చివాలున వెనక్కి తిరిగాడు. ఇన్‌స్పెక్టర్

కుమార్ చేతిలో పిస్తోలు మెరిసింది. రాజారావు చేతు లెత్తాడు.

"దేనికి?" అడిగాడు రాజారావు.

"మీ తమ్ముడిని చంపించిన నేరానికి! సూక్ష్మజీవులను నకిలీ సంతకాలతో హాఫ్‌కిన్ ఇన్‌స్టిట్యూట్ నుంచి దొంగిలింపచేసిన నేరానికి!"

"అబద్ధం!"

"దక్షిణామూర్తి దొరికాడు."

"ఎక్కడ?"

ఇన్‌స్పెక్టర్ కుమార్ నవ్వి, "ఇదిగో.... ఇక్కడ" అంటూ ఫోటో చూపించాడు:

ఫోటో ఆర్ట్ పేపర్ మీదవున్న ఫోటోకి గుబురు మీసాలూ, జుత్తుకి తెల్లరంగూ, బుగ్గన చిన్న వులిపిరికాయా దిద్దబడివున్నాయి.

రాజారావు కుప్పలా కూలిపోయాడు.

* * *

"రాజారావును యెలా అనుమానించారు?" అడిగాడు సంతోష్‌చటర్జీ.

కాంతాన్ని, రాధనీ, తీసుకుని చటర్జీ వాల్తేరు వచ్చాడు. డిటెక్టివ్ శిరీష్ రమ్మని టెలిగ్రాం యిచ్చాడు.

"రాజారావుకి చాల దురలవాట్లున్నాయి. డబ్బును మంచినీళ్ళ ప్రాయంగా ఖర్చు పెడుతున్నట్టు అతడి కులాసా జీవితం చూశాక నాకు అర్థమయింది. కేసును మొదటినించీ ఒక్కసారి మననం చేసుకుంటే రాజారావు మీద అనుమానం తగలడంలో ఆశ్చర్యం వుండదు.

రాధ వాల్తేరు ప్లాటుఫారంమీద జరిగిన సంగతి చెబుతూ రాజారావు గోపాలరావు భుజాన్ని రబ్ చేసిన సంగతి చెప్పింది. ఇంజక్షన్ చేశాక అది శరీరంలో ఇంకడానికి కొందరికి రబ్ చేసే అలవాటు వుంటుంది. అంటే రాజారావు ఇంజక్షను మందు గోపాలరావు శరీరంలో బాగా ఇమడాలని ప్రయత్నించాడన్నమాట!

పైగా అంతకు క్రితమే అరునెలలనాడు టిటానస్ ఇంజక్షన్ చేసి గోపాలరావును చంపాలని చూశారు శత్రువులు. ఆ విషయం గుర్తుంచుకుంటే రాజారావు అప్పటికప్పుడు గోపాలరావును ప్రయాణం మానిపించి వైద్య చికిత్స చేయించేవాడు.

రాజారావే గోపాలరావు జీవితాన్ని భీమా చేయించినట్టు నాకు అనుమానం వచ్చింది. దర్యాప్తు చేశాను. నామినీ దక్షిణామూర్తే! పాలసీ తీసుకుని ఆరునెలలే అయింది. అంటే హత్యా పథకం అమలులోకి వచ్చి ఆరునెలలే అయిందన్నమాట! ఇన్సూరెన్సు కొక అయిదువేలూ, ప్లేగు క్రిములకోసం పదకొండువేలూ—మొత్తం పదహారువేలు ఖర్చుపెడితే గోపాలరావు శాశ్వతంగ రాజారావుకి తన యావదాస్తినీ ఒప్పగించి గాలిలో కలసిపోతాడు.

ఇదీ కుట్ర! ఈ కుట్రలో సహకరించడానికి డా. దేశపాండేను యెన్నుకున్నాడు. దేశపాండే హత్యా ప్రయత్నాలలో మాత్రమే దక్షిణామూర్తి అవతారం యెత్తేవాడు. అంటే దక్షిణామూర్తి చట్టానికి దొరకడు. అదే సమయంలో రాజారావుకు అభేద్యమయిన ఎలిబీ వుంటుంది.

అయితే దేశపాండే సంతోష్ చటర్జీ సంతకాన్ని ఫోర్జరీ చేయడంతో ముప్పు వచ్చింది. గోపాలరావుకి సంతోష్ చటర్జీ రాసే వుత్తరాలు పరిశీలించి పథకంలో అతడి పేరును కూడా వుపయోగించుకున్నారు. యెంతగా సంతకాలను ఫోర్జరీ చేసేవాడయినా కొన్ని అక్షరాల ఒరవడిలో తన స్వంత ఫక్కీ మానుకోలేడు. దక్షిణామూర్తి సంతకం సంతోష్ చటర్జీ సంతకంతో ఎ, హెచ్ అనే యింగ్లీషు అక్షరాలతో మాత్రం పోలిక చూపించింది.

దక్షిణామూర్తి పొడవుపాటి వ్యక్తి. చామనఛాయ. రాజారావును, అతడి జీవితాన్ని రహస్యంగా పరీక్షించాను. అతడి స్నేహితుల్లో దేశపాండే ఒక్కడే ఆ రెండు వర్ణనలకి సరిపోతాడు. అతడి ఫోటో సంపాదించి బాక్టీరియా ఇష్యూ ఆఫీసర్ కుమార్ వర్ణించిన వివరాలతో ఫోటో దిద్దాను. దేశపాండే దక్షిణామూర్తి అయాడు.

గోపాలరావుకి ఏడునెలల క్రితం టిటానస్ ఇంజక్షన్‌కి విరుగుడు ఇస్తోన్నట్టు నటించి, రక్తం తీసుకుని క్రిములతో పరీక్ష జరిపాడు. అప్పుడు టిటానస్ ఇంజక్షన్ చేయడం అంతా నాటకం! దేశపాండే డిస్టిల్ వాటర్ ఇంజెక్ట్ చేసి ఆ రకంగా తంతు జరిపించాడు. పైగా దేశపాండే గోపాలరావుకి ప్రాణదాత అన్న ముద్రకూడా వుంటుంది" అన్నాడు డిటెక్టివ్ శిరీష్.

"మై గుడ్‌నెస్!" తెల్లబోయాడు సంతోష్ చటర్జీ.

రాధ, కాంతంల కళ్ళలో నీళ్ళు తొణికిసలాడుతున్నాయి. □

వాడిని చంపుతున్నాం

యస్. కృష్ణవేణి

ఇన్‌స్పెక్టర్ జగన్మోహన్ టిఫిన్‌ప్లేటుని ముందుకి లాక్కున్నాడు.

ఫోన్ మ్రోగింది.

రాజేశ్వరి విసుగ్గా మొహం పెట్టింది.

భార్య ముఖాన్ని చూసి నవ్వి, "పోలీసాఫీసరు పెళ్ళానివై

అలా విసుక్కొంటే యెలా" అని తనే లేచి ఫోన్ అందుకొని "హల్లో" అన్నాడు.

"గుడ్ మార్నింగ్ సార్!...." సార్జెంటు రాజు అన్నాడు.

"వూ(!"

"టిఫిన్ అయిందా సార్?"

"ఏం....? చావు కబురు వుందా?" ఇన్‌స్పెక్టర్ అన్నాడు.

"............"

"మనమే యిలా సంశయపడితే యెలాగోయ్. మనకి డాక్టర్లకి యీ చావుకబుర్లకి లంకె వున్నది. బాధపడితే మూడువందల అరవై రోజులూ అన్నం నీళ్ళు ముట్టలేం. అర్జంటయితే వెంటనే బయలుదేరుతా. లేదా కాఫీ టిఫిన్ కానిచ్చి...."

"మన వూరి బయట టి. బి. బంగ్లాకి వెనకాల ఒక మనిషని పెట్రోలు పెట్టి కాల్చారు సార్. గుర్తు తెలియడం లేదు."

"సరే! నీవు ఫోటోగ్రాఫర్లతో, ఫింగర్ ప్రింటుస్ వాళ్ళతో వెళ్ళు. నే వెనుక వస్తా" అని ఫోన్ పెట్టేసి, గబగబా చపాతీని మింగసాగాడు.

2

అక్కడ జనం బాగా గుమిగూడి వున్నారు శవం నల్లటి మొద్దు మాదిరి వుంది. ఆకారం ఏమీ లేదు. బహుశా మనిషి కాస్త లావాటి వ్యక్తి అయివుంటాడు. ఇంకో అర్ధగంట వుండివుంటే బూడిద అయివుండేది. యే కారణం వలనో అవాంతరం సంభవించినది.

శవం తాలూకు గుర్తులు ఎంత గాలించినా ఏమీ దొరక

లేదు.

ఫొటోగ్రాఫరులు అన్ని కోణాలలోనూ ఫొటోలు తీసారు. ఫింగర్ ప్రింట్సువాళ్ళు పెట్రోలు డబ్బాలని స్వాధీనం చేసుకున్నారు.

శవం అంబులెన్సులో తరలించబడింది.

జనం పలచబడ్డారు.

ఇన్‌స్పెక్టర్ జగన్మోహను, సార్జంటు రాజు టి.బి.లో కూర్చున్నారు. ఇద్దరు ముగ్గురు ఆ వూరి పెద్దలు కూడా వున్నారు. టి. బి. మూడు గ్రామాలకి కూడలి. ముగ్గురు కానిస్టేబుల్స్‌ని ఆచూకి తెలియని వ్యక్తి ఎవరైనా వున్నారా అని ఎంక్వయిరీ చేయమని పంపించారు.

వాచ్‌మన్ ఓబులయ్య చేతులు కట్టుకొని నిలబడి వున్నాడు.

"అయితే నీకు యేం తెలియదంటావు" మళ్ళీ ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టరు.

"నిజంగానండయ్యా! నాకు యేం తెలియదు."

"నీకు కవురు కంపు రాలేదా? నీవు వుండే ప్రక్కనే కదయ్యా కాల్చింది" కోపంగా అడిగాడు రాజు.

వాడు గజగజా వణికాడు.

"చెప్పు" గర్జించాడు.

వాడు అమాంతం ఇన్‌స్పెక్టరుగారి కాళ్ళమీద పడి—"బాబూ! నేను దిక్కూ మొక్కూ లేనివాడిని. రోజూ పది గంటలవరకూ వుండి తరువాత రెండు గ్లాసుల సారా తాగి పడుకొంటానండి. మరి నాకింకేవీ తెలియదు. తెల్లవారే మెలకువ వచ్చేది" అన్నాడు ఏడుస్తూ.

ఇన్‌స్పెక్టర్ నిట్టూర్చి వూరుకొన్నాడు.

వెళ్ళిన కానిస్టేబుల్స్ తిరిగి రాలేదు.

ఇన్‌స్పెక్టర్ రాజకీయ కక్షలు యేమైనా వున్నవా అని ఆ వూరి పెద్దల్ని అడుగుతున్నాడు.

సార్జంటు రాజు మళ్ళీ ఒకసారి పరీక్షిద్దామని శవదహన ప్రదేశానికి వెళ్ళాడు.

రెండు ఫర్లాంగుల దూరంలో ఓ చిన్న పాక వున్నది. రాజు అక్కడికి వెళ్ళాడు. అది జనుము దాచివుంచిన పాక. అందులో చాల జనుము లేదు. అంటే హంతకులు జనుము తెచ్చివేసి వుంటారు దహనకాండ జరిపేటప్పుడు.

రాజు పాక చుట్టూ ఒక రౌండు కొట్టాడు. దక్షిణంవేపు చాల గడ్డి నలిగి వున్నది. అక్కడ హతుడికి హంతకులకి పోరాటం జరిగివుంటుందన్న మాట.

ఆ చుట్టుప్రక్కలే తచ్చాడసాగాడు.

బూటుకాలు క్రింద గట్టి వస్తువు తగిలింది. కాలు ఎత్తి చూసాడు. పెద్ద తాళపుచెవి. అది యింటితాళం కాదు. ఒక కొట్టు తాళం.

రాజు హుషారుగా యీల వేసుకొంటూ పరుగున బంగళాకి వచ్చిపడ్డాడు.

3

ఇద్దరూ వూళ్ళోకి బయలుదేరారు.

"శ్రీనివాసా మెడికల్ స్టోర్" అని పేరు వున్న షాపు మూసి వున్నది.

యీ తాళపు చెవితో తెరిస్తే అది తెరుచుకొంది.

అంటే హతుడు ఎవరో తెలిసినట్లే కదా!

ప్రక్కషాపు వ్యక్తిని పిలిచారు.

అతను ఆశ్చర్యపోతూ వచ్చాడు.

"మీ పేరేమిటి?" ఇన్‌స్పెక్టర్ ప్రశ్నించాడు.

"రాజారావు."

"ఈ శ్రీనివాసా మెడికల్‌స్టోర్స్ ప్రొప్రయిటర్ గూర్చి చెప్పగలరా!"

"దీని యజమాని పేరు శివరావు. రాజపాలెం ప్రక్క పల్లె అతని వూరు. భార్య వున్నది. పిల్లలు లేరు...." అన్నాడు.

"వయస్సు ఎంత వుంటుంది?"

"సుమారు ఏభై సంవత్సరాలు వుండవచ్చు."

"ఇతనికి అసిస్టెంట్సు ఎవరూ లేరా?"

"ఈ వూరతనే గోపాల్ అనే కుర్రాడు వుండేవాడు. ఏ కారణంతోనో రెండు నెలలనుండి అతను మానివేసాడు" రాజారావు చెప్పాడు.

"ఘర్షణ ఏమైనా పడ్డారా?"

"అటువంటిదేమీలేదు. ఎందుకంటే నిన్న సాయం కాలం కూడా గోపాల్ తన తమ్ముడితోనూ ఫ్రెండ్సు తోనూ వచ్చి రాత్రి పది గంటలవరకూ వున్నాడు" అని చెప్పాడు.

షాపుకి అవతల యింకో రూము వున్నది. దానిని రాజు పరీక్షిస్తున్నవాడు చటుక్కున బయటికొచ్చి—"సార్! రాత్రి యిక్కడ మందుపార్టీ జరిగింది. కోడి ఎముకలు, బ్రాందీ బాటిల్సు, సిగరెట్ల పీకలు అవీ పడి వున్నాయి" అన్నాడు.

"ఎన్ని గ్లాసులు వున్నాయి?"

"ఐదు."

"రాజారావుగారు నిన్న శివరావుని కలుసుకోవడానికి వచ్చింది నలుగురా?"

"అవును."

"వారి వయస్సులు?"



"నలుగురికీ 23 సం॥ దాటలేదు."

"శివరావు క్యారెక్టర్ యెటువంటిది?" ఇన్‌స్పెక్టర్ ప్రశ్నించాడు.

అతను కొంచెం సందేహంగా నిలబడ్డాడు.

"హతుడు చనిపోయాడు. హంతకులని పట్టుకోవాలంటే ప్రతి చిన్న విషయంలోనూ మాకు పబ్లిక్కు సహకరించాలి" ఇన్‌స్పెక్టర్ అన్నాడు.

"అతను యిరుగు పొరుగు వద్ద పెద్దపెద్ద తరహాగానే

వ్యవహరించేవాడు. సహృదయుడుగానే మెలగేవాడు. అయితే అతనికి స్త్రీవాంఛ అధికం అని వినికిడి''నాన్చుతూ అన్నాడు.

"దృష్టాంతరం చెప్పగలరా....?" అని రాజు ప్రశ్నించాడు.

"మా షాపులన్నీ ఓ ముప్పై సంవత్సరాల విధవరాలు తుడుస్తూ వుంటుంది. శివరావుగారు దాన్ని చెయ్యి పట్టుకొన్నారని అది పని మానివేసింది. అదీగాక...." అని చెప్పకూడదనుకొన్నాడేమో ఆపు చేసి—"అందరూ అలానే అనుకుంటారు" అని పూర్తి చేసాడు.

"తాగుడు అలవాటు వుందా?"

"రెగ్యులర్‌గా లేదు. అప్పుడప్పుడు సర్దాగా ఫ్రెండ్సుతో కలిపి తీసుకుంటూ వుంటాడు" రాజరావు అన్నాడు.

"ఆయన క్లోజ్ ఫ్రెండ్సు ఎవరు?"

"రెగ్యులర్‌గా వచ్చే కస్టమర్స్! సార్ మేము బిజినెస్ చేసుకునేవాళ్ళం. ఎదుటివాళ్ళ గుణాలని రంధ్రాన్వేషణ చేసుకుంటూ కూర్చుంటే మా వ్యాపారమెలా సాగుతుంది?" అని అక్కడితో ముగించాడు.

అతని వద్ద శివరావు భార్య అడ్రస్సు, శివరావు అసిస్టెంటు అడ్రస్సు తీసుకొని అతనిని వదిలారు.

4

ఇద్దరూ రాజపాలెం వచ్చారు.

తేలిగ్గానే యిల్లు కనుక్కొన్నారు.

చిన్న డాబా యిల్లు.

శివరావు భార్య నలుగురి ఆడవారి మధ్య కూర్చొని వుంది. ఏడ్చి ఏడ్చి ఆవిడ కళ్ళు ఎర్రబారి వున్నాయి.

ఇన్‌స్పెక్టర్లని చూడగానే బావురు మంది.

ఇద్దరూ రెండు క్షణాలు మౌనంగా వున్నారు.

ఆవిడకి వయస్సు సుమారు ముప్పై సంవత్సరాలు వుండవచ్చు. యాభై సంవత్సరాలు శివరావు కంటే యీవిడ రెండోభార్య అయి వుండవచ్చు అని ఇన్‌స్పెక్టర్ వూహించాడు.

మనిషి అందంగానే వున్నది. తన వయస్సుని తగ్గించుకోవాలనే తాపత్రయం వున్నట్లు అలంకరణద్వారా తెలుస్తోంది. చావుకబురు తెలియక ముందే అలంకరించుకొని వుందేమో అది యింకా చెక్కుచెదరలేదు.

"మీరు కొంచెం స్థిమితపడి మాకు సహకరిస్తే మీ వారిని చంపినవారిని వురికంబం ఎక్కించగలం" అలవాటైన డైలాగునే అన్నాడు రాజు.

"మీ పేరు?"

"రాజామణి."

"మీకు వివాహం అయి ఎన్నాళ్ళయింది?"

"పది సంవత్సరాలు."

రాజు కనుబొమలు ఎగురవేసాడు.

"మీ వాళ్ళకి యీ దుర్వార్తని ఎరుక పరిచారా?" ఇన్‌స్పెక్టర్ ప్రశ్నించాడు.

"నాకు గానీ ఆయనకి గానీ ఎవ్వరూ లేరు" ఏడుస్తూ అన్నది.

కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా వుండి—"మీవారికి యెవరైనా శత్రువులున్నారా?" అని ప్రశ్నించాడు.

"నాకు తెలియదు."

"డబ్బు సంబంధమైన లావాదేవీలుగానీ ఘర్షణగానీ ఏమైనా వున్నాయా?"

ఆమె ఏమో చెప్పబోయి, తిరిగి వూరుకొంది. "ఇంట్లో వుండేదాన్ని నాకు తెలియదు" అని అంది.

అక్కడ్నించి గోపాల్ యింటి కొచ్చారు.

ముందుగదిలో నలుగురు కుర్రాళ్ళు సిగరెట్లు తాగుతూ పేకాట ఆడుతూ ఆఠిన్‌రాణీ, కట్ అంటూ బూతులతో అరుస్తూ వున్నారు.

ఇనస్పెక్టర్లిద్దరినీ చూడగానే బెదిరారు. తమాయించు కొన్నారు.

ఇనస్పెక్టర్ శివరావు హత్య గూర్చి చెప్పగానే— "ఆయనని ఎవరైనా హత్యచేసి వుండవచ్చు, అది సరే మీరెందుకు మా యింటికొచ్చారు?" అని పొగరుగా సమాధానం యిచ్చాడు గోపాల్.

రాజు ఫెడీల్‌మని మొహంమీద ఒక దెబ్బవేశాడు.

"ఎవర్రా నీవు నన్ను కొట్టడానికి" అని అతను రాజు మీద కలబడ్డాడు.

ఇంకో సమయంలో అయితే అతని దురుసు ప్రవర్తనకి చెమడాలు వూడలాగేవాడే ఇనస్పెక్టరు. గానీ శాంతం వహించి ఇద్దరినీ విడదీశాడు.

పోలీసులంటే నిరాపరాధులు కూడా భయపడతారు. ఇతని ఆవేశం చూసి ఆశ్చర్యపోయాడు ఇనస్పెక్టర్. కానీ అంతకన్నా ఆశ్చర్యం యీ గలభాకి బయటకి వచ్చిన గోపాల్ తల్లిని చూడగానే కలిగింది.

నలభై సంవత్సరాలు పైనే వుంటుంది. తెల్ల చీరా జాకెట్టు. మొహంబట్టి విధవ స్త్రీలా వుందిగానీ వయ్యారాలు పిటపిటలు చూస్తే పెద్ద చెయ్యి అని గ్రహించాడు.

ఇనస్పెక్టర్ అడిగిన ప్రతి ప్రశ్నకి వాళ్ళు చాలా మొండిగానే సమాధానం యిచ్చారు.

"నిన్న మీరు నలుగురు శివరావుగారి షాపుకి వెళ్ళ లేదా?" మళ్ళీ ప్రశ్నించాడు.

"శివరావుగారుతో మాకు స్నేహం వుంది కాబట్టి సాయంకాలం షికారుగా వారి షాపుకెళ్ళాం. ఆయన మా అందరికీ మందు పార్టీ యిచ్చారు. తరువాత వచ్చేశాం," అన్నాడు.

"మీరెందుకు అతని వద్ద పని మానివేసింది."

"జీతం పెంచమన్నాను. పెంచనన్నారు" తల ఎగురు వేస్తూ అన్నాడు.

మళ్ళీ అవసరంవస్తే కలుసుకొంటామని ఇద్దరూ బయటకొచ్చేశారు.

ఇంటి కాంపౌండు దాటిన తరువాత రాజు వెనక్కి చూశాడు. వాళ్ళు నలుగురు తల్లితో కలిసి హేళనగా నవ్వుకోవడం చూశాడు.

"బాస్టర్డ్స తప్పించుకొన్నామని అనుకుంటున్నారు,

సార్! ఖచ్చితంగా వీళ్ళేచేసివుంటారు. దానికి కారణం తల్లి అయివుంటుంది" రాజు అన్నాడు.

ఇనస్పెక్టర్ మౌనంగా తలూపాడు.

5

ఆ రాత్రి ఇద్దరూ రాజామణి యింటివెనకాల మాటు వేశారు.

పన్నెండు గంటల ప్రాంతంలో ఓ ఆకారం వచ్చి తలుపు తట్టింది.

వచ్చింది గోపాలు.

ఇద్దరూ గదిలోకి వెళ్లారు తలుపులు వేసుకొని. పెరటి వేపు కిటికీ తలుపులు తీసివుండటంవలన యిద్దరి మాటలు వినిపించసాగాయి.

"నా మొగుడిని చంపి నన్ను బెదిరించడానికి వచ్చావా? ఈ రోజుకి వూరుకున్నాను. రేపు ఇనస్పెక్టర్‌కి నేనంతా చెప్తా" ఏడుస్తూ అంటున్నది.

"నీ భాగోతం ఎవడికి తెలియదు. ఆడు నీ మొగుడు కాదన్న సంగతి వూరందరికీ తెలుసు" హేళనగా అన్నాడు.

"కట్టుకున్నవాడిని వదిలి వచ్చాననుకో! మీ అమ్మలా పదిమందిని మార్చలేదు" రోషంగా అన్నది.

"నోర్ముయ్! మా సంగతి ఎందుకు?"

"దానినుంచే కదా, శివరావుని నీవు చంపింది. నన్ను బెదిరించడానికి వచ్చింది."

"ఇదిగో! మరి నా మాట వింటావా? జరిగినదేదో జరిగింది. చచ్చినవాడు తిరిగిరాడు. పోలీసులతో నీవు పడలేవు. నీకా దిక్కులేదు ..."

"అందుకని నన్ను నోరుమూసుకోమంటావా? నేను వాళ్ళతో చెప్తా."

"చెప్పావా శివరావు గతే పడుతుంది నీకూ. మర్యాదగా వున్నావా నిన్ను నేను వుంచుకుంటా" అన్నాడు.

"ఏవిటి నన్ను నీవు వుంచుకుంటావా?"

"ఛీ....తూ" అని తుపుక్కున వుమ్మేసింది.

"ఏవిటే పెద్ద నీలుగుతున్నావ్" అంటూ ఆవిడ గొంతు పట్టుకొన్నాడు.

చాటునవున్న ఇనస్పెక్టరు జగన్మోహన్ సార్జంటు రాజు పరిస్థితి విషమించగానే కిటికీమీద జూదారు.

వీధి రోడ్డుమీద గలభా వినిపించింది. ఇనస్పెక్టర్ వీధివేపు పరిగెట్టాడు.

"నన్ను చంపేస్తున్నారు రక్షించండోయ్" అంటూ అటువేపుగా ఒక కుర్రాడు పరిగెత్తుకొని వచ్చాడు.

"రా....జూ...." అని ఇనస్పెక్టర్ అరచి వీధులోకి పరిగెట్టాడు పిస్తోలు తీసుకొని.

నిన్నటి నలుగురిలో నందకుమార్ అనే అతను పరుగున వచ్చి ఇనస్పెక్టర్ కాళ్ళమీద పడ్డాడు.

ఇనస్పెక్టర్—"అక్కడే ఆగండి. అడుగు ముందుకు వేశారా ప్రాణాలు వుండవు" అని హెచ్చరికగా అరచి గాల్లో పిస్తోలుని పేల్చాడు, నందకుమార్‌కు అభయమిస్తూ.

అంతలో కత్తి ఒకటి రివ్వున వచ్చింది.

ఇనస్పెక్టర్ జగన్మోహన్ చటుక్కున వంగడంవలన నెత్తిమీద వెంట్రుక వాసిలో దూసుకుపోయింది.

మళ్ళీ యింకో కత్తి వచ్చింది. అదీ పాదాలవద్ద వచ్చి పడింది. చీకటి. ఎదుట పార్టీ చీకట్లో వున్నారు. తామేమో లైటు వెలుగులో వున్నారు. అయినా ధైర్యంచేసి కత్తి వచ్చిన వేపుగా పేల్చాడు. ఎవరో అరుస్తూ క్రిందపడ్డారు.

ఇంతలోకి రాజు రక్తం కార్చుకుంటూ బూటుకాలతో

గోపాల్‌ని తంతూ, తీసుకొచ్చాడక్కడకి.

"సారీ! సార్! యీ బాస్టర్డు రాజామణి పీకని నులి మేశాడు" అన్నాడు తిరిగి తంతూ.

"మన ప్రయత్నం సగం విఫలం అయిందన్నమాట" అని నిట్టూర్చి, నందకుమార్‌ని గోపాల్‌ని పోలీస్టేషన్‌కి పంపి, రాజామణి శవానికి కాపలా ఏర్పాటుచేసి, తరువాత పని చకచకా చేయించాడు.

6

ఈ కేసులో నందకుమార్ అప్రూవర్‌గా మారాడు.

గోపాల్ తల్లి సరోజినీకి బాగా డబ్బువుంది. వ్యభిచారాన్ని హాబీగా పెట్టుకొంది. అలా పరిచయం అయ్యాడు ఆమెకు శివరావు. అతనితో వుండగానే లక్షరూపాయలు కట్నం యిచ్చి కూతురు పెండ్లిచేసింది. ఆ పెండ్లి సందర్భంగానే శివరావువద్ద ఎంతో గుంజినా అప్పు రూపేణా 20 వేలు తీసుకున్నది.

శివరావు యిబ్బందులలోపడి సరోజినీని డబ్బు యివ్వమని వేధించసాగాడు.

సరోజినీ యిద్దరి కొడుకులకి చదువు అబ్బలేదు. ఆ వూరికి రౌడీలు. తల్లి నడత విషయంగా వారికేమీ అభ్యంతరంలేదు.

శివరావు వేధించడం కొడుకులతో చెప్పింది. వాళ్ళు బెదిరించి చూశారు. శివరావు లొంగలేదు. ఈ కారణంగానే గోపాల్ అతనివద్ద పని మానింది.

సరోజినీ అల్లుడు ప్రకాశరావు కూడా సరిగ్గా కొడుకుల గుణాలకి సరైనవాడే. అతను అత్తగారి యింటికి వస్తూ నందకుమార్ అనే స్నేహితుడిని వెంటబెట్టుకొని

వచ్చాడు. ఈ సమయంలోనే గోపాలు, కోటేశ్వరరావు, బావమరిదితో యీ విషయాన్ని ప్రస్తావించి, అతనిని చంప డానికి ప్లాను వేశారు.

ఇది నందకుమార్‌కి తెలియదు. వీళ్ళతోబాటు శివరావు షాపుకి వెళ్ళాడు, తాగాడు. తరువాత అందరూ కలసి రెండో ఆట సినిమాకి వెళ్ళారు.

ఇంటర్‌వెల్‌కి ముందుగానే శివరావుతో బాటు బయట కొచ్చేశాడు. ఎందుకు అని నందకుమార్ అడిగితే అతని స్నేహితుడు ప్రకాశరావు 'పనుంది రా' అని మాత్రం రహస్యంగా అన్నాడు.

అందరూ కలసి ట్రావెలర్సు బంగళా రహదారి వద్ద కొచ్చారు. ప్రకాశరావు నందకుర్‌తో "ఒరేయ్ నీ విక్కడే నిలబడి యెవరైనా వస్తున్నారేమో చూడు. వస్తూవుంటే మాకు సైగచెయ్యి" అన్నాడు. ఇతనికి అర్థంగాక "అసలు కథ ఏమిటిరా" అని అడిగాడు.

"వాడిని చంపుతున్నాం" అని ప్రకాశరావు అన్నాడు.

ఇంతలోకి గోపాలు జేబులోనుండి నైలాన్ వైయిర్ తీసి శివరావు పీకకివేసి లాగాడు. శివరావుని కోటేశ్వర రావు ప్రకాశరావు గట్టిగా పట్టుకొన్నారు. నందకుమార్ "వద్దురా చంపకండిరా! పాపం రా!" అని అరచినా వాళ్ళు వినిపించుకోలేదు.

శివరావు కూడా—"నన్ను చంపకండిరా! నాకు డబ్బు యివ్వక్కర్లేదు. నేను ఎవ్వరితోనూ చెప్పను" అని ఏడుస్తూ బ్రతిమాలుతూ పెనుగులాడినా లాభం లేక పోయింది.

తరువాత పెట్రోలుపోసి తగలబెట్టారు.

రెండో ఆట వదలి మనుష్యులు వస్తున్న అలికిడి కాగానే అలానే వదలి పారిపోయి వచ్చేశారు.

ఈ విషయం బయటికి వచ్చిందా నీకూ అదేగతి అని నందకుమార్‌ని బెదిరించారు. అతనికి భయంపట్టుకొంది. అతను అర్ధరాత్రి పారిపోవడానికి ప్రయత్నిస్తే, కత్తులతో వెంటపడ్డారు. సమయానికి దేవుళ్ళా వచ్చి ఇనస్పెక్టర్ రక్షించినట్లు అప్రూవర్‌గా చెప్పాడు నందకుమార్.

వాళ్ళ ముగ్గురిమీద రెండు హత్యలు చేసినట్లుగానూ, పోలీసాఫీసరుని అవమానపరచింది ఒక కేసు, గాయ పరచింది యింకో కేసూ, బెదిరించినది యింకో కేసూ అన్నీచేరి ఆరు కేసులతో ఇనస్పెక్టర్ యఫ్. ఐ. ఆర్. ప్రజంటు చేశాడు.

రాజు మాత్రం గోపాలుని బాగా తన్ని తన కసిని తీర్చుకున్నాడు. □

మేలైన మందు ?

"ఏమిటీ గాయాలు? ఎక్కడైనా పడ్డారా?"

"అబ్బె లేదండి. గాయాలకు బాగా పనిచేస్తుందని మా బాబాయి మందు తెచ్చారు. మా ఇంటిలో ఎవరికి గాయాలు లేవు. ఆ మందు బాగా పనిచేస్తుందో, లేదో తెలుసుకోవటానికి కత్తితో ఇలా గాయపరిచాడండి!"

—కె. నాగభూషణం, బత్తలపల్లి.

మగసరి భార్యలు

అంధవరపు మల్లిబాబు

పాఠకుల పరిశోధన పోటీ-93

(బహుమతి రు.50/-లునగదు)

ట్రింగ్-ట్రింగ్-ట్రింగ్।

"హల్లో లాయర్ పరాంకుశం హియర్. హూ యీజ్

స్పీకింగ్?" అన్నాడు పరాంకుశం రిసీవరెత్తి హుందాగా.

"నేనే నిరంజనరావుని మాట్లాడుతున్నా. మీరు వెంటనే ఓసారి రాగలరా మిస్టర్ పరాంకుశం" అని అవతలివేపు నుండి వినిపించింది.

"సమస్తే సర్. వాట్ యీజ్ ద మేటర్?"

"వీలునామా విషయం. ఫోన్‌లో మాట్లాడ్డానికి వీలు పడదు. అర్జంటుగా రండి."

"ఆల్‌రైట్! పది నిమిషాల్లో అక్కడుంటాను" అని చెప్పి ఫోన్ డిస్కనెక్టు చేసాడు.

లాయర్ పరాంకుశం, నిరంజనరావ్ ఫేమిలీ లాయర్. నిరంజన్‌రావ్ యింట్లోని ప్రతి విషయమూ పరంకుశానికి తెలుస్తుంది. ఆ మాటకొస్తే పరాంకుశంతో చెప్పనిదే ఏ చిన్నపనీ చేయడు నిరంజనరావ్.

నిరంజనరావ్‌కి పదిలక్షల ఆస్తితో పాటు నాలుగు పదుల వయసు వుంటుంది. కాని యేభై ఏళ్ళ మనిషిలా కనిపిస్తాడు.

పిల్లలు లేకపోతే మొదటి భార్య విమల అనుమతిమీద 'ఉమ' ను పెళ్ళి చేసుకున్నాడు. అయితే 'ఉమ' వల్ల కూడా పిల్లలు కలగకపోవడంతో 'మృణాళిని' ని పెళ్లి చేసుకుని యింటికి తీసుకువచ్చేడు.

మృణాళిని కూడా తల్లి కాలేకపోయింది. అతనిలోనే యేదో లోపముందని భార్యల అనుమానం. అందుకు ఆధారం వాళ్ళల్లో ఏ లోపమూ లేదని ఫామిలీ డాక్టర్ తేల్చి చెప్పడమే.

పిల్లలమీద ఆశతో మరింకెంతమందిని పెళ్ళి చేసుకుంటాడో అన్న భయం కొద్దీ ఆస్తిని ఇప్పుడే పంచి యివ్వమని రోజూ నిరంజనరావ్‌ని వేధిస్తున్నారు.

ముగ్గుర్ని కట్టుకున్నా పిల్లలు కలగకపోవడంతో నిరంజనరావ్ మానసికంగా బాగా కృంగిపోయేడు. శారీరకంగా అతని ఆరోగ్యం క్షీణించింది. భార్యలు అతన్ని పట్టించుకోనక పనివాళ్ళకే అతని బాధ్యతను విడిచిపెట్టి, సిన్మాలు, షికార్లు, చేయడం అతనికి మరింత బాధాకరంగా పరిణమించి, ఎన్నోసార్లు ఆస్తిని అనాథ శరణాలయాలకు రాసి పారేయాలని ఆవేశం వచ్చినా, లాయర్ పరాంకుశం అతన్ని చల్లబర్చాడు.

సరిగ్గా పదినిషాల తర్వాత నిరంజనరావ్ ఇంటి ముందాగిన కారులోనుంచి దిగాడు లాయర్ పరాంకుశం.

ఇల్లంతా నిశబ్దంగా వుంది. నౌకర్లుకూడా కనిపించ లేదు. లోపలెక్కడో వున్నట్టుంది! పరాంకుశంకి ఇల్లంతా పరిచయమే. అందుకనే చకచక అడుగులేసుకుంటూ మెట్లు మీదుగా పైకి వెళ్ళాడు.

కారిడార్‌మీదుగా నడిచివెళ్ళి నిరంజనరావ్ గదిముందాగేడు.

తలుపులు దగ్గరగా వేసివున్నాయి. లోపల లైటు వెల్గుతోంది.

తలుపుమీద శబ్దంచేసి, మెల్లగా లోనికి నెట్టాడు. శబ్దం చేయకుండా వెనక్కి వెళ్ళాయి తలుపులు.

గదిలో దృశ్యాన్ని చూస్తూనే నిర్ఘాంతపోయేడు పరాంకుశం!

నేలమీద వెల్లకిలా పడివున్నాడు నిరంజనరావ్! కళ్ళు తెరుచుకుని వున్నాయ్. యెడంవేపు కణతలోంచి రక్తం కారుతుంది.

"మైగాడ్!" మనసులో గొణుకున్నాడు.

2

"శవం యెక్కడ?"

జీప్ దిగి, యింట్లో అడుగు పెడుతూనే ప్రశ్నించేడు డిటెక్టివ్ జలంధర్. అతని వెనుక నలుగురు కానిస్టేబుల్స్ పోలీస్ డాక్టర్, వేలిముద్రల నిపుణుడు, ఫోటోగ్రాఫర్ నిలబడి వున్నారు.

"రండి చూపిస్తా....' అంటూ మేడపైకి దారితీశాడు లాయర్ పరాంకుశం.

నిరంజనరావ్ చచ్చి పడివున్నాడని గ్రహించి, వెంటనే పోలీసులకు ఫోన్ చేసాడు పరాంకుశం. వంటమనిషి నాయర్ తప్ప యింట్లో మరెవరూ కనిపించలేదతనికి. యేమయ్యారో, ఎక్కడికెళ్ళారో తెలియలేదు.

ఇన్స్పెక్టర్ జలంధర్తోపాటు బృందమంతా మేడపైన నిరంజనరావు రూమ్లో అడుగుపెట్టారు.

వెల్లకిలా పడివున్నది శవం. కణతదగ్గర రక్తం. కుడి చేతికి కాస్తంత దూరంలో సైలెన్సర్ రివాల్వర్ పడి వుంది.

అది హతుని బెడ్రూమ్లా వుంది. ఖరీదైన ఫర్నిచర్తో అధునాతనంగా వుంది. గోడలకు దేశ నాయకుల ఫోటోలు తగిలించివున్నాయి. ఒకప్రక్కగా డబుల్కాట్ వుంది. దానిమీద యూ-ఫోమ్ బెడ్. ఆ గదిలోనే ఓ మూల గాద్రేజ్ బీరువా వుంది.

ముందుగా ఫొటోగ్రాఫర్కి సైగ జేశాడు యిన్స్పెక్టర్ జలంధర్. ఫోటోగ్రాఫర్ వెంటనే వివిధ కోణాల్నించి ఫోటోలు తీయసాగేడు.

"సెల్వరాజ్! వేలిముద్రలు దొరుకుతాయేమో ప్రయత్నించు" అని డాక్టర్వేపు తిరిగి "డాక్టర్! హతుడు ఎన్ని



గంటలకు మరణించాడో చూడండి." అంటూ చక చక ఆజ్ఞలు జారీచేసి పరిశోధన కుపక్రమించాడు.

నేలమీద పడివున్న రివాల్వర్ని కర్చీఫ్‌తో తీసి ఫింగర్ ప్రింటు ఎక్స్‌పర్టుకు యిచ్చి వేలిముద్రలను పరీక్ష చేయమన్నాడు యిన్‌స్పెక్టర్ జలంధర్.

అంతలో అతని దృష్టి టేబుల్‌మీద పడింది. పేపర్ వెయిటు కింద యేదో తెల్ల కాగితం వుంది. అక్షరాలు గజిబిజిగా, గాభరాతో రాసినట్టుగా వున్నాయి. దాన్ని చదివాడు జలంధర్. రెండే వాక్యాలు:

"నా చావుకి ఎవరూ బాధ్యులు కారు. పూర్తి స్వస్థత మీదే ఈ ఉత్తరం రాస్తున్నాను. మరింక పిల్లలు కలగరన్న బాధే దీనికి కారణం."

క్రింద నిరంజనరావ్ సంతకం వుంది.

"సాయంకాలం 4-5 గంటల మధ్య ప్రాణంపోయింది. కణతలో నుండి బులెట్ దూసుకుపోవడంవల్ల వెంటనే ప్రాణం పోయింది."

డాక్టర్ తన పరీక్ష పూర్తి చేసుకొచ్చి చెప్పాడు.

ఫింగర్ ప్రింటు ఎక్స్‌పర్టు అన్నాడు. "రివాల్వర్ మీద హతుడి వేలిముద్రలు వున్నాయ్!"

అంతా విని తల పంకించాడు జలంధర్.

"లాయర్! ఈ సైలెన్సర్ రివాల్వర్ యెవరిదో మీకు తెలుసా?" అడిగేడు.

"తెలుసు?" అన్నాడు. "అది నిరంజనరావు చేతిలో వుండడం ఎన్నోసార్లు చూసాను. కాని ఆ రివాల్వర్‌తోనే ఆత్మహత్య చేసుకుంటాడనుకోలేదు. ప్చ్! పిరికివాడు!" అన్నాడు పరాంకుశం.

"మిమ్మల్ని పిలిచిన కారణం తెలుసా?"

"వీలునామా విషయం అని మాత్రమే తెలుసు. కాని, అంతలోనే అతను ఆత్మహత్య చేసుకునే నిర్ణయం యెందుకు తీసుకున్నాడో అర్థంగావడంలేదు."

"హతుని మరణం వలన లాభించేదెవరికి? అయిమీన్ కుటుంబసభ్యులెవరైనా...."

"ముగ్గురు భార్యలు తప్ప కనీసం దగ్గర బంధువులు కూడా మరెవరూ లేరు."

"థ్యాంక్యూ ఫర్ యువర్ ఇన్‌ఫర్మేషన్. అతని భార్య లెక్కడున్నారు?"

"నాకు తెలీదు. ఇంట్లో మాత్రం లేదు. నాయర్‌ని అడిగితే తెలుస్తుంది."

"నాయర్ యెవరు?"

3

"నేనే సార్. ఈ యింట్లో వంటవాడ్ని. పిలిచారట," అన్నాడు నాయర్ ఇన్‌స్పెక్టర్ జలంధర్ ముందు చేతులు కట్టుకుని నిలబడి.

"నీ డ్యూటీ వివరం చెప్పు."

"ఉదయం ఆరు గంటలకు యింటినుంచి వస్తానూసర్. అందరికీ బెడ్‌కాఫీ అందించి, పెద్దమ్మగార్ని కలుసుకుని, పూటకు యేం వండాలో తెలుసుకుని, వంట పూర్తిచేసి ఇంటికెళ్ళిపోతాను. మళ్ళీ మూడు గంటలకు రావాలి. రాత్రి పదింటికి పోతాను...."

"మూడు గంటలనుంచీ యింట్లోనే వున్నావన్నమాట."

"లేదుసార్. ఈ రోజు అయ్యగారి పర్మిషన్ తీసుకుని మ్యాట్నీ షో సినిమా చూసుకుని వస్తున్నా."

"నువ్వు వచ్చేక యింట్లో యెవరేనా మనుషులు కని పించారా?"

"ఇల్లంతా నిశ్శబ్దంగా వుండడం చూసి, అందరూ బయటికి వెళ్ళిపోయేరేమో అనుకున్నాను. అయ్యగార్కి కాఫీ కలిపి యివ్వాలనేంతలో లాయర్‌గారు పైకి వెళ్ళడం చూసి ఆగాను."

జలంధర్ నాయర్ని యింకేదో అడగాలనుకుంటుండగా క్రింద హాల్లోంచి యెవరిదో స్త్రీ గొంతు అరుస్తూ వినిపించింది.

"నాయర్....నాయర్...."

"ఎవరామె?" జలంధర్ ప్రశ్నించాడు నాయర్‌ని.

4

"నా పేరు విమల. నిరంజనరావుగారి మొదటిభార్యను."

దుఃఖంతో పూడుకుపోయిందామె గొంతు. ఆ గదిలో అడుగుపెడుతూనే భర్త శవాన్ని, పోలీసుల్ని చూసి నిర్ఘాంతపోయింది విమల.

విమలకి ముప్పైఅయిదేళ్ళుంటాయి. యెత్తు, దానికి తగ్గ లావు. బిగిసడలని ఒళ్ళు. చూపరులను వెంటనే ఆక

రిష్తుంది.

తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని విని ఆశ్చర్య పోయింది.

"4-5 గంటలమధ్య మీరెక్కడున్నారు?" జలంధర్ అడిగేడు.

"మూడు గంటలకు అయిదు నిమిషాల ముందే షాపింగ్‌కి బయల్దేరేను. మళ్ళీ యిదే రావటం" చెప్పింది విమల.

"మీరు వెళ్ళేటప్పుడు యింట్లో యెవరైనా వున్నారా?"

"ఉమ, మృణాళిని వున్నారు."

"ఇది ఆత్మహత్యే నంటారా?" అనడిగేడు

"కాదనడానికి ఆధారాలు లేవు. ఉత్తరంలోని దస్తూరి ఆయనదే, రివాల్వర్ ఆయనిదే. ఇది ఆత్మహత్య అన డానికి ఇంతకన్న ఆధారాలేం కావాలి?" అంది.

"నిరంజనరావుగారు వీలనామా రాసారా?"

"నాకు తెలిసినంతవరకూ లేదు."

"ఆయనకు విరోధులెవరైనా వున్నారా?"

"ఉండొచ్చు. నాకు తెలియదు."

"ఆల్‌రైట్! మీరు వెళ్లి మీ గదిలో కూర్చోండి. అవ సరమైతే మిమ్మల్ని మళ్ళీ కలుస్తాను." అవి అంటుండగా పోలీస్ కానిస్టేబుల్ ఓ స్త్రీని వెంటబెట్టుకు వచ్చాడు.

గులాబిరంగు ఛాయ! చక్రాల్లాంటి కళ్ళు, ఘనమైన యెత్తు, మగాడిలోని మగతనాన్ని సవాలు చేసే బలిష్టమైన రొమ్ములు.

తెల్లటి నైలాన్ చీర, అదే రంగు జాకెట్టు.

జుట్టు పిరుదులు దాటింది. సగంవరకు అల్లి, ఆ తర్వాత వదులుగా వదిలేసింది. చేతులులేని జాకెట్టు ధరించి

నందపల్లి నున్నగా ఆమె జబ్బలు మధ్యోచ్చేలా అవుపిస్తు న్నాయి.

పెదవులకు యెర్రటి లిప్‌స్టిక్. వానిటీబాగ్ భుజానికి వేలాడుతోంది.

"నా పేరు ఉమ. నిరంజనరావుగారి రెండో భార్యను. మా యింట్లో యేం జరిగింది?"

చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

ఉమ ఘొల్లుమంది. రెండు చేతులతో మొహం కప్పు కొని వెక్కి వెక్కి యేడ్వసాగింది.

"మిసెస్ ఉమా! దుఃఖంలోవున్న మిమ్మల్ని విసిగిస్తు న్నందుకు క్షమించండి. మీరు సహకరించి, నా ప్రశ్నలకు జవాబులిస్తే, నా డ్యూటీ నేను నెరవేరుస్తాను" అన్నాడు ఇన్‌స్పెక్టర్ జలంధర్.

ఉమ కళ్లు తుడుచుకుని, కుర్చీలో సర్దుకుని కూర్చుంది.

"అడగండి," అంది గాద్గదిక స్వరంతో.

"ఇంతవరకూ మీరెక్కడున్నారు?"

"పేలస్‌లో 'టవరింగ్ యిన్‌ఫెర్నో' యింగ్లీషు సినిమా మ్యాట్నీ వేస్తే వెళ్లి. సినిమా విడిచిపెట్టేక, ఓ ఫ్రెండ్ బలవంతం మీద బీచ్‌లో కాస్సేపు గడిపి వచ్చేను."

"నిరంజనరావుగారికి శత్రువులెవరైనా వున్నారా?"

"ఆ విషయం నాకు తెలీదు."

ఆత్మహత్య ఉత్తరం ఆమెకు చూపించి "ఇందులోని దస్తూరి నిరంజనరావుగారిదేనా?" అనడిగాడు జలంధర్.

"ఆయన దస్తూరిలాగే వుంది ..."

"నిరంజనరావుగారి ఆత్మహత్యకు మరే కారణమన్నా వుంటుందని మీరు భావిస్తున్నారా?"

"కారణాలు వెదికే పరిస్థితిలో లేను నేనిప్పుడు. నిన్న

రాత్రి అంతా నాతో ఎంతో ఉత్సాహంగా గడిపిన మనిషి, ఈ రోజు ఆత్మహత్య చేసుకున్నారంటే నమ్మలేక పోతున్నాను."

"నిరంజనరావ్‌గారు విల్లు రాసిన విషయం మీకు తెలుసా?"

"విల్లు రాశారా! రాయలేదనే రాత్రి నాతో చెప్పారు."

"ఆల్ రైట్! మీరిక వెళ్ళవచ్చు."

అదే సమయంలో బయట టాక్సీ ఆగిన చప్పుడైంది. ఒక నిమిషం తర్వాత ఓ స్త్రీ లోనికొచ్చి పైన కనిపించిన పోలీస్ యిన్‌స్పెక్టర్ని చూసి షాక్ తింది. మెట్లుమీదుగా పైకి వచ్చింది.

ఆమెకి యిరవైలోపే వుంటుంది వయసు. కోల మొహం, తెల్లటి దేహచ్ఛాయ. చెవులకు జూకాలున్నాయి.

"మీరెవరు?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"నా పేరు మృణాళిని. నిరంజనరావ్‌గారి ఘూడవ భార్యను. మా యింట్లో దొంగలు పడ్డారా?" అడిగిందామె.

జరిగింది చెప్పాడు జలంధర్.

వింటూనే కుప్పకూలిపోయింది. వెంటనే స్పృహను కూడా కోల్పోయింది. జలంధర్ నీళ్ళు తెప్పించి ఆమె మొహంపైన జల్లేడు.

ఒక నిమిషం తర్వాత మెల్లగా కళ్ళు తెరిచి, వెక్కి-వెక్కి ఏడ్వసాగింది.

"ఉదయం ఖర్చులకోసం డబ్బు అడగడానికి వెళ్ళి నపుడు నిక్షేపంలా వున్నారు. మనసులో విచారం, బాధ వున్న మనిషిలా అవుపించలేదు. ఇంతలోనే ఎందుకలా ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారో అర్థం గావడంలేదు. ఒక వేళ ఇది ఆత్మహత్య కాదేమో!" అంది మృణాళిని

వెక్కిళ్ళమధ్య.

"మీరు ఎక్కడికి వెళ్ళేరిప్పుడు?"

"నేను మహిళామండలి ప్రెసిడెంట్‌ని. రేపు ఓ ప్రముఖ రచయిత్రిని మా మహిళామండలికి అహ్వానించి సన్మానించాలని నిశ్చయించుకున్నాం. ఆ ఏర్పాట్లు నిమిత్తం మధ్యాహ్నం మూడుగంటలకే విమలతోపాటు బయటికి వెళ్ళాను."

"నిరంజన్‌రావ్‌గార్కి పడని మనుషులెవరైనా వున్నారా?"

"ఆయన మంచిమనిషి. అటువంటి మనిషికి పడని వాళ్ళుంటారనుకోను."

"నిరంజనరావుగారు విల్లు రాసారా?"

"వ్రాయలేదు" అంది దృఢంగా.

తర్వాత శవాన్ని అంబులెన్స్‌లో పంపించే ఏర్పాటు చేసి, లాయర్ని కలుసుకున్నాడు.

"లాయర్! మీ అభిప్రాయం ఏమిటి?" అడిగేడు ఇన్‌స్పెక్టర్ జలంధర్.

"నేననుకున్నట్లు ఇది ఆత్మహత్య కాదు. ఖచ్చితంగా హత్యే! ఎవరో పకడ్బందీగా హత్యచేసి, తెలివిగా ఆత్మ హత్యలా మార్చారు?" అన్నాడు లాయర్ పరాంకుశం.

ఇన్‌స్పెక్టర్ జలంధర్ నవ్వాడు, "ఆ విషయం నేను మొదటే గ్రహించాను. ఎడంవేపు కణతలోంచి రక్తం కారింది. కాని రివాల్వర్ కుడిచేతివేపు పడివుంది. ఎవరో హత్యచేసి తెలివిగా ఆత్మహత్య ఉత్తరం సృష్టించారు. ఇది హత్యే!"

"ఎవరు చేసారో తెలుసుకున్నారా?"

"చట్టం చేతులు చాలా పొడుగైనవి. నేరస్తులు

ఎక్కడ దాగినా తన పొడవాటి చేతులతో అందుకుంటుంది. నిరంజనరావ్‌ని హత్య చేసిందెవరో నాకు తెలిసిపోయింది. నేనిప్పుడా 'వ్యక్తి'ని అరెస్ట్ చేయబోతున్నాను" అన్నాడు ఇన్‌స్పెక్టర్ జలంధర్.

"ఎవరు?" అడిగాడు లాయర్ పరాంకుశం.

"హతుడు, వీలునామా వ్రాయబోతున్నాడని తెలుసుకున్న ఆ వ్యక్తి, ఆ ప్రయత్నం జరగకుండా అతన్ని చంపినట్టు తెలుస్తోంది. హతుడి మరణం వల్ల లాభం పొందే వాళ్లు అతని ముగ్గురు భార్యలే. అలాగే వీలునామాలో ఆస్తి వారికి వ్రాయకపోతే నష్టపోయేదీ వాళ్ళే. కాబట్టి ఈ ముగ్గురుభార్యల్లోనే ఒకరు హత్య చేసారన్నది ఖాయం ...."

[ఇదీ కథ. దీనిలో హంతకురాలెవరో వివరంగా ఒక పోస్టు కార్డుసైజు తెల్లకాగితంపై వ్రాసి, 7-2-'80 తేదీలోగా మాకు చేరేటట్లు పంపండి. హో. డె. సభ్యులు కానివారు తమ సమాధానంతో 50 పైసలు పోస్టు స్టాంపులు జతపరచాలి. అత్యుత్తమ పరిశోధకులు ఇరువురికి చెరొక రు. 25 లు॥ చొప్పున బహుమతి పంపుతాము. ఫలితాలు ఏప్రెల్' 80 నెల సంచికలో చూడండి.

—ఎడిటర్]

"A"

తండ్రి:— ఈ మొదటి ప్రశ్న వ్రాయలేదేమిరా?

కొడుకు:— అక్కడ 'A' అని వ్రాసి ఉంది. నీవు 'A' అని వ్రాసిఉన్నవి చూడకూడదన్నావుగా. అందుకే ఆ ప్రశ్న చదవలేదు.

—పి. బి. మనోహర్, తిరుచ్చి.

ఒకటి కాదు రెండు కాదు—అయిదువేల రూపాయలు.

అది నాకు చాలా పెద్ద ఆదాయం. అనుకోకుండా వచ్చింది.

మా ముత్తాతగారెవ్వరో చచ్చిపోతూ వేసిన ఆస్తి

వాటాలో నాకు వచ్చిన వంతు అది. అయాచితంగా వచ్చిన ఆ డబ్బును ముందు పెట్టుకుని నేనూ, నా భార్యా ఆశల హర్మ్యాలు నిర్మించడం మొదలుపెట్టాం.

"ఈ డబ్బుతో ఏమీ కొనద్దండీ—బ్యాంకులో వేశామంటే ముప్పై ఏళ్ళలో ఇది ఒక లక్ష అవుతుందిట" అంది శ్రీమతి. అలా అన్నప్పుడు ఆమె కళ్ళలో లక్ష రూపాయల మెరుపు మెరిసింది.

"ముప్పై ఏళ్ళా! ఇంకా ఏనాటిమాట—అప్పటికి మనం బ్రతికుండాలి గదా-అంతకంటే ఫిక్సెడ్ డిపాజిట్లో వేస్తే ఏటా అయిదొందలొస్తుంది. అంటే నెలకు నలభై రూపాయలుపైన. ఆ మాత్రం అదనపు ఆదాయం చాలు మనకు—...." అన్నాను.

లక్ష రూపాయల్నించి నలభై రూపాయలకు ఆడజస్టు కావడానికి శ్రీమతికి కాసేపు పట్టింది. ఏటా శ్రీమతికి ఓ బంగారు నగ చేయిస్తానని చెప్పాను. బంగారం ధర నానాటికీ పెరిగి పోతోంది. ఏటా ఇలా బంగారం కొంటూంటే ముప్పై ఏళ్ళలో మూడు లక్షలు విలువచేసే బంగారం వస్తుందని శ్రీమతికి లెక్క చెప్పాను.

మూడు లక్షలనగానే శ్రీమతి కళ్ళు మళ్ళీ మెరిశాయి- "అలాగే చేద్దామండీ!" అంది.

"అయితే రేపే బ్యాంకులో వేసేస్తాను. ఇంట్లో క్యాషుంచుకోడం మంచిది కాదు...." అన్నాను.

నే నీమాటలు అనగానే శ్రీమతి కళ్ళలో మెరుపు మాయమైంది. ఆ స్థానే భయం ప్రవేశించింది. మా ఎదురుగా వున్న ఆ యాభై రూపాయల నోట్ల కట్టను గట్టిగా పట్టుకుని, హృదయానికి హత్తుకుని—"ఈ రాత్రి మనం

చాలా జాగ్రత్తగా వుండాలి....” అంది.

తర్వాత ఇద్దరం కలిసి ఆ డబ్బును పాత గుడ్డల మూటలో పెట్టి—మంచం ఎక్కాం.

ఇద్దరికీ ఓ పట్టాన నిద్రపట్టలేదు. నేను లేచి కూర్చుని-“ఏదో మోటర్ సైకిల్ చప్పుడవుతోంది. ఇంటి చుట్టూ ఎవరైనా తిరుగుతున్నారేమో చూసివస్తాను....” అన్నాను.

“వద్దండీ—తలుపులు తీస్తే దొంగాడిపని మరింత సులభమౌతుంది—” అంది శ్రీమతి.

దొంగాళ్ళు మా యింటిచుట్టూ తిరుగుతున్నట్లు మే మిద్దరం అప్పుడే నిర్ణయానికి వచ్చేశాము. ఆ భయమే మాకు నిద్రపట్టనివ్వడంలేదు. భయంతో, బెంగతో ఆ రాత్రి సమయం గడుపుతూండగా నాకో చిన్న అనుమానం వచ్చింది—“పాపా! అయిదువేల రూపాయలకే మనమింత బెంగపడిపోతున్నాం. ఇంట్లో మూడు లక్షల బంగారముంటే ఇంకెలా వుంటాం?” అన్నాను.

“అప్పటికి అలవాటై పోతుందండీ-” అంది శ్రీమతి సింపుల్‌గా.

“ఈ రోజునుంచే అలవాటు చేసుకుందాం-”అన్నాను. ఆ మాటలు శ్రీమతిపైనా, నాపైన కూడా ప్రభావం చూపించాయి. ఆ తర్వాత కొద్ది క్షణాల్లోనే ఇద్దరికీ నిద్ర పట్టింది. అవును మరి ఒకటి కాదు, రెండు కాదు.... మూడు లక్షల బంగారాన్ని స్వంతం చేసుకోబోయే మేము ముష్టి అయిదు వేలు రూపాయల గురించి బెంగపెట్టుకుంటే ఎలా?

మర్నాడు లేవగానే ముందు పాత గుడ్డల మూట చూశాం. అందులో డబ్బు భద్రంగానే వుంది.

శ్రీమతి మాత్రం లెంపలువేసుకుని "మహాలక్ష్మిని పాతగుడ్డల మూటలోవుంచి మహాపచారం చేశాను. ఈ తప్పు ఒక్కటీ కాయి భగవంతుడా—" అంటూ డబ్బు బయటకు తీసి తన బట్టల పెట్టెలోకి మార్చింది.

"అదృష్టం బాగుంది. ఏ ఎలక కొట్టేయలేదు" అన్నాను.

ఇద్దరికీ కూడా చాలా ధైర్యం వచ్చింది. మా ఇంట్లో డబ్బు గురించి ఇంకా ఏ దొంగలకీ తెలీలేదు. అందుకే బ్యాంకు ఫిక్సెడ్ డిపాజిట్ వేయడం గురించి మరొక్క రోజు వాయిదా వేశాను. ఆఫీసులో కొందరు మిత్రుల్నడిగి సలహా తీసుకోవడం మంచిదనిపించింది.

"ఇంట్లో డబ్బున్న మాట మాత్రం చెప్పకండి. ఏదో లోపాయికారీగా అడిగినట్లు అడగండి—" అంది శ్రీమతి కంగారునూ, హెచ్చరికనూ మిళితంచేస్తూ.

"ఆ విషయం నువ్వు నాకు చెప్పాలా?" అన్నాను నవ్వి.

2

నాకేదో డబ్బు వచ్చే అవకాశమున్నదనీ దాన్ని ఖర్చు చేయకుండా ఉపయోగించే విధానం చెప్పమనీ మూర్తిని అడిగాను అఫీసులో.

"నీలాంటి స్నేహితుడు నాకు దొరకడు. మరొకడు లేడు. ఆ డబ్బు నాకు అప్పుగా యిచ్చావంటే నా చెల్లెలు ఓ ఇంటిదై జన్మజన్మలకూ నీ పేరు చెప్పుకుంటుంది" అన్నాడు మూర్తి.

నేను భవిష్యత్తును గురించి రకరకాల కలలు కంటు న్నాను. వాటిలో యెన్నో కోరికలున్నాయి. మూర్తి చెల్లెలు జన్మ జన్మలకూ నా పేరు చెప్పుకోవాలన్న కోరిక నాకు లేదు. యెలాగో మూర్తి బెడద వదిలించుకొని గోపాలాన్ని అడిగాను. ఊళ్ళో ఓ సైటు కొనుక్కోమన్నాడు. అది నాకు

నచ్చలేదు.

ఆఫీసులో పనిచేసే శారదాదేవిని సలహా అడిగితే మీ ఆవిడకో వడ్డాణం చేయించండి అంది.

నా కంటే మంచి అయిడియా యింకెవ్వరూ ఇవ్వడం లేదని గ్రహించేక అనవసరంగా ఒకరోజు వృధాచేసా నని పించింది. ఈరోజే బ్యాంకులో వేసేయాల్సింది. ఇంట్లో ఆ డబ్బుతో శ్రీమతి ఎలా వుందో ఏమో?

ఈలోగా అనుకోకుండా వెంకట్రామయ్యగారి దగ్గర్నుంచి నాకు అద్భుతమైన సలహా వచ్చింది.

నిజానికి నేను వెంకట్రామయ్యగారిని సలహా అడగ లేదు. ఆ నోటా ఈ నోటా విని ఆయనే నా దగ్గరకు వెతుక్కుంటూ వచ్చి—"డబ్బేం చేయాలీ అని ఆలోచిస్తున్నావట—పాపారావు సంగతి తెలియదా మీకు?" అన్నాడు.

"పాపారావా? వాడెవడు?" అన్నాను ఆశ్చర్యంగా.

"పాపారావంటే బ్యాంకులకంటే నమ్మకమైన మనిషి. బ్యాంకు కంటే చాలా హెచ్చు వడ్డీ ఇస్తాడు. కావాలనుకుంటే అత న్నిప్పుడే యిక్కడికి రప్పిస్తాను..." అన్నాడు.

అసలు సంగతేమిటో తెలుసుకోవచ్చునని నేను పాపారావుని రప్పించమని చెప్పాను. అయితే ముందుజాగ్రత్త కోసం "నా దగ్గర ఇంకా డబ్బులేదు. ఈవేళా రేపట్లో రావచ్చును. పాపారావుకు డబ్బిస్తానని నమ్మకమూ లేదు. ఊరికే మాటలాడి నచ్చితాబైతే అతని కిస్తాము" అన్నాను.

"అలాగే—ఇందులో ఎవరి బలవంతమూలేదు—" అన్నాడు వెంకట్రామయ్య.

ఆఫీసునుంచి వెంకట్రామయ్య ఏదో నంబరుకి ఫోన్

చేసాడు. ఆ తర్వాత అర్ధగంటలో పాపారావు ఆఫీసులో వాలాడు.

పాపారావు నల్లగా సన్నగా పొడుగ్గా వున్నాడు. మనిషి కళ్ళు చురుగ్గా వున్నాయి. ముఖం యెప్పుడూ నవ్వుతూనే ఉంటుంది. అతను చనువుగా నన్ను పలకరించి - "నా స్కీములో లాభం పొందబోతున్నందుకు మిమ్మల్నభినందిస్తున్నాను...." అన్నాడు.

నేను ముఖం చిట్లించి "ఇంకా నేను నిర్ణయము తీసుకోలేదు. ముందు మీ స్కీము గురించి వివరించండి. విన్నాక నా నిర్ణయం చెబుతాను" అన్నాను.

"నా స్కీము గురించి విని అందులో చేరని వాళ్ళు లేరు—డబ్బు లేనివాళ్లు తప్ప!" అన్నాడు పాపారావు.

పాపారావు స్కీముగురించి వివరించాడు.

చాలా ఆకర్షణీయంగా వుందా స్కీము.

పాపారావుకి అయిదువేలు ఇస్తే ఆ డబ్బుకు రసీదు ఇస్తాడు. డబ్బు అందుకోగానే వందరూపాయలిస్తాడు. అక్కణ్నించి నెలనెలా వంద రూపాయలిస్తాడు. డబ్బుని అతనివద్ద కనీసం అయిదు సంవత్సరాలుంచాలి. ఆ మేరకు హామీ పత్రం ఇవ్వాలి. అయిదు సంవత్సరాలైపోయాక నా అయిదువేలూ నేను తీసుకోవచ్చు. కావాలంటే మరో అయిదు సంవత్సరాలుంచవచ్చు. అది నా ఇష్టం.

అంటే అయిదు సంవత్సరాలలో నా డబ్బు పదకొండు వేలు అవుతుంది. నెలనెలా పాపారావిచ్చే వందరూపాయలూ నేను ఏ రికరింగ్ డిపాజిట్లోనే వేశానంటే అదింకా ఇంకా లాభం.

ఏ విషయమూ మర్నాడు చెబుతానని పాపారావుకి చెప్పాను.



"రేపు డబ్బు తీసుకుని మా యింటికి వచ్చేయండి-" అన్నాడు పాపారావు.

3

నేను ఆ రాత్రి శ్రీమతితో చర్చించాను. ప్రతినెలా వందరూపాయల అదనపుటాదాయం శ్రీమతికి చాలా వుత్సాహాన్ని కలిగించింది. ఆ రోజే స్కీములో జేరవలసిందని బాధపడింది.

"అది సరే - ఇది పూర్తిగా ప్రయివేటు వ్యవహారం— ఎలా నమ్మేది?" అన్నాను.

"ఆ స్కీములో మీ రొక్కరే జేరుతున్నారా ఏమిటి? యెరిగున్న వాళ్లెవ్వరూ లేరా" అంది శ్రీమతి.

అవును—నిజమే- ఈ స్కీము లో వున్నవాళ్ళలో నాకు తెలిసినవాళ్లెవరైనా వుంటే బాగుంటుంది. వాళ్ళను కనుక్కొని అప్పుడు డబ్బు ఇవ్వడం మంచిది. బ్యాంకులైతే ఆ విషయం వేరు. యెవర్నీ అడక్కుండా వెంటనే డబ్బు

కట్టేయొచ్చు నాలుగు డబ్బు లెక్కవిస్తున్నాడు గదా అని కక్కూర్తి పడితే ఒకోసారి అసలుకే మోసం రావచ్చును.

"రేపు ఆ విషయం కనుక్కుంటాలే...." అన్నాను శ్రీమతితో.

"బాగుందండీ—ఇలా ఎన్నాళ్ళని ఇంత డబ్బు ఇంట్లో దాచుకుంటాం. ఈ మాత్రం ఆలోచన మీకు ఆఫీసులోనే వచ్చివుంటే యెంత బాగుండేది?" అంది శ్రీమతి నిరుత్సాహంగా.

ఆ డబ్బు వెంటనే కట్టి పందరూపాయలూ తీసుకోవాలని శ్రీమతి ఆత్రుతగావుంది. ఆ మాటకొస్తే ఈ విషయంలో నాకూ ఆత్రుతగానే వుంది. కానీ కాస్త వెనకా ముందు చూడాలిగదా!

సరిగ్గా ఆ రోజు రాత్రి ఎనిమిదిగంటల ప్రాంతంలో మా ఇంటికి సర్వేశ్వరరావొచ్చాడు.

సర్వేశ్వరరావుకూ నాకు సినిమా హాలు దగ్గర పరిచయమైంది. అనుకోకుండా మా యిద్దరివీ ఒకే రకం భావాలని గ్రహించాము శ్రీమతులకు కూడా ఒకరంటే ఒకరికి ఇష్టమైంది. దాంతో క్రమంగా మా మధ్య స్నేహం బలపడింది. అప్పుడప్పుడు ఒకరింటికి ఒకరు వెడుతూండడం జరుగుతూంటుంది.

"రండి రండి - ఏమిటి చెప్పకుండా వచ్చేశారు?" అన్నాను.

ఆడవాళ్ళిద్దరూ లోపలకు వెళ్ళిపోయారు. వాళ్ళ టాపిక్కు వేరు.

"ఓ వారం రోజుల్నించి ప్రయత్నం మీ యింటికి రావాలని-ఏదో కారణంగా వాయిదా పడిపోతుంది-ఈ వేళ కూడా అనుకోలేదు. అనుకోకుండా పాపారావుని కలి

శాను...."

మధ్యలో నేనేదో అనబోతుండగా "పాపారావు దగ్గర అయిదువేలు డిపాజిట్ చేశాను ఏణ్ణర్థం క్రితం" అన్నాడు సర్వేశ్వరావు.

నాకు సర్వేశ్వర్రావుతో పరిచయమై పదినెలలు దాటింది. కానీ ఈ పదినెలల్లోనే అతను నాకు ఆత్మీయుడై పోయాడు. ఇలాంటి ఆత్మీయుడు పాపారావు దగ్గర స్కీములో జేరాడంటే నాకు అంతకంటె కావలసినదేముంది? ఆత్రుతగా నా క్కలిగిన సందేహాలన్నీ అతనికి చెప్పేశాను.

"నాకు తెలుసు. పాపారావు మీ గురించి చెప్పాడు. రేపు యే సంగతీ చెబుతామన్నారుటగా? ఈ లోగా నాకు తెలిసిన విశేషాలు చెప్పడం మంచిదని ఇప్పటికిప్పుడు బయల్దేరివచ్చాను" అన్నాడు సర్వేశ్వరరావు.

వెంటనే నేను శ్రీమతిని కూడా పిలిచాను.

సర్వేశ్వరరావు, పాపారావు స్కీముగురించి చాలా పొగిడేశాడు.

"అసలతగాడు అంతవడ్డీ ఎలా ఇవ్వగల్గుతున్నాడు?" అన్నాన్నేను ఆశ్చర్యంగా.

"అతను వడ్డీవ్యాపారం చేస్తున్నాడు. చిన్నకారు మనుషులకి అప్పులిస్తూంటాడతను. తీసుకునే వడ్డీ చాలా ఎక్కువ. పదిరూపాయలకు ఒక రూపాయ నెలకివ్వాలి. అంటే చూసుకో వడ్డీ నూటయిరవై శాతమన్నమాట. ఇది కాక అతను కొన్ని కంపెనీల్లో డబ్బు ఇన్వెస్ట్ చేస్తూంటాడు. అక్కణ్ణించి వడ్డీ చాలా వస్తుంది. డబ్బు నెలా వినియోగించాలో పాపారావుకి తెలిసినట్లుగా మరెవ్వరికీ తెలియదు. అందుకే అతనికి డబ్బు అవసరం. కాబట్టే ఈ స్కీము ప్రారంభించాడు. అయిదువేలతో మనకు నెలకు

వంద ఇస్తున్నాడు కానీ అతను రెండొందలకు పైగా సంపాదించగలడు" అన్నాడు సర్వేశ్వర్రావు.

శ్రీమతి కూడా సర్వేశ్వర్రావుని కొన్ని సందేహాలడిగింది. అన్నింటికీ సర్వేశ్వర్రావు ఓపికగా జవాబులిచ్చాడు. అతని ఓపిక చూస్తూంటే నాకే ఆశ్చర్యం కలిగింది—"మీరు పాపారావు దగ్గర యేజన్సీ తీసుకుంటే బాగుంటుంది. బాగా ప్రచారం చేస్తున్నారు" అన్నాను.

సర్వేశ్వర్రావు ముఖం చిన్నబోయింది—"మీరు నా స్నేహితుడు కాబట్టి యేమైనా అనుమానాలుంటే నివృత్తి చేయడం కోసమని పని గట్టుకుని వచ్చాను. ఇందులో ప్రచారమేమీలేదు. మీరు కూడా పాపారావు స్కీములో చేరండి. అప్పుడు మీరూ తప్పక అతనికి ప్రచారకులౌతారు. ఆ స్కీములోని ఆకర్షణ అటువంటిది" అన్నాడు.

"యేదో జోక్ చేశాను. మీరు సీరియస్‌గా తీసుకుంటారనుకోలేదు" అన్నాను నేను.

"నోనో—ఊరికే వివరించాను. నేనేమీ ఫీలవలేదు" అన్నాడు సర్వేశ్వర్రావు.

వాళ్లు వెళ్ళిపోయాక శ్రీమతి నన్ను దెబ్బలాడింది. ఇలాంటి విషయాల్లో నేను శ్రీమతితో వాదించను. అనుకోకుండా జరిగిన పొరపాటు అది అని ఆమెకు చెప్పాను.

4

మర్నాడు నేను డబ్బుతో పాపారావు ఇంటికి వెళ్లాను. పాపారావు నన్నభినందించాడు.

నా దగ్గర డబ్బు అందుకున్నాక ఓ తెల్ల కాగితంపైన నేను డబ్బు ఇచ్చినట్లుగా రాసి సంతకంపెట్టి ఇచ్చాడు. ఓ వందరూపాయలనోటు కూడా అందిస్తూ—"నాకు తేదీల పట్టింపు చాలా ఎక్కువ. ప్రతి నెలా ఇదే తేదీన సరిగ్గా

వచ్చి మీ వందరూపాయలూ పట్టుకుపోతూండండి"
అన్నాడు.

అక్కణ్నించి వచ్చేసేముందు ఆ డబ్బును అయిదు సంవత్సరాలపాటు తన దగ్గరే వుంచుతానన్న హామీ పత్రంపై నాచేత సంతకం చేయించుకున్నాడు పాపారావు.

ఇంటికి వెళ్ళి వందరూపాయలనోటు శ్రీమతికిచ్చాను. డబ్బు వేయగానే వడ్డీ ఇవ్వడం అపూర్వమని శ్రీమతి మెచ్చుకుంది. ఇలాంటి లాభాలు ఎప్పుడోగాని రావు. అనుకోకుండా అయిదువేలు రావడమూ, ఆ డబ్బు ఇలా సద్వినియోగం కావడమూ—మా జాతకంలో మార్పును సూచిస్తున్నాయని ఇద్దరమూ కూడా అభిప్రాయపడ్డాము.

అయితే ఆ వందరూపాయలూ మేము వేరే వృధాఖర్చు చేయలేదు. పోస్టాఫీసులో మా ఇరువురి పేరునా ఓ జాయింట్ అకౌంట్ ఓపెన్‌చేసి అందులో వేశాం. కొంత డబ్బయ్యాక శ్రీమతి ఓ బంగారు గొలుసు చేయించుకుందామని అనుకుంది.

వరుసగా నాలుగు నెలలు నాకు వడ్డీ సక్రమంగా అందింది. శ్రీమతి డబ్బువచ్చినప్పుడల్లా చాలా థ్రిల్ అయిపోతూ—"అసలు మనం కూడా ఇలాంటి స్కీము ఒకటి స్వంతంగా ప్రారంభిస్తే ఎలాగుంటుందండీ?" అనేది.

"వ్యాపారమన్నది అందరికీ సాధ్యపడదు. నేను వ్యాపారానికి పనికిరాను. మన తరపున మనం బాగా ప్రచారం చేసుకోగలగాలి. అది నాకు చేతకాదు. అందుకే ఈ స్వల్ప లాభంతో తృప్తిపడుతున్నాను. వ్యాపారం తెలివితేటలున్న పాపారావు ఈ డబ్బుతోనే రెండొందలు సంపాదించి అందులో ఓ వంద మనకు పారేస్తున్నాడు-" అన్నాను నేను.

అయిదో నెల డబ్బు అన్న తేదీకి అందలేదు. అయి దారుసార్లు నేను పాపారావు చుట్టూ తిరగాల్సి వచ్చింది. సుమారు మూడువారాలు ఆలశ్యంగా వందా నాకు అందింది.

"యేమీ అనుకోకండి—ఈ నెలలో అనుకోని డబ్బు ఇబ్బంది వచ్చింది" అన్నాడు పాపారావు.

వందరూపాయలూ చేతికి అందగానే నా భయం,బెదురు, అనుమానం అన్నీ తొలగిపోయాయి. దానికేముందిలెండి అని చెప్పి వచ్చేశాను. యేమీ శ్రమలేకుండా నాకు వంద రూపాయలొస్తున్నాయి. పాపారావుకైతే అలా కాదుగదా డబ్బు సంపాదించడానికి అతను నానా తిప్పలూ పడాలి.

అలా అని వూరుకున్నా ఆరో నెల నాకు పాపారావే దొరకలేదు. దొరికి డబ్బు అడిగితే ఈ నెలకు లేదన్నాడు.

"అంటే మొత్తం రెండువందలూ వచ్చేనెల్లో ఇస్తారా?" అన్నాను.

"అదేం లేదు. ఈ నెలకు మీకు డబ్బు రాదు—" అన్నాడు పాపారావు.

"ఎందుచేత?" అన్నాను నేను.

"యే ముహూర్తాన మీ దగ్గర డబ్బు తీసుకున్నానో కానీ నాకు నష్టాలారంభమయ్యాయి" అన్నాడు పాపారావు చిరాగ్గా.

"స్కీము ప్రారంభించాక నష్టమంటే ఎలా? అన్నీ మీరే భరించి అన్నమాట ప్రకారం నెలనెలా వడ్డీ ఇవ్వాలి" అన్నాను కొంత తీవ్రంగానే.

"లాభం రాందే ఎక్కణ్ణించి తెస్తానండీ—నేనేం నోట్లు అచ్చేయడం లేదుగదా—" అన్నాడు పాపారావు.

"అలాంటప్పుడు స్కీము ఎందుకు ప్రారంభించారు?" నా సహనం నశిస్తోంది.



"ప్రారంభిస్తే యేమయింది? అ యిదు నెలల్లో అ యిదు వందలు కళ్లజూశారుగదా—" అన్నాడు పాపారావు.

"అందుకే గదా మీకు డబ్బిచ్చింది!" అన్నాన్నేను ఆవేశంగా.

"అనవసరంగా ఆవేశపడకండి - వచ్చే నెలలో మన దృష్టం బాగుండాలని దేవుణ్ని ప్రార్థిద్దాం-" అన్నాడు పాపారావు.

"అదృష్టం బాగుండకపోతే వచ్చే నెలలో కూడా డబ్బివ్వరా?"

"వచ్చే నెలేమిటండీ-అదృష్టం బాగుండేవరకూ ఏ నెల్లోనూ-డబ్బివ్వను" అన్నాడు పాపారావు. ఈ కంఠం లోని ధ్వని వేరుగా వుంది.

నాకు భయం వేసింది. యేదో మోసంలో ఇరుక్కోలేదుగదా అనిపించింది పాపారావులో ఇదివరకటి వినయం కనబడలేదు.

"అయితే నా డబ్బు నేను వెనక్కి తీసుకుంటాను."

"అలాగే తీసుకుందురుగాని అయిదు సంవత్సరాల తర్వాత—" అన్నాడు పాపారావు తాపీగా.

"నా డబ్బు అయిదువేలు ఆయిదు సంవత్సరాలపాటు మీ దగ్గరుంచుకుని దానిమీద వచ్చే వడ్డీ అనుభవిస్తూ-నాకేమీ ఇవ్వనంటారా?" అన్నా న్నేను కోపంగా.

"అయిదు సంవత్సరాల తర్వాత మాత్రం యివ్వాలనే ముంది?" అన్నాడు పాపారావు.

కాసేపు పాపారావుతో మాట్లాడేసరికి నాకు చాలా భయంవేసింది. అతను నేననుకున్నట్లు సామాన్యుడు కాడు. కోర్టు వ్యవహారాల్లో ఆరితేరిన వాడు. నాలాంటి సామాన్యుడు అతనికెదురునిలిచి కోర్టుకు వెడితే ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడాలి. గొడవలేకుండా ఈ వ్యవహారం పరిష్కరించుకొనడం మంచిది.

"నాకిలాంటి లావాదేవీ లుంటాయని తెలియదు. మిమ్మల్ని నమ్మాను. నన్ను మోసం చేయకండి-" అన్నాను. నా కంఠం దీనంగా వినిపించింది.

పాపారావు నన్నోదర్చి-"నేను మోసగాడ్ని కాదు. మీరనవసరంగా ఆవేశపడుతున్నారు. వ్యాపారంలో నష్ట పోవడం నాకూ ఇష్టముండదు. లాభాలు వచ్చినప్పుడల్లా సగం వాటా అడక్కుండానే నే మీకు ఇస్తూంటాను. రానప్పుడు నేనేం చేయగలను?" అన్నాడు.

"సరే-నా దురదృష్టం ఇలా వుంది. వెంకట్రామయ్య గారు, సర్వేశ్వర్రావు చెప్పగా మీరు నమ్మకస్థులేనను కున్నాను. మీ స్కీము గురించి నలుగురికీ చెబితే కనీసం" అని నేను యేదో అనబోతుండగా-

"అలా బెదిరించకండి-మీరు నాగురించి దుష్ప్రచారం

చేస్తే నాకు వచ్చే డబ్బు ఆగిపోతుంది. నేను ఐపీ పెట్టే స్తాను. మీ డబ్బు అప్పుడు పూర్తిగా పోతుంది. అయిదు సంవత్సరాల తర్వాత మీ ఆయిదువేలూ తిరిగి రావాలను కుంటే నా స్కీము గురించి దుష్ప్రచారం చేసే ఉద్దేశ్యం మానుకోండి-" అన్నాడు పాపారావు.

అసాధ్యుడేననుకున్నాను. ఏడవలేక నవ్వుతూ అక్క డ్నించి తిన్నగా సర్వేశ్వరరావు యింటికి వెళ్ళాను.

నా కథంతా విని సర్వేశ్వరరావు నిట్టూర్చాడు. "మీరు అనవసరంగా తొందరపడ్డారు. ఆ పాపారావు చాలా మంచి వాడు. యెదుటివాళ్లు తనని తప్పుపట్టి మాట్లాడితే అతను సహించలేడు. అందుకే మీతో అలా మాట్లాడి వుంటాడు. మీ డబ్బుకేమి ఢోకాలేదు. ఈ నెలలో రాక పోతే పై నెలలో తప్పక మీకు రెండొందలు వస్తాయి అప్పుడూ రాకపోతే ఆ పై నెలలో మూడొందలొస్తాయి.. నేను చెబుతున్నాను నమ్మండి-"

సర్వేశ్వరరావు మాటలు నాకు నమ్మకం కలిగించలేదు. "మీ మాటలు నమ్మే నేనతనికి డబ్బు కట్టాను. లేకపోతే హాయిగా ఏ బ్యాంకులోనే వేసుకుని వుండేవాడ్ని-"

"బ్యాంకులో వేసివుంటే ఇప్పుడొచ్చిన అయిదొం దలూ రావడానికి మీరింకో ఆర్నెల్లాగాల్సి వుండేది. ఆ సంగతి మరిచిపోకూడదు." అన్నాడు సర్వేశ్వరరావు.

"అది నిజమే కానీ అసలుకే మోసంవచ్చేలాగుంటే?"

"అలాంటి బెంగ మీ కనవసరం. అనుభవంమీద చెబు తున్నాను. పాపారావు యెవర్నీ మోసం చేయడు." అన్నాడు సర్వేశ్వరరావు.

"పాపారావు వ్యాపారం పడిపోతే మీ అసలుకూడా మోసం వస్తుందని బెంగగా వున్నట్లుంది. లేకపోతే ఆ

పాపారావు మోసగాడు కాదని యెలా అనగలరు?" అన్నా న్నేను కోపంలో యుక్తాయుక్త జ్ఞానం మరిచి.

నా మాటలకు సర్వేశ్వరరావు చాలా నొచ్చుకున్నాడు. "మన స్నేహాన్ని మీరు అర్థం చేసుకున్న దింతేనా?" అన్నాడతను బాధగా "ఎవడో పాపారావుకోసం నా స్నేహితుడ్ని మోసం చేస్తానా? నాకు బాగా ముడుతోంది కాబట్టి ఆ నిజం మీకు చెప్పాను."

నేను అతనికి సారీ చెప్పుకుని అక్కడ్నించి బయట పడ్డాను.

జరిగిందంతా విన్న శ్రీమతి కళ్ళనీళ్ళు పెట్టుకుని— "బహుశా మనకా అయిదువందలే ప్రాప్తం అనుకుంటాను" అంది ఆమె మాటలు నిజమేనని నాకూ మనసులో అనిపించింది. అయితే ఆ విషయం మాత్రం పైకి అనలేదు. ఈ డబ్బు గురించి మాట్లాడం కూడా నా కిష్టం లేదు.

5

ఆ తర్వాత మరో నాలుగు నెలలు గడిచాయి.

పాపారావు మొండిచెయ్యే చూపించాడు. అప్పుడప్పుడు నాకు యేడుపు కూడా వచ్చేది. కానీ విషయాన్ని యథాతథంగా శ్రీమతి దగ్గరకు చేర్చలేదు. నాకు ధైర్యంగా ఉండాలంటే శ్రీమతి అధైర్యపడిపోకూడదు. అందుకని ఆమె దగ్గర పాపారావు గురించి కాస్త మంచిగానే చెప్పి ఏదో ఒక నెలలో అన్ని నెలల వడ్డీ కూడా ఇవ్వగలడని నమ్మించడానికి ప్రయత్నిస్తూండేవాడిని.

ఇలా ఉండగా ఒకరోజు పాపారావు నన్ను కలుసుకుని "అదృష్టం కలిసొచ్చిందండీ, మీకివ్వాల్సిన అయిదు నెలల వడ్డీ కూడా కలిపి ఆరొందలు ఇస్తాను...." అన్నాడు.

నేనాశ్చర్యపోయాను — హఠాత్తుగా పాపారావుమీద గౌరవం పెరిగింది. "థాంక్స్" అన్నాను.

"అయితే మీరు నాకో చిన్న సాయం చేయాలి—" అన్నాడు పాపారావు.

"ఏమిటది?" అన్నాను అనుమానంగా కంగారుగా.

"వీర్రాజుగారు తెలుసుగదా మీకు?" అన్నాడు పాపారావు.

"బాగా తెలుసు—ఏం?" అన్నాను.

"ఏమీ లేదు. ఆయన నా దగ్గర ఆరువేలు దాచాలను కొంటున్నారు. తనకు తెలిసినవాళ్ళెవరైనా స్కీములో జేరారా అనడిగారాయన. నేను చూపించగా లిస్టులో పేర్లు చూసి మిమ్మల్నెరుగుదునన్నారాయన. మీరీరోజు ఆయన్ను పనిగట్టుకుని నా స్కీములో జేరడానికి ప్రోత్సహించాలి." అన్నాడు పాపారావు.

అర్థమైంది నాకు—"చూస్తూ చూస్తూ నా స్నేహితుడ్ని మోసగించడమా?" అన్నాను.

"ఇందులో మోసమేమీ లేదు. కాస్త ఆలస్యమైనా మీ వడ్డీ అందుతూనే ఉంది. నా దగ్గర ఇలా నలుగురు కష్టమర్సు జేరితేనే కదా నేను మీకు సాయపడగలిగేది-" అన్నాడు పాపారావు.

కాసేపు పాపారావుతో వాదించానుగానీ ఫలితం లేక పోయింది నా ఒక్క మాటమీద వీర్రాజతనికి డబ్బు కడతాడు. అందులోంచి ఆరొందలు పాపారావు నా కిస్తాడు. వీర్రాజుకు నేను నిజం చెప్పానా నాకు ఆరొందలు నష్టం.

నాలోని స్వార్థం స్నేహాన్ని జయించింది. నేను పని గట్టుకుని వీర్రాజింటికి వెళ్ళాను. పాపారావు గురించి చాలా గొప్పగా చెప్పాను. మాటల మధ్యలో వీర్రాజు—"నువ్వు

పాపారావు తరఫున ప్రచారానికొచ్చినట్లుందే?" అన్నాడు. అతని మాటలకు నేను నొచ్చుకున్నాను. అప్పుడు నాకు ఒకప్పుడు నేనూ సర్వేశ్వరరావు నిలాగే అనడం గుర్తు కొచ్చింది. అప్పుడతనూ నొచ్చుకుని— "ఒకసారి పాపా రావు స్కీములో చేరితే మీరూ అతనికి ప్రచారకులుగా మారతారు. ఆ స్కీము ఆకర్షణ అలాంటిది—" అన్నాడు.

ఆ మాటలు ఎంత నిజం?

వ్యాపారం చేతగాదనుకునే నేను పాపారావుకి వ్యాపారం చేసిపెడుతున్నాను. మోసం చేయడం ఇష్టం లేక వ్యాపారం జోలికి వెళ్ళకూడదనుకున్న నేను పాపా రావుకోసం మిత్రద్రోహం చేస్తున్నాను.

మర్నాడు వీర్రాజు స్కీములో జేరాడు. నాకు పాపా రావునించి ఆరొందలు ముట్టాయి. "ఇలా మంచి మంచి కస్టమర్ని దొరికినప్పుడల్లా మీకు డబ్బు ఇస్తూంటాను. మీ సహకారం నాక్కావాలి—" అన్నాడు పాపారావు.

నేను శాశ్వతంగా పాపారావుకి బానిసనని అర్థమై పోయింది. నిన్న నేను వీర్రాజుకి చెప్పిన అబద్ధం ఎప్ప టికీ ఒప్పుకోలేనిది. పాపారావు మోసం చేస్తున్నాడని అన్నానంటే నేనూ మోసగాడినే అవుతానుకదా. కావా లని స్నేహితుడ్ని తప్పుదారి పట్టించినవాడ్ని అవుతాను కదా! అందుకే తను మోసపోయినట్లు సర్వేశ్వరరావు నా దగ్గర ఒప్పుకోకుండా పాపారావుని పొగిడాడు. నేనూ అంతే చేయాలి.

ఈ సందర్భంలో నాకో కధ గుర్తు వచ్చింది.

కొందరు మనుషులు ఓ శిధిలాలయానికి వెళ్ళారుట. అక్కడ ఓ పురాతనమైన వినాయక విగ్రహం ఉన్నదట.

ఒకడు ఆ వినాయకుడి బొడ్లో వేలు పెడితే అందులో చాలాకాలంగా మకాం ఉంటున్న తేలు వాడిని కుట్టిందిట. వాడు చటుక్కున ఆ వేలు తీసి ముక్కుదగ్గర పెట్టుకుని "ఆహా ఎంతమంచి సుగంధం?" అన్నాడుట. తనకులాగే ప్రతి ఒక్కడూ ఆ తేలుచేత కుట్టబడాలని వాడి కోరిక. వాడి మాటలు నమ్మి అందరూ ఆ తేలువాత బడ్డారు. ఆఖరివాడు మాత్రం "బాబోయ్-యేదో కుట్టింది" అని అరిచాడుట. అప్పుడు అంతా కలిసి ఆ తేలుని చంపి వైద్యం చేయించు కున్నారుట.

పాపారావు స్కీము వినాయకుడి బొడ్డులాంటిది. అందుతో వేలుపెట్టిన ప్రతివాళ్ళనీ తేలు కుడుతుంది. కానీ వాడింకొకరిని ఆ బొడ్డులో వేలు పెట్టేలా చేస్తాడు.

ఏళ్ళు గడిచిపోతున్నాయి— "బాబోయ్ — ఏదో కుట్టింది." అనేలాంటి మనిషి ఎవ్వరూ ఇంకా పాపారావు స్కీముకి తగల్లేదు.

విచారించి ఏం లాభం? ఈ దేశంనిండా నా లాంటి ప్రజలే వున్నారు మరి! □

"నాకు వీలుకాదు"

ఒక లావుపాటి వ్యక్తి బస్ ఎక్కి కండక్టర్‌తో "నన్ను చార్మినార్ వద్ద దింపేయండి" అన్నాడు.

కండక్టర్ అతన్ని ఎగా దిగా చూసి "నాకు వీలుకాదు, మీరే దిగండి స్టాపు రాగానే చెపుతాను," అన్నాడు.

సీక్రెట్ గ్యాంగ్

'సికిందర్'

(గతసంచిక తరువాయి)

"మిస్టర్ లాల్, ఇవి సపరేట్ మర్డర్స్ కావు. లింక్ మర్డర్స్. అన్ని హత్యలకీ వొకే హస్తముంది. అంటే వొక హస్తం కావచ్చు, కొన్ని హస్తాల సముదాయం కావచ్చు—ఎందుకంటే అన్ని ఉత్తరాల మీదా వొకే దస్తూరీ వుంది కాబట్టి. ఒకవేళ ఈ అయిదు హత్యల వెనక అయిదు వొకదానికొకటి సంబంధంలేని వేర్వేరు హస్తాలుండి, ఈ హత్యలు వ్యక్తిగత కక్షతో చేయబడిన

వైతే, అన్ని ఉత్తరాల మీదా వాకే దస్తూరీ వుండేదికాదు. కామెంట్ ప్లీజ్?"

"అది తిరుగులేని పాయింట్."

"థాంక్స్. ఇది అంతిమ హత్య అని శత్రువులు సూచించారు. అభిప్రాయం?"

"నో కామెంట్."

కృష్ణన్, లాల్‌ని సూటిగా చూశాడు, "మీ రెండుకో నీరసంగా కన్పిస్తున్నారు. వాటీజ్‌ది మాటర్?"

"జస్ట్ ఎ మాటర్ ఆఫ్ టైమ్. ఫేచి చూడండి."

"మంచిది. లాబ్‌లో కుర్చీమీద నాకో సిగార్‌లైటర్ దొరికింది. ప్రస్తుతం అది ఫింగర్‌ప్రింట్ ఎక్స్‌పర్ట్ దగ్గర వుంది. శవం జేబులో కూడ వాక సిగార్ లైటర్ దొరికింది. ఇవి లభించిన స్థలాల్ని గుర్తించడానికి వీటిని మార్క్ చేశాం. అయితే మిస్టర్ లాల్, ఈ రెండు లైటర్స్ మీదా వేలిముద్రలున్నాయి. ఎందుకైనా మంచిదని శవం వేలిముద్రలు తీసుకున్నాం. అయితే కుర్చీమీదవున్న లైటర్ ఎవరిది?"

"మీది కాదేమో చూసుకున్నారా?"

కృష్ణన్ నవ్వాడు: "మీ రిప్పుడు మూడ్‌లో లేరు. సందేహాలడక్కుండా నాకు తెలిసిన విషయాలు మీకు చెప్తాను. హత్య జరిగాక లాబ్‌సోదా చెయ్యబడింది. బీరువా లోంచి కొన్ని పత్రాలు అదృశ్యమయ్యాయని నా అనుమానం. బీరువాలో నాలుగు ఫైళ్లు చిందరవందరగా పడేసి వున్నాయి. వాటిలో ఒక ఫైలు నుంచి కొన్ని కాయితాలు తొలగించినట్టు స్పష్టంగా కన్పిస్తుంది.

"మనకు దొరికిన ఆకుపచ్చ టాబ్లెట్స్ ప్రొఫెసర్ మారుతీరావ్ తయారుచేస్తుండవచ్చు. దాని ఫార్ములా

కోసం హంతకులు ప్రయత్నిస్తున్నారు. ఇప్పుడు రావ్‌ని చంపేశారు. పార్ములా కాయితాలు వాళ్ళకి చిక్కాయి. గాడ్ డామిట్! ఆ టాబ్లెట్‌లో కెమికల్స్ ఏమిటో మా ఎనాలిస్ట్‌కి అంతుబట్టటంలేదు-మొత్తానికి అందులో ఏదో భయంకర శక్తిదాగి వుందంటున్నాడు—"

"అందుకే దాన్ని కనుక్కునేందుకు భయపడుతున్నాడు ఎక్కడ కబళిస్తుందోనని" అన్నాడు లాల్.

కృష్ణన్ నవ్వాడు, "లాబ్‌లో యెక్కడా అలాటి టాబ్లెట్స్ లేవు. ఎలాటి కెమికల్ ప్రిపరేషన్స్ లేవు. రావ్‌కి ఉత్తరం ఎప్పుడు అందిందో తెలియదు. ఇన్ని హత్యలు జరిగినా ఎందుకు మౌనం వహించాడో, తనకి వార్నింగ్ అందినా యెందుకు నిర్లక్ష్యం చేశాడో అర్థం కావడంలేదు. అన్నిటికీ మించి మీ వూహ ఎలా తల్లక్రిందులైందో అంతుబట్టడంలేదు!"

"అంతుపట్టని ఆలోచనలతో కుస్తీ పడుతుండండి. నేనొక ముఖ్యమైన పనిమీద వెళ్తున్నాను."

"ఎక్కడికి?"

"ప్రొఫెసర్ అసిస్టెంటు దివాకర్ దగ్గరికి."

44

జెట్ స్పీడుతో కారు తోలుతున్నాడు లాల్.

నిర్మానుష్యంగా వున్న రోడ్లమీద ఆ వేగంతో దూసుకెళుతోన్న కారుని చూసి అక్కడక్కడ కొందరు పోలీసులు అటకాయించడానికి ప్రయత్నించారుగానీ.... అది సాధ్యం కాకపోయేసరికి, వెంటాడాలన్న మామూలు విషయం కూడా తట్టక, చేష్టలుడికి నిలబడిపోయారు.

తేరుకుని విజిల్స్ వూది, తుపాకీ పేల్చేసరికి కారు కనుమరుగవుతోంది.

లాల్ ఇవేమీ పట్టించుకోకుండా, 'డోంట్ కేర్!' అన్న ధోరణిలో సాగిపోతున్నాడు.

కానీ—

చాదర్‌ఘాట్ బ్రిడ్జిదాటి మలక్‌పేటవేపు మలుపు తిప్పుతున్నప్పుడు సడన్‌బ్రేకు వెయ్యక తప్పింది కాదు!

వరసగా నాలుగు రౌండ్స్ ఫైరింగ్ శబ్దం, జనం కేకలు, ఉన్నట్టుండి పెద్దమంట ఆ తర్వాత మళ్ళీ ఫైరింగ్ కేకలు, పెద్దగా వికటాట్టహాసాలు, పిచ్చిగా మళ్ళీ మళ్ళీ ఫైరింగ్....అంతా సినిమాలాగ కన్పిస్తోంది యెదురుగా దృశ్యం....

కానీ అది వాస్తవం.

చావు దెబ్బలు తింటున్నా జనం చెక్కుచెదరడంలేదు. ఇంకా రెచ్చిపోతూ, పూనకం వచ్చిన వారిలా అరుస్తూ అంతంత ఎత్తుకెగురుతున్నారు. ప్రతిఒక్క తుపాకీ తూటా వాళ్ళలో ఉద్రేకాన్ని వాక్కోమెట్టు పైకెక్కిస్తోంది. ఆ ఉద్రేకం వాళ్ళలో అంతర్యుద్ధానికి దారి తీస్తోంది.

పక్కని హోటల్ తగలబడుతున్నా—కాలిపోయిన భాగాలు కూలిపడుతున్నా—లెక్క చెయ్యకుండా వాక ర్నొకరు రక్కుకుంటున్నారు. చిలిపిగా గిల్లుకుంటున్నారు. కట్టలు చింపుకుని నగ్నంగా వికృతనాట్యం చేస్తున్నారు. సృష్టిలో ఏ జంతువూ కూయని కూతలు కూస్తున్నారు.

కొందరి చేతుల్లోని కాగడాలకి పోలీసు వాహనాలు ఆహుతవుతున్నాయి. హోటల్‌లో చెలరేగుతున్న మంటలు పక్కభవనాలకి వ్యాపిస్తున్నాయి—సుమారు అరగంట చాలు, పూర్తి మార్కెట్ నామరూపాల్లేకుండా పోడానికి!

లాల్ ఎడమచెయ్యి గుండెమీద వేసుకుని, వూపిరి బిగబట్టి చూస్తున్నాడు. వణుకుతున్న స్వరంతో తనలో తాను

గొణుక్కుంటున్నాడు.

వీళ్లు మనుషులుకారు! మృగాలుకారు! రాక్షసులూ కారు! ఇంతవరకూ సృష్టిలో కనీ వినీ యెరుగని వింతజీవులు? ప్రమాదకరమైన జీవులు! వీళ్లని సృష్టించిన శక్తి ఏదో క్షణాలమీద ప్రపంచాన్ని నాశనం చెయ్యగలదు! క్షణాల మీద! ప్రళయం ముంచుకొచ్చి ఈ సృష్టి నాశనమవ్వాలన్నా కొన్ని గంటలు పట్టవచ్చు. కానీ — వీళ్లని సృష్టించిన శక్తి క్షణాలమీద, ఏక కాలంలో ప్రపంచాన్ని అంత మొందిస్తుంది!

లాల్ చటుక్కుని తేరుకున్నాడు.

ఏమిటా శక్తి? ఎక్కడ నుంచి వచ్చింది? ఈ మనుషులిలా ప్రవర్తించడానికే శక్తి ప్రేరేపించింది? ఆ శక్తి సృష్టి యెలా, యెక్కడ జరిగింది?

ఈ మనుషులంతా ఈ పాశవిక కృత్యానికి పాల్పడ్డానికి వీళ్లమీద ఏదో మందు ప్రయోగించబడింది? ఏమిటది? సీక్రెట్ ఫార్ములా గాడ్ నోస్!

ఓహ్ గాడ్, ఇప్పుడేం జరుగుబోతోంది. ఆ ఫార్ములా యేమిటి? తెలియదు....దాని ఫలితం తెలుస్తోంది!

కోతిచేతిలో ఆటంబాంబు—శత్రువుల చేతిలో ఆ ఫార్ములా....ఓహ్, రాబోయే పరిణామాల్ని వూహిస్తే.... వూహించకూడదు!

పైరింజన్లు గణగణమని గంటలు మోగించుకుంటూ, వేగంగా దూసుకొస్తున్నాయి. లాల్ హఠాత్తుగా అదిరిపడి కారు స్టార్ట్‌చేసి రోడ్డువారగా ఆపాడు.

పైరింజన్లు దాటిపోయక, ఆ హృదయవిదారక దృశ్యం చూడలేక, తిరిగి స్టార్ట్‌చేసి మరో దారిగుండా మలక్‌పేట చేరుకున్నాడు.

లాల్ నీరసంగా కారు దిగి ఆ యింటి తలుపు తట్టాడు.

"ఎవరు!" స్త్రీ కంఠం అర్చిందొక్కసారిగా.

"తలుపు తెరవండి."

"ఎవరు మీరు?"

లాల్ సందేహించాడు.

"కౌన్ హై??" మళ్లీ అర్చింది స్త్రీ కంఠం.

"నేను పోలీసు మనిషిని—తలుపు తెరవండి."

అవతల నిశ్శబ్దం.

"తలుపు విరగ్గొట్టవలసి వస్తుంది — తెరవండి!" అర్చాడు లాల్.

"ఇంట్లో....ఇంట్లో యెవరూ లేరు!" బలహీనంగా అర్చిందామె.

"ఎక్కడకికెళ్లారు?"

"మీ రెవరసలు! ఏమిటీ దౌర్జన్యం!"

"మీ తమ్ముడికోసం వచ్చాను—ఎక్కడికెళ్లాడు?"

"తమ్ముడా....ఎందుకు! వాడు—వాడిక్కడ లేడు!"

"మీరు తలుపు తీస్తారా? మీతో ముఖ్యమైన విషయం మాట్లాడాలి—ఇలా అరుస్తూ కాదు."

"కానీ....ఎలా? మీ రెవరో నాకు తెలియదు. రోజులు బాగాలేవు! ఆ ఫయిరింగ్ చప్పుడు వింటోంటే నా గుండెలు ఓహ్, తర్వాత రండి!"

లాల్ అసహనంగా అటూ యిటూ చూశాడు: "భయం లేదు, నేను డిటెక్టివ్ లాల్‌ని. నా పేరు ఎప్పుడేనా విన్నారా? నా పార్ట్‌నర్ జాన్‌ని మీరు చూశారా? పత్రికల్లో ప్రొఫెసర్ల హత్యలు మేం దర్యాప్తు చేస్తున్నట్లు చదివారా?"

"అయితే దివాకర్‌తో ఏమిటి పని?"

ఆమె ఇక తలుపులు తీయదనుకుని లాల్ వొక నిశ్చ యానికి వచ్చి అన్నాడు: "దయచేసి తలుపు దగ్గర వచ్చి నిలబడండి. నెమ్మదిగా మాట్లాడుకోవాలి."

తలుపవతల దగ్గరగా గాజుల శబ్దం విని మళ్లీ అన్నాడు: "ప్రొఫెసర్ మారుతీరావ్ చనిపోయాడు. దివాకర్ నిన్న మధ్యాహ్నం నుంచి అతనికి కన్పించలేదు. ఎక్కడ వున్నాడు?"

"ప్రొఫెసర్ చనిపోయారా! ఎలా!" బలహీన స్వరంతో అడిగిందామె.

"ఇప్పుడేమీ చెప్పలేను. ఉదయం వార్తలు చూడండి. దివాకర్ ఎక్కడ వున్నాడు?"

"వారం రోజులైంది ఇంటి ముఖం చూసి!"

లాల్ ఉలికిపడ్డాడు; "ఎక్కడికి కెళ్ళాడో తెలుసా?"

"తెలియదు."

"అతని ఫ్రెండ్స్ ఎవరేనా వున్నారా?"

"ఉన్నారు. రోజూ సాయంత్రం వాళ్ళంతా సెవెన్ హిల్స్ హోటల్‌లో కాలక్షేపం చేస్తుంటారు."

అదిరిపడ్డాడు లాల్, "సెవెన్ హిల్స్ హోటల్-సుల్తాన్ బజార్‌లోనా?"

"అవును."

"ధన్యవాదాలు. మిమ్మల్ని అనవసరంగా కంగారు పెట్టినందుకు మన్నించండి. ఇక వెళ్తాను."

లాల్ కారెక్కి స్టార్ట్ చేశాడు.

సెవెన్ హిల్స్ హోటల్! కత్తిరించబడ్డ మెనూకార్డ్స్ లభించిన హోటల్! ఉత్సాహంగా సిగరెట్ వెలిగించి ఇంటి

ముఖం పట్టాడు.

ఆ రాత్రి స్లీపింగ్ పిల్ వేసుకుని నిద్రపోయాడు.

46

జాన్ నిద్రలేచి వొళ్లు విరుచుకున్నాడు. తన కోసం హంతకుడు గారిక రాడని నిశ్చయించుకున్నాడు.

చాపెల్ రోడ్ వ్యవహారంలాగే ఇప్పుడు కూడా మోసం చేశారు. అందువల్ల తను ఇక్కడ వుండటం వలన లాభంలేదు.

గబగబ కాలకృత్యాలు తీర్చుకుని అదే వేషంలో బయలుదేరాడు.

తననెవరూ గమనించరనీ, వెంటాడారనీ తెలుసు కాబట్టి తాపీగా నడిచి రోడ్డు చేరుకుని ఆటో ఎక్కాడు.

లాల్ అప్పుడే నిద్రలేచి స్నానంచేసి, టిఫిన్ తింటూ ఆలోచిస్తున్నాడు. ఇంతలో జాన్ అక్కడికొచ్చి వేషం తీసేసి టిఫిన్ కోసం కూచున్నాడు. చాలాసేపటి వరకు ఇద్దరూ మాట్లాడుకోలేదు.

టిఫిన్ పూర్తయ్యాక జాన్ అడిగాడు, "ప్రొఫెసర్ రావ్ హత్య నాకేమీ అంతుబట్టడం లేదు. హంతకులు తమ నిర్ణయం ఎందుకు మార్చుకున్నారు? ఇక అంబికా ప్రసాద్‌కి ప్రమాదం తప్పినట్టేనా?"

"అతనికి ప్రమాదం వుంటే కదా తప్పడానికి!" అన్నాడు లాల్, "సిద్ధార్థ—సర్పికలు ఇంకా పోలీసు నిఘాలో వున్నారు. హత్యా సమయంలో వాళ్లు హోటల్ లోనే వున్నారు. ఇప్పుడు నా అనుమానం ప్రొఫెసర్ రావ్ అసిస్టెంట్ దివాకర్‌పైన వుంది. అతన్ని గాలించి పట్టుకోవాలి.

మొన్న మధ్యాహ్నం నుంచి అతను ప్రొఫెసర్‌కి

కన్పించలేదు—వారం రోజులనుంచీ యింటికెళ్ళలేదు. హోటల్ సెవెన్ హిల్స్‌లో కాలక్షేపం చేస్తుంటాడని తెలిసింది. కానీ, ఈ పరిస్థితిలో అక్కడుంటాడనుకోను-పరారీలో వుంటాడు!"

"హోటల్ సెవెన్ హిల్స్ హంతకుల రహస్య స్థావరమా?"

"తెలియదు. హత్యల పథకాలన్నీ అక్కడే తయారు చేసినట్టు నా అనుమానం. రావ్ హత్యతో ఇది చివరి హత్య అని తెలియజేశారు. ఎంతవరకు నిజమో తెలియదు గానీ, తమకొక్కావలసిన ఫార్ములా వివరాలన్నీ రావ్ దగ్గర చిక్కించుకున్నారు కాబట్టి ఇక హత్యల్ని విరమించుకోవచ్చు.

హతులైన అయిదుగురు ప్రొఫెసర్లలో ముగ్గురు ఫార్ములా అన్వేషిస్తున్నవాళ్లు. వీళ్ళంతా నాశనమయ్యారు కాబట్టి ఈ హత్యల పరంపర ముగిసిందనుకోవచ్చు."

"అయితే, జాన్," మళ్లీ అన్నాడు లాల్, "శత్రువుల ఒక ఆశయం నెరవేరింది. ఇక రెండవ ఆశయం కోసం రంగంలో దిగబోతున్నారు."

"ఏమిటది?"

"ఆ ఫార్ములా రహస్యం వాళ్ళు ఛేధించారు. అంతే గాక దాన్ని జనంమీద ప్రయోగించారు."

"ఏమిటా ఫార్ములా?"

"నారాయణ గూడలో విద్యార్థినుల మధ్య ఘర్షణ రేకెత్తించిన ఫార్ములా. రెండు పత్రికా కార్యాలయాల్ని, రెండు హోటళ్లని తగులబెట్టిన ఫార్ములా. విద్యార్థి సంఘర్షణ సమితి ఆఫీసుమీద దాడి జరిపించిన ఫార్ములా. నిన్న మధ్యాహ్నం సుల్తాన్ బజార్‌లో దహనకాండ సృష్టించిన

మీ తీర్పు ఏమిటి?

కేసు నెం. 17: కామరాజు, శచీదేవి మనసాక్షిగా ఉంగరాలు మార్చుకుని భార్యా భర్తలయారు. కానీ కొంతకాలమయాక ఇద్దరికీ పడక విడిపోదామనుకున్నారు. అందుకు ఒక ఎగ్రిమెంట్ వ్రాసుకున్నారు. ఆ ఎగ్రిమెంట్ ప్రకారం విడిపోయిన తర్వాత కామరాజు నెలకు రు.200/-లు శచీదేవికి భరణం ఇవ్వాలి.

కాని, వారి కులాచారం ప్రకారం ఉంగరాలు మార్చుకుంటే వివాహం జరిగినట్లు కాదు. ఇది తర్వాత తెలిసింది కామరాజుకు. వెంటనే భరణం ఇవ్వటం నిలిపివేశాడు.

శచీదేవి కోర్టుకెక్కి ఎగ్రిమెంట్ ప్రకారం తనకు భరణం ఇప్పించమని కోరింది. లెక్కప్రకారం అసలు మా వివాహమే జరగలేదు కనుక విడిపోవటమూ, భరణమిచ్చే ప్రసక్తి లేదని వాదించాడు కామరాజు.

మరి, మీరేమని తీర్పు చెప్తారు?

నిబంధనలు: మీ తీర్పు ఒక పోస్టుకార్డుసైజు తెల్లకాగితంపై వ్రాసి, 7-2-'80 తేదీలోగా మాకు చేరేటట్లు పంపండి. హోం. డె. సభ్యులు కానివారు తమ జవాబుతో 50 పైసలు పోస్టుస్టాంపులు జతపరచాలి. అత్యుత్తమమైన తీర్పుకు రు. 25/-లు బహుమతి పంపుతాము. ఫలితాలు ఏప్రెల్ '80 నెల సంచికలో చూడండి.

డిసెంబరు '79 పోటీ ఫలితాలు

తీర్పు: మణిమాల అభియోగం చెల్లదు.

బంగారయ్య అసలు, నకిలీ రెండురకాల ముత్యాలు అమ్మాడు. మణిమాల అసలు ముత్యాలు కావాలని అడగలేదు. తనకు నచ్చిన ముత్యాలను ఎంచుకుంది. నకిలీ ముత్యాల ధర మాత్రమే చెల్లించింది. కావున ఇందులో బంగారయ్య చేసిన మోసం ఎంతమాత్రం లేదు. మణిమాల వాదన చెల్లదు.

ఈ నెల న్యాయనిర్ణేత: శ్రీమతి వై.రాజ్యలక్ష్మి, బి.ఎస్.సి., స్పెషల్ బ్రాంచ్ అసిస్టెంట్, ఎస్.బి., సి.ఐ.డి., లక్డీకాపూల్, హైద్రాబాదు—500 004.

ఫార్ములా. రాత్రి మలక్ పేటలో విధ్వంస చర్యల్ని సృష్టించిన ఫార్ములా. ఇంకా.... ఇంకా... జరగబోయే దారుణాలకి కారణం కాబోయే ఫార్ములా!"

"ఏమిటా ఫార్ములా? ఎలా ప్రయోగించబడుతోంది?"

"ప్రొఫెసర్ అరవింద్ దగ్గర దొరికిన టాబ్లెట్‌లో ఆ ఫార్ములా వుంది. శత్రువులు దాని రహస్యం తెలుసుకుని పెద్ద మొత్తంలో అలాటి మాత్రల ఉత్పత్తి ప్రారంభించారు. వాటిని ప్రజలమీద ప్రయోగిస్తున్నారు. అది ప్రజల్లో హింసా దౌర్జన్యాల్ని రెచ్చగొడుతుంది. విచక్షణా జ్ఞానాన్ని పోగొడ్తుంది. మృత్యు భయాన్ని మాయం చేస్తుంది—ఓ వందమంది మీద ఆ టాబ్లెట్స్‌ని ప్రయోగిస్తే మూకుమ్మడి దౌర్జన్యాలకి పాల్పడతారు...."

"ఓహ్, అయితే ఇప్పుడు పరిస్థితి....?"

లాల్ లేచాడు, "ఇలాటి పరిస్థితి ఇక్కడేకాదు—త్వరలో దేశమంతటా వ్యాపిస్తుంది."

"మనం ఎలా అరికట్టగలం?"

"శత్రువుల్ని పట్టుకుని."

"ఎలా పట్టుకుంటాం?"

"ముందు హంతకుల్ని పట్టుకుని."

"కానీ—లాల్—నెం 4 ఏమిటి? అది శత్రువుల కోడా?"

"అవును."

"అది వాళ్ల ఉనికిని తెలుపుతుందా?"

"ఆ నెంబర్ గురించి నేనింకా ఆలోచించలేదు. కానీ ఈ బిజినెస్‌లో మనకి చాలామంది అస్వామీలు తారసపడుతున్నారు. కాబట్టి ఇది అస్వామీ గ్యాంగ్ అనుకుంటాను. ఆల్‌రైట్, ప్రస్తుతం మనం ఎలాటి పథకాలు వేయ

అపరాధ పరిశోధన పోటీ-139

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్లకాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరిచి పంపండి. ఆల్ కరక్టుగా పంపినవారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికీ అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హో౦. డె. సభ్యులైతే వారి నెంబరుకూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ కూపనులు 7-2-'80 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు ఏప్రెల్ '80 నెల సంచికలో ప్రకటిస్తాము.*

1. ఈయన పార్టీ ఫిరాయింపుదార్ల మహానాయకుడుగా పేరు పొందారు—? (చరణ్ సింగ్, కాసు బ్రహ్మానందరెడ్డి.)

2. జీవితంలో ప్రతీవారు కోరుకొనేది—? (స్థిరత్వం, సమాజంలో గుర్తింపు.)

3. కొత్త వస్తువులు కొనేముందు దీనిని పరిశీలిస్తారు కొంత మంది—? (నాణ్యత, కంపెనీపేరు.)

4. గ్రామాభ్యుదయానికి ఇది ఎంతైనా అవసరం—? (విద్యుచ్ఛక్తి, రోడ్డు సౌకర్యాలు.)

5. దైవమే దిగి వచ్చినా ఇతడు వరమీయడు—? (పూజారి, అధికారి.)

బోవడం లేదు. ముందు దివాకర్‌ని పట్టుకోవాలి. ఆ ఫార్ములా అతని ద్వారానే శత్రువుల చేతిలో కెళ్ళిందను కుంటాను. లెటజ్‌గో!"

పావుగంట తర్వాత వాళ్లిద్దరు హోటల్ సెవన్‌హిల్స్‌లో వున్నారు.

నగరంలో ఈ నాలుగు రోజులనుంచి వ్యాపారం పూర్తిగా స్థంభించింది. వ్యాపారస్థులు తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డిటెక్టివ్‌లని చూసి హోటల్ ప్రొప్రయిటర్ ఈ సారి ఆందోళన చెందలేదు. ఆప్యాయంగా ఆహ్వానించాడు.

"ఇప్పుడేం కావాలి?"

"ఒక మనిషి కావాలి." అన్నాడు లాల్.

"ఎవరు?"

"దివాకర్. మీకు తెలుసా? తరచు ఇక్కడికొస్తుంటాడని విన్నాను."

ప్రొప్రయిటర్ ఉలికిపడ్డాడు; "దివాకరా? తెలుసు! చాలా మర్యాదగల మనిషి!"

"ఇక్కడి కొచ్చాడా?"

ప్రొప్రయిటర్ విచారంగా అన్నాడు; "వచ్చాడు. కానీ అలా ఎందుకు ప్రవర్తించాడో అర్థంగావడంలేదు!"

"ఎప్పుడొచ్చాడు? ఎలా ప్రవర్తించాడు?"

"మొన్న సాయంత్రం కర్ఫ్యూ ఎత్తేశాక వచ్చాడు. వంటరిగా వున్నాడు. దివాకర్‌ని నే నెప్పుడూ చెడ్డవాడిగా చూడలేదు. తెలివిగలవాడు. బుద్ధిమంతుడు—అన్నిటికీ మించి మాకు గౌరవనీయుడైన కస్టమర్."

"మొన్న సాయంత్రం ఏంచేశాడు?"

"ఒక యువకుడితో కొట్లాట పెట్టుకున్నాడు. ఎందుకో

టైం బాంబ్ ?

(పాఠకుల పరిశోధన పోటీ-91 ఫలితాలు)

నేరస్తుడు—జోషి.

డిటెక్టివ్ కిరీటి, బలదేవ్‌గారి అసిస్టెంట్ జోషిని కలిసి వివరంగా చెప్పమని అడిగినప్పుడు, జోషి "బలదేవ్‌గార్కి వచ్చిన బెదిరింపు వుత్తరంలో, టైంబాంబ్ పెట్టి చంపేస్తామని వ్రాశారు" అని చెప్పడమే పొరపాటు.

వుత్తరంలో బాంబ్ పెట్టి చంపేస్తామని మాత్రమే వుంది. టైంబాంబ్ అని వ్రాయ లేదు. కాని, బలదేవ్‌గారు చంపబడటం టైంబాంబ్ మూలంగానే జరిగింది.

అందుచేత జోషియే నేరస్తుడనీ, హత్యకు కారకుడనీ చెప్పవచ్చు.

—ఈ కేసుని అత్యుత్తమంగా పరిశోధించిన యీ క్రింది ఇరువురు పాఠకులకు చెరొక రు. 25/-లు బహుమతిగా పంపుతున్నాము.

(1) శ్రీ ఎమ్. రమేష్‌బాబు, ఎమ్.ఎస్.సి.,
ఆంధ్రా బ్యాంకు లిమిటెడ్,
44-23-26/2, రైల్వే న్యూకాలనీ,
విశాఖపట్టణం.

(2) శ్రీమతి డి. ప్రభావతి, (స్టెనో)
ఆంధ్ర మహిళాసభ హాస్టల్,
విద్యా నగర్,
హైద్రాబాదు - 500 960.

ఏమో తెలియదు. ఇద్దరూ తిట్టుకున్నారు. కొట్టుకున్నారు. చివరి కెలాగో జనం వారిని విడిపించారు. కానీ. ఆ యువకుడు పోలీసుల్ని వెంటబెట్టుకుని వచ్చాడు. పోలీసులు దివాకర్ని అరెస్ట్‌చేసి తీసికెళ్ళారు. తర్వాత తెలిసింది....ఆ యువకుడు మంత్రిగారి బంధువట."

"ఏ విషయం మీద తగవు వచ్చింది?"

"ఎవరికీ తెలియదు. నేను చాలా బాధ పడ్డాను. దివాకర్ ఇంకా లాకప్‌లోనే వుండవచ్చు .. కర్ఫ్యూవుంది కాబట్టి జామీను మీద విడిపించడానికి ఎవరూ రాలేదనుకుంటాను."

డిటెక్టివ్‌లు ఒకర్నొకరు చూసుకున్నారు.

ఆ తర్వాత జాన్ పోలీస్ స్టేషన్‌కి ఫోన్‌చేసి ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడాడు.

"గుడ్మార్నింగ్ ఇన్‌స్పెక్టర్. మీ లాకప్‌లో దివాకర్ అనే వ్యక్తి వున్నాడా?"

"దివాకరా? వున్నాడు. మీరెవరు?"

"డిటెక్టివ్ జాన్‌ని. దివాకర్ ఎప్పటినించి వున్నాడు?"

"మొన్న సాయంత్రం నుంచి."

"అవతలి పార్టీ అతనిమీద కేసుపెట్టిందా?"

"లేదు. రెండు రోజులు లాకప్‌లో వుంచమన్నారు."

"అసలు గొడవెందుకొచ్చింది?"

"దివాకర్ తాగిన మైకంలో అతని మీదకు సిగరెట్ పీక విసిరాడట."

"ఎందుకు? ఏదేనా ఉద్దేశ్యంతోనా?"

"కాదు—పరధ్యానంలో అలా జరిగిందంటున్నాడు. ఈ మధ్య అతని మనసు బాగా లేదట."

"ఆల్‌రైట్. మేం అతనితో మాట్లాడాలి."

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, నెల నెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి అసలు ధరకే రు. 8-00 లకు మా ఏజెంట్ ద్వారాగాని, వి. పి. ద్వారాగాని మీ ఇంటిదగ్గర అందజేయబడతాయి. ఇందుకు అయ్యే ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 5/-లు పంపటమే. పైకం మనియార్డరుద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంపవచ్చును. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము కార్డు అందుతుంది.

3. 'హోమ్ డెలివరీ' వల్ల మీకు కాపీలు నెల నెలా గ్యారంటీగా, త్వరితంగా చేరుతాయి. మీ ఇంటిదగ్గరనే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చును. కాపీలకోసం మీరు ఏజెంట్ చుట్టూ తిరుగనవసరంలేదు. కాపీలు దొరకలేదనే నిరాశ,పోస్టులో పోయే సమస్య, ఎంతమాత్రం వుండదు. పైగా సభ్యులు పోటీలలో ఫ్రీగా పాల్గొనవచ్చును.

4. ఏ కారణంచేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, వాటి పైకం రు. 8/-లు వెంటనే **M. O.** చేయాలి. కాపీలు తిరిగి 'రికార్డెడ్ డెలివరీ'లో పంపుతాము. లేదా మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

5. ఇండియాలో మీరు ఏ మారుమూలనున్నా కాపీలు ఖచ్చితంగా అందజేయబడతాయి. మీ చిరునామా మారినప్పుడల్లా తగినంత ముందుగా మాకు తెలియజేయండి.

6. పాతకాపీలు కావలసిన వారికి వాటి అసలు ధరకే వి పి ద్వారా పంపగలము. 20 కాపీలకు పైన తీసుకుంటే 20% కమీషన్ లభిస్తుంది.

7. నెల నెలా వి. పి. తీసుకోవటం కష్టమనుకునేవారు, ఏడాది పైకము రు. 90/-లు ముందుగా పంపవచ్చును దీనివల్ల మీకు ఖర్చులు కొంత తగ్గుతాయి

నేడే మీరూ 'హోమ్ డెలివరీ' లో చేరండి!

"వచ్చి మాట్లాడండి."

జాన్ ఫోన్‌పెట్టేసి లాల్‌కి వివరాలు చెప్పాడు.

లాల్ ముఖం ఎర్రబడింది. "స్ట్రేంజ్ ఎఫైర్. లెటజ్ గో." అన్నాడు. ఆ తర్వాత ప్రొప్రయిటర్‌వేపు తిరిగి, "ఆ కార్డ్సుని దివాకర్ కత్తిరించాడా?" అనడిగాడు.

"నాకు తెలియదు" అన్నాడు ప్రొప్రయిటర్.

లాల్ వెనక్కి తిరిగి బయటికి నడిచాడు. జాన్ వెంబడించాడు.

కారెక్కి పోలీస్ స్టేషన్ చేరుకున్నారు.

ఇన్‌స్పెక్టర్ డిటెక్టివ్‌లను చూసి షేక్‌హాండ్ ఇచ్చి కూచోమన్నాడు.

"మిస్టర్ లాల్, దివాకర్ వ్యవహారం నాకేమీ అర్థం గావడం లేదు!"

"అతను ప్రొఫెసర్ మారుతీరావ్ అసిస్టెంట్. ప్రొఫెసర్ రావ్ హత్య చెయ్యబడినట్టు మీకు తెలుసా?"

"తెలుసు."

"మేం దివాకర్‌ని అనుమానిస్తున్నాం. ఎలిబీని చెక్ చెయ్యడానికి వచ్చాం."

ఇన్‌స్పెక్టర్ నవ్వాడు: "మొన్న సాయంత్రంనుంచీ లాకప్‌లో వున్నాడు. అతన్నెలా అనుమానిస్తారు?"

డిటెక్టివ్‌లు ఒకర్నొకరు చూసుకున్నారు.

"ఆల్‌రైట్, అతన్ని తీసుక రండి, మాట్లాడాలి." అన్నాడు లాల్.

అయిదు నిమిషాల తర్వాత ఒక కానిస్టేబిల్‌తో వచ్చాడు దివాకర్. అతని వయసు ముప్పై లోపు వుంటుంది. చక్కగా ఆరోగ్యంగా వున్నాడు.

లాల్ అతన్ని చూసి, "మీ గురించి విన్నాను.

అపరాధ పరిశోధన పోటీ-137

[ఫలితాలు]

డిసెంబరు '79 నెల "అపరాధ పరిశోధన పోటీ—137"కి సరియైన సమాధానాలు:

1. లోక్‌దళ్.
2. దొంగసొమ్ము.
3. బస్సులు.
4. కులతత్వం.
5. సోమరులు.

పై జవాబుల ప్రకారం యిద్దరు పాఠకులు ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి మార్చి '80 నెలనుండి ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ బహుమతిగా పంపబడుతుంది.

(1) శ్రీ పి. విశ్వనాథం,
97-ఏ.ఎమ్.సి. మెన్స్ హాస్టల్,
విశాఖపట్టణం—530 002.

(2) శ్రీ కర్రి సాంబశివరెడ్డి,
1-78, శాంతిపురం,
అనపర్తి, (తూ. గో. జిల్లా.)

హోటల్‌లో గొడవ జరగడానికి కారణమేమిటి?"

"నా పరధ్యానం! పొరపాటున సిగరెట్ అతని మీదికి విసిరాను—అంతే, పోట్లాట ప్రారంభమైంది." అన్నాడు దివాకర్.

"మీరు పరధ్యానంగా ఎందుకున్నారు?"

"ఈ మధ్య నా మనసు బాగా లేదు. ఇప్పుడు పూర్తిగా వికలమైంది."

"ఎందుకు?"

"ప్రొఫెసర్‌తో నాకు ఘర్షణ జరిగింది—వారంక్రితం. అందుకు నేను పశ్చాత్తాపపడ్డాను. ఇప్పుడాయన్ని దారుణంగా చంపారని విన్నాను—ఈ వార్త నా మనసును కలచివేసింది."

"ప్రొఫెసర్‌తో యెందుకు ఘర్షణ జరిగింది?"

దివాకర్ కాసేపు మౌనం వహించి అన్నాడు. "ఆయన చేస్తున్న రీసెర్చిలో నేను సహాయపడుతున్నాను. ఆకస్మాత్తుగా ఆయన ఆ రీసెర్చి ఆపేయాలని నిర్ణయం తీసుకున్నారు—ఇది నా కిష్టం లేదు."

"ఆ రీసెర్చి ఏమిటి?"

దివాకర్ మళ్ళీ కాస్సేపు మౌనం వహించి అన్నాడు, "మిస్టర్ లాల్, నేడు ప్రపంచంలో మనిషి మనుగడ సుఖవంతం చెయ్యడానికి ఎందరో శాస్త్రజ్ఞులు యెన్నో ప్రయోగాలు చేస్తున్నారు. నిరంతరం అనేక కొత్త విషయాల్ని ఆవిష్కరిస్తున్నారు. వీటిలో కొన్ని విశిష్టమైన పరిశోధనల గురించి బహుశ మీకు తెలియదనుకుంటాను.

"ఉదాహరణకి ఒక ప్రయోగం గురించి చెప్తాను:

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

(బహుమతి రు. 50/-లు నగదు)

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని ఓ పోస్టుకార్డు సైజు తెల్ల కాగితంపై వ్రాసి 7—2—'80 తేదీ లోపల మాకు చేరేటట్లు పంపండి.

ఇదేవిధంగా "సప్లిమెంట్" ముఖచిత్రాలకు కూడా మీ వ్యాఖ్యలు పంపవచ్చును. రెండు పత్రికల వ్యాఖ్యలు వేరువేరు తెల్లకాగితాలపై వ్రాసి పంపాలి. హోం.డె. సభ్యులు కాని వారు తమ వ్యాఖ్యలతో 50 పైసల స్టాంపులు జతపర్చాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఒక్కొక్కరికి రు. 25/-లు బహుమతి పంపుతాము. ఫలితాలు ఏప్రెల్ '80 నెల సంచికలో చూడండి. *

డిసెంబరు '79 పోటీ ఫలితాలు

(1) డిసెంబరు '79 నెల "అపరాధ పరిశోధన" ముఖ చిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

అశ్వికులు నలుగురు,
అతివకు శత్రువులే!!

పంపినవారు: శ్రీ పొట్నూరు రజనీకాంత్, మెయిన్ రోడ్, బెలగాం, పార్వతీపురం—532 501.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

కదిలితే చావు ఖాయం!
అరిస్తే రారు సాయం!!

పంపినవారు: శ్రీ యం. శంకరరెడ్డి, మెయిన్‌రోడ్, బెల్లంపల్లి (ఆదిలాబాద్ జిల్లా.)

పై విజేతలు ఇరువురికీ చెరొక రు. 25/-లు చొప్పున బహుమతి పంపబడుతుంది.

కొందరు సైంటిస్టులు ఒక కొత్త రకం 'పిల్' తయారు చెయ్యడానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. ఆ 'పిల్'ని ఎవరైనా నేరస్థుడి మీద ప్రయోగిస్తే, తను చేసిన నేరాల్ని పాఠం ఒప్పజెపుతాడు. ఇక నేరస్తుల నుంచి ఎలాటి చిత్రవధ లేకుండా వాళ్లు చేసిన నేరాల్ని తెలుసుకోవచ్చు! ఈ 'పిల్' వలన కాలం వృధా కాదు. సహనాన్ని పరీక్షించదు. నేరస్థుడిమీద ప్రయోగిస్తే చాలు, నిమిషాల మీద శిక్షించివచ్చు!

"ప్రొఫెసర్ రావ్ కూడా ఇలాటి కోవకి చెందిందే మరోరకం 'పిల్' కోసం ప్రయత్నిస్తున్నారు. దానివలన నేడు సమాజంలో కన్పిస్తున్న నిరాశా నిస్పృహలు— ముఖ్యంగా యువతరంలో—నివారించవచ్చు. ఇది మనుషుల్లో ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని, సంతోషాన్ని పుట్టిస్తుంది. చీకూ చింతలూ, కష్టాలూ బాధలూ అన్నీ మర్చిపోయి కళకళలాడుతూ జీవిస్తుంటారు. మనిషి మెదడులో కొన్ని ఆమ్లాలుంటాయి. వాటిమీద ఈ 'పిల్' ప్రభావంతో అలాటి చైతన్యం కలుగుతుంది."

"అయితే ఈ పరిశోధన ఎందుకు విరమించుకోవాలని అనుకున్నారు? దానివల్ల యేదేనా ప్రమాదం వుందా?"

"కాదు!" అర్చాడు దివాకర్, "ఈ పరిశోధన విజయవంతమైతే ప్రపంచం ఆయన్ని హర్షిస్తుంది. అంతులేని సంపద ఆయనకి చేకూరుతుంది. ఆయన ఆ నిర్ణయం ఎందుకు తీసుకున్నారో అర్థంగావడంలేదు. ఈ రీసెర్చివలన మంచి ఫలితాల్ని ఎన్నో విధాలుగా ఆయనకి వివరించాను. వినలేదు. నాకు ధనాశ ఎక్కువ. అందుకే పరిశోధన